సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 219

గురువారం 31-10-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'



**భారత అంతర్గత వ్యవహారం**

ఆర్టికల్ 370 రద్దు పై ఈయూ బృందం.. కశ్మీర్‌లో పర్యటన -5లో



**రవీందర్‌కు రజతం**

ప్రపంచ అండర్–23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్ - స్పోర్ట్స్‌లో



# బంగారం ఎక్కువైతే.. 'బరువైద్ది'!

## లెక్క చూపని పసిడిపై కేంద్రం కన్ను!

- ప్రభుత్వ పరిశీలనలో 'క్షమాభిక్ష' పథకం...
- 'పెద్ద నోట్ల' మాదిరిగానే వెలికితీసే యోచన
- స్వచ్ఛందంగా వెల్లడించి పన్ను చెల్లించే అవకాశం

పెద్దనోట్ల రద్దు గుర్తుందా? నల్లధనాన్ని వెలికితీసే ఉద్దేశంతో రూ.500, రూ.1000 నోట్లను ప్రధాని మోదీ అకస్మాత్తుగా రద్దు చేసిన విషయాన్ని అంత తేలిగ్గా మరచిపోలేం. ఇప్పుడు అలాంటిదే మరో కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈసారి కేంద్రం కన్ను.. భారతీయులు ఎక్కువగా మక్కువ చూపించే పసిడిపై పడింది. లెక్కలు లేకుండా పరిమితికి మించి ఉన్న బంగారాన్ని వెలికి తీసేందుకు హస్తినలో కసరత్తు సాగుతున్నట్టు సమాచారం. పన్ను చెల్లించని ఆదాయంతో పోగేసుకున్న పుత్తడిని.. నిర్దేశిత పన్ను చెల్లించి చట్టబద్ధం చేసుకునే పథకానికి కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే ఓ వ్యక్తి ఎంత మొత్తంలో బంగారాన్ని కలిగి ఉండవచ్చో కూడా ఇందులో నిర్దేశించనుంది. - బిజినెస్‌లో



## బిడ్డకు రక్తం పంచబోతున్నారా?



మన దేశంలోని మహిళల్లో రక్తహీనత (అనీమియా) చాలా ఎక్కువ. దాదాపు 80% మందిలో రక్తహీనత ఉందని ఒక అంచనా. ఓ మోస్తరు రక్తహీనత దీర్ఘకాలం కొనసాగినా రకరకాల అనర్థాలు వస్తాయి. అయితే గర్భిణీల్లో రక్తహీనత వల్ల ఇటు కాబోయే తల్లికీ, అటు పుట్టబోయే బిడ్డకూ ప్రమాదమే. కాబట్టి వారు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లోనూ అనీమియా కేసులు ఎక్కువే.. ముఖ్యంగా గర్భవతుల్లో. కాబట్టి ఈ రక్తహీనత వల్ల వచ్చే అనర్థాలు, దాన్ని అధిగమించడానికి మార్గాలను తెలుసుకుందాం. - ఫ్యామిలీలో

# అవసరమైతే మిలియన్ మార్చ్

## టీజేఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

- ప్రగతిభవన్‌లో కేసీఆర్ ఒంటరయ్యారు
- ఆర్టీసీ కార్మికులకు పార్టీలు, ప్రజల మద్దతుంది
- విజయతీరాలకు చేరువగా ఉన్నారు.. ఆత్మహత్యలు చేసుకోవద్దు
- సరూర్‌నగర్‌లో 'సకల జనభేరి'.. భారీగా వచ్చిన కార్మికులు

సాక్షి, హైదరాబాద్

'ఆర్టీసీ పరిరక్షణకు జరుగుతున్న పోరాటంలో కార్మికులు విజయతీరాలకు ఎంతో దూరంలో లేరు. అనుమానమొద్దు.. విజయం మనదే. ప్రగతి భవన్‌లో కేసీఆర్ ఒంటరయ్యారు. ఆయన వెంట మంత్రుల్లేరు. ఎమ్మెల్యేలు లేరు. కానీ ఆర్టీసీ కార్మికుల వెంట రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, అన్నింటికీ మించి ప్రజలున్నారు. ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేసే క్రమంలో అవసరమైతే ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ నిర్వహిద్దాం'అని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రభుత్వంలో విలీనం అయితే తప్ప ఆర్టీసీ బతకదని, దాన్ని కచ్చితంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమ్మె కార్యాచరణలో భాగంగా ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 'సకల జనభేరి'సభకు ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా కార్మికులు సభకు తరలివచ్చారు. ఇండోర్ స్టేడియంలో మాత్రమే సభ నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వడంతో, లోపల

మిగతా 2వ పేజీలో ▶




బుధవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సకల జనభేరి సభలో అభివాదం చేస్తున్న అఖిల పక్ష నేతలు

### గమ్యం చేరి తీరాలి: అశ్వత్థామరెడ్డి

కార్మికులు గెలుపు కోసం పోరాడుతుంటే, ప్రభుత్వం ఓడిపోవొద్దని పోరాడుతోందని, ఏదో సమయంలో కచ్చితంగా ప్రభుత్వం పట్టు సడలి ఓడిపోవటం ఖాయమని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. గమ్యాన్ని చేరి తీరాల్సిందేనని, ఇందుకు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతామని అన్నారు. తెలంగాణ వస్తే బతుకులు బాగుపడతాయనుకుంటే ఆర్టీసీని ప్రైవేటీక రించే తరహా పరిస్థితులు ఉత్పన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. నిర్బంధాన్ని ఛేదించుకుని వేల సంఖ్యలో కార్మికులు ఈ సభకు తరలివచ్చారని, ఇదే ఉత్సాహంతో అనుకున్నది సాధించేందుకు ముందుకు సాగుతారని జేఏసీ కోకన్వీనర్ రాజిరెడ్డి అన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేస్తే యూనియన్లనే తాము రద్దు చేసుకుంటామన్నారు.

## తేరే మేరే బీచ్ మే

- మహారాష్ట్రలో మళ్లీ బీజేపీ, శివసేన సర్కారేనా ?
- త్వరలోనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న ఫడ్నవీస్
- శివసేనకు డిప్యూటీ సీఎం ఇచ్చే చాన్స్ - వివరాలు 5లో









# వెంటాడిన డెంగీ

## ఒకే కుటుంబంలో నలుగురు మృత్యువాత



లింగయ్య



రాజగట్టు



సోని



శ్రీవర్షిణి

- పదిహేను రోజుల్లో కూతురితో సహా భార్యాభర్తలు, తాత మృతి
- జన్మనిచ్చిన బిడ్డను చూసుకోకుండానే తల్లి మరణం
- మంచిర్యాలలో తీరని విషాదం..

సాక్షి, మంచిర్యాల/మంచిర్యాలటౌన్/రాంగోపాల్‌పేట్

తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో డెంగీ విజృంభిస్తోంది. ఓ కుటుంబాన్ని వీడని నీడలా వెంటాడి ఛిద్రం చేసేసింది. పదిహేను రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో నలుగురు వ్యక్తులు డెంగీ బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. తొలుత భర్త, తర్వాత తాత, ఆపై ముద్దుల కూతురు.. ఇప్పుడు ఏకంగా జన్మ నిచ్చిన బిడ్డను చూసుకోకుండానే తల్లినే కబళించేసింది మహమ్మారి డెంగీ జ్వరం. వైద్యాధికారుల్ని, ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసే ఈ హృదయ విదారక ఘటనల వివరాలిలా ఉన్నాయి.

**ఒకరి వెనుక ఒకరు..**

మంచిర్యాల జిల్లా కేంద్రం శ్రీశ్రీనగర్‌లో నివాసం ఉంటున్న ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు గుడిమల్ల రాజగట్టు (30), సోని (28) దంపతులు. రాజగట్టుకు జ్వరం రావటంతో ఈనెల 12న స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేరి, మూడ్రోజుల పాటు చికిత్స తీసుకున్నాడు. ఎంతకూ జ్వరం తగ్గకపోగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 16న మృతిచెందాడు. మృతుడికి సంబంధించిన ఐదోరోజు కర్మ కార్యక్రమాలను నిర్వహిస్తుండగానే రాజగట్టు తాత లింగయ్య(80)కు జ్వరం వచ్చింది. దీంతో లింగయ్యను అదేరోజు రామకృష్ణాపూర్ సింగరేణి ఆస్పత్రిలో చేర్పించగా

మిగతా 3వ పేజీలో ▶



బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్‌తో మంత్రి కేటీఆర్

# రాష్ట్రంలో శానిటేషన్ హబ్

## డిసెంబర్‌లో అధికారిక ప్రకటన: కేటీఆర్

- దక్షిణాసియాలో సేవలు అందించేలా ప్రణాళిక
- కేంద్రం రూ.100 కోట్ల మేర సీడ్ ఫండింగ్ చేయాలి
- కేంద్ర మంత్రి హర్దీప్‌కు కేటీఆర్ వినతి
- రక్షణశాఖ భూములు బదలాయించాలని రాజ్‌నాథ్‌కు విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో శానిటేషన్ హబ్ నెలకొల్పనున్నామని, దేశవ్యాప్తంగా, దక్షిణాసియాలోనూ పారిశుద్ధ్య నిర్వహణలో సేవలందించేలా ప్రణాళిక రూపొందించామని పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు కేంద్రానికి నివేదించారు. ఈ మేరకు కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురిని కలసి ఈ అంశమై చర్చించారు. తాము హైదరాబాద్‌లో నెలకొల్పబోయే 'అర్బన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో ఇది ఒక భాగంగా ఉంటుందని వివరించారు. 'అత్యంత నివాస యోగ్యమైన నగరాలున్న ప్రాంతంగా నిలవడమే లక్ష్యంగా తెలంగాణ ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో వృద్ధి సాధిస్తోంది. తెలంగాణ, అలాగే దేశంలోని ఇతర ప్రాంతాలు, దక్షిణాసియా

మిగతా 3వ పేజీలో ▶

## ఇటు భాగ్యనగరం.. అటు ఉక్కునగరం!

వాతావరణం, భిన్న సంస్కృతులు, భాషలు, తక్కువ క్రైం రేట్, క్రమంగా ఊపందుకుంటున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హైదరాబాద్, విశాఖపట్నం వైపు చూసేలా చేస్తున్నాయి.

- వివరాలు 14లో

## నవ కశ్మీరం

కేంద్రపాలిత ప్రాంతాలుగా జమ్మూ కశ్మీర్, లదాఖ్

పునర్వ్యవస్థీకరణ చట్టం నేటి నుంచి అమలు

- వివరాలు 5లో

## ముందస్తుకు బ్రిటన్ జై

బ్రెగ్జిట్ సంక్షోభాన్ని నివారించడానికి బ్రిటన్ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు సిద్ధమైంది. దీంతో డిసెంబర్ 12న ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు మొదలయ్యాయి.

- వివరాలు 5లో

## ఇదండీ సంగతి



.. దామకోవాల్సిన అవసరం ఏముందండీ!



# ఓటీపీ లేకుండానే ఖాతా ఖాళీ

## డెబిట్ కార్డులతో 'ఓవర్సీస్' దోపిడీ

- కార్డుదారులకు తెలియకుండానే లావాదేవీలు
- అప్రమత్తమయ్యేలోపే జరిగిపోతున్న నష్టం
- రోజురోజుకూ పెరిగిపోతున్న బాధితులు
- కొత్త పంథాలో వెళ్తున్న సైబర్ నేరగాళ్లు
- గిఫ్టులు, లాటరీల పేరుతో ఎర
- కార్డుల వివరాలు చెప్పేస్తున్న అమాయకులు
- గూగుల్ పే, పేటీఎం, ఫోన్‌పే యాప్‌ల్లోనూ మోసాలు

> **చిక్కరు దొరకరు..**
>
> ఈ తరహా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఇలాంటి నేరాల్లో మోసపోవడం ఎంత తేలికో నేరగాళ్లు చిక్కడం, డబ్బు రికవరీ కావడం అంతే కష్టం. బ్యాంకింగ్ సహా ఇతర ఆర్థిక సంస్థలతో ఇబ్బంది వచ్చినా.. సమస్యలు ఎదురైనా నేరుగా వాటినే సంప్రదించాలి. ఇంటర్‌నెట్‌లో లభించే కాల్‌సెంటర్ల నంబర్లను సమాచారం కోసమే వాడుకోవాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎం–పిన్‌ను ఎవరి నంబర్‌కూ పంపొద్దు. గూగుల్‌లో కనిపించేవన్నీ నిజమైన కాల్ సెంటర్లని నమ్మితే నష్టపోతారు.
>
> – సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్

సాక్షి, హైదరాబాద్: 'ఎస్‌బీఐ డెబిట్‌కార్డు XXXXX5005తో 2019 అక్టోబర్ 3న రూ.13,638.52 విలువైన నగదు లావాదేవీ XXXXX1903 ట్రాన్సాక్షన్ నంబర్‌తో 'డబ్ల్యూపీజీటీఐడీ01'వెండర్ వద్ద చేశారు. ఒక వేళ మీరు ఈ లావాదేవీ చేయకపోతే కార్డును బ్లాక్ చేసేందుకు 9223008333కు ఎస్ఎంఎస్ లేదా 9449112211కు కాల్ చేయండి'అని ఫోన్‌లో ఎస్ఎంఎస్ అందిన వెంటనే హైదరాబాద్‌కు చెందిన వినయ్‌కుమార్ (పేరుమార్చాం) అవాక్కయ్యాడు. తన డెబిట్ కార్డు తన దగ్గరే ఉన్నా, కార్డు నంబర్లు, వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ), పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరితో షేర్ చేసుకోకపోయినా, తనకు కనీస సమాచారం లేకుండా తన కార్డుతో ఎలా ఈ లావాదేవీ జరిగింది? ఎవరు చేశారు? అని ఆశ్చర్యపోయాడు. వెంటనే కార్డును బ్లాక్ చేయించి తన బ్యాంకు బ్రాంచి మేనేజర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. బాధితుడి డెబిట్‌కార్డు నంబర్, సీవీవీ నంబర్లను వినియోగించి లండన్ కేంద్రంగా పనిచేస్తున్న 'ఆలీబాబా డాట్ కమ్' అనే విదేశీ ఈ–కామర్స్ సంస్థ నుంచి గుర్తు తెలియని దుండగులు ఏదో వస్తువు కొనుగోలు చేశారని, ట్రాన్సాక్షన్ స్టేట్‌మెంట్ పరిశీలించిన అనంతరం బ్యాంకు అధికారులు వెల్లడించారు. ఇలాంటి కంపెనీలతో జరిపే విదేశీ (ఓవర్సీస్) ట్రాన్సాక్షన్లకు ఓటీపీ అవసరం ఉండదని, డెబిట్/క్రెడిట్‌కార్డు నంబరు, సీవీవీ నంబర్లను సైబర్ నేరస్తులు హ్యాకింగ్/ఫిషింగ్/ఫేక్ ఫోన్‌కాల్స్ తదితర అక్రమ పద్ధతుల ద్వారా సేకరించి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. డెబిట్‌కార్డు/క్రెడిట్‌కార్డుతో ఆన్‌లైన్‌లో జరిపే

మిగతా 2వ పేజీలో ▶

# అవసరమైతే మిలియన్ మార్చ్

► మొదటి పేజీ తరువాయి

స్థలం లేక భారీ సంఖ్యలో కార్మికులు బయటే ఉండిపోయారు. ఇంత భారీ ఉద్యమం శాంతియుతంగా నిర్వహించటం చిన్న విషయం కాదని, ప్రపంచవ్యాప్తంగా అరుదైనదని పేర్కొన్నారు. కార్మికులు తమ జీతాల కోసం సమ్మె చేయట్లేదని, సంస్థను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవాలన్న ఉద్దేశంతోనే చేస్తున్నారని చెప్పారు. ఈ తపన ఎంత బలంగా ఉందో.. సకల జనభేరి సభకు 50 వేల మంది రావటమే నిదర్శనమన్నారు. ప్రభుత్వ వైఖరిని హైకోర్టు తప్పుపడుతున్నా ఇప్పటివరకు సీఎంలో చలనం లేదని దుయ్యబట్టారు. ఆర్టీసీ నష్టాలకు కార్మికులే కారణమంటూ సీఎం అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ చెబుతున్నట్లు కార్మికులకు సగటు జీతం రూ.50 వేలు లేనే లేదని, వారివన్నీ తక్కువ జీతాలేనని స్పష్టం చేశారు. చిన్నచిన్న కారణాలకే కార్మికుల ఇంక్రిమెంట్లు కట్ చేస్తున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన చర్చల సమయంలో కార్మిక సంఘం నేతలను అధికారులు అవమానించారని మండిపడ్డారు. దీన్ని కార్మిక సంఘం నేతలు సమర్థంగా ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఇప్పటికే 15 మంది కార్మికులు మృతి చెందారని, ఇంకా ఎంత మందిని సీఎం బలి తీసుకుంటారని ప్రశ్నించారు.

### ప్రభుత్వ హత్యలే: చాడ వెంకట్‌రెడ్డి

కేసీఆర్‌కు రాజ్యాంగంపై అవగాహన లేదని, అందుకే ప్రజాస్వామ్యాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ తీరులో ఇప్పటికే 15 మంది ఆర్టీసీ కార్మికులు మృతిచెందారని, అవన్నీ ప్రభుత్వ హత్యలేనని పేర్కొన్నారు. హైకోర్టు అక్షింతలు వేస్తుంటే.. తప్పుడు లెక్కలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఆ విషయం గ్రహించి కోర్టు మొత్తం కూపీ లాగుతోందన్నారు. అంతిమ విజయం కార్మికులదేనని, ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు.

### ఇప్పుడెందుకు నష్టాలు: ఎల్.రమణ

తాను రవాణాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు నష్టాల ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చానన్న కేసీఆర్, సీఎం అయ్యాక తీవ్ర నష్టాల్లోకి ఎందుకు వెళ్లిందో చెప్పాలని టీడీపీ అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకే దాన్ని ప్రైవేటీకరించే యోచనలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికులు కీలకమవుతారని, సాధారణ ప్రయాణికులకు వాస్తవాలు చెప్పటం ద్వారా కనీసం కోటి మందిని ప్రభావితం చేయగలుగుతారని, అది ఎన్నికల ఫలితాన్ని శాసిస్తుందన్నారు.


బుధవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సకల జనభేరికి హాజరైన ఆర్టీసీ కార్మికులు

### డిస్మిస్ భయం లేని ఆత్మగౌరవ ఉద్యమం: మందకృష్ణ

సెల్ఫ్ డిస్మిస్ అంటూ కేసీఆర్ ఎంత బెదిరించినా ఆర్టీసీ కార్మికులు ఆత్మ గౌరవంతో ఉద్యమం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. కేసీఆర్ ఓటమి దిశలో ఉన్నారని, ఆర్టీసీ కార్మికులు గెలుపుబాటలో ఉన్నారని పేర్కొన్నారు. లోటు బడ్జెట్ ఉన్న ఆంధ్రలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే, మిగులు బడ్జెట్ రాష్ట్రం తెలంగాణలో ప్రైవేటీకరిస్తారా అని ప్రశ్నించారు.

### ఈ సభ చూస్తే కేసీఆర్‌కు దడ: జితేందర్‌రెడ్డి

సరూర్‌నగర్ సభకు వచ్చిన కార్మిక జన ప్రవాహం చూస్తే ప్రగతి భవన్‌లో కేసీఆర్‌కు దడ ఖాయమని బీజేపీ నేత జితేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ కోసం ఆర్టీసీ కార్మికులను ఉద్యమంలో వాడుకుని ఇప్పుడు వారినే డిస్మిస్ పేరుతో బెదిరించటం దారుణమన్నారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత కరెంటు సరిగా లేకపోయినా దిక్కుండదని, కేసీఆర్‌కు కావాల్సింది ఓట్లు తప్ప ప్రజల సంక్షేమం కాదన్నారు. ఏ పథకానికీ నిధుల్లేకుండా పోయాయని, ఈ దివాలా ప్రభుత్వం ఎందుకు, కేసీఆర్‌ను దింపేస్తే సరిపోతుంది కదా అని పేర్కొన్నారు. సభలో కాంగ్రెస్ నేతలు వీహెచ్, కొండా విశ్వేశ్వర‌రెడ్డి, బీజేపీ నేత వివేక్, టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం నేత నరసింహారావు, చెరుకు సుధాకర్, విమలక్క, జాజుల శ్రీనివాసగౌడ్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేటీకరించటం ఉందా: రేవంత్‌రెడ్డి

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం తమ ఎజెండాలో లేదని సీఎం అంటున్నారని, మరి ఆర్టీసీని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు చేస్తున్న అంశం ఏ ఎజెండాలో ఉందో చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తన వ్యాపారాలకు పనికొచ్చేవే చేస్తున్నారని, అవన్నీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టే చేస్తున్నారా అని ప్రశ్నించారు. మీరు, మీ కొడుకు, కూతురు, అల్లుడు, బంధువులు సీఎం, మంత్రులు, ఎంపీలు అవుతారని మేనిఫెస్టోలో ప్రకటించారా అని ఎద్దేవా చేశారు. 'సభా ప్రాంగణానికి చేరుకునేందుకు 3 కిలోమీటర్ల దూరం నడిచి రావాల్సిన పరిస్థితి ఏర్పడేలా వేల మంది కార్మికులు వచ్చారు. ఇవి నిరసనలు కాదా.. ధర్నాలు కాదా.. కేసీఆర్‌కు కన్పించట్లేదా అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో సెక్రటేరియట్‌కు కూతవేటు దూరంలో మిలియన్ మార్చ్ నిర్వహిస్తే సీమాంధ్ర సీఎం అనుమతించారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణలో కార్మికులు సభ నిర్వహించుకుంటామంటే అవకాశం లేకుండా చేయటం విడ్డూరమన్నారు. నిజానికి ఆర్టీసీ నష్టాల్లో లేదని, నష్టాల్లోకి నెట్టేశారన్నారు. ధనవంతులు తిరిగే విమాన ఇంధనంపై ఒక శాతం పన్ను వేస్తూ, పేదలు తిరిగే ఆర్టీసీ బస్సుల డీజిల్‌పై 27.5 శాతం పన్ను వేయటం లాంటివాటి వల్ల నష్టాలు వచ్చాయన్నారు. విమాన ఇంధనంపై పన్ను తగ్గించి ప్రైవేటు సంస్థకు రూ.500 కోట్ల లాభం చేకూర్చి, డీజిల్‌పై పన్ను పెంచి ఆర్టీసీపై రూ.700 కోట్ల భారం మోపారన్నారు. వేల మంది పోలీసు పహారా పెట్టినా 21న ప్రగతి భవన్ ముట్టడి సందర్భంగా 'కోట గోడ'ను కొట్టామని, ప్రజలు తలుచుకుంటే ప్రగతి భవనే ఉండదని హెచ్చరించారు. కోర్టు జోక్యం చేసుకుని చక్కదిద్దుతుంటే కేసీఆర్ గాడిద పండ్లు తోముతడా అని మండిపడ్డారు.

### నేడు దీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా కార్మికులంతా ఒకరోజు నిరాహార దీక్ష చేయాలని ఈ సభలో తీర్మానించారు. గురువారం రాత్రి వరకు ఈ దీక్ష కొనసాగనుంది. నిరాహార దీక్ష చేస్తూ ప్రస్తుతం నిమ్స్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే సాంబశివరావు దీక్ష విరమించేలా చేయాలని కూడా తీర్మానించారు. గురువారం ఉదయం 9 గంటలకు నిమ్స్‌కు వెళ్లి ఆయనకు నిమ్మరసం ఇచ్చి విరమింపచేయాలని నిర్ణయించినట్లు జేఏసీ నేతలు అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డిలు వెల్లడించారు.


కూనంనేని సాంబశివరావును పరామర్శిస్తున్న కోదండరాం, మందకృష్ణ, చాడ, వీహెచ్, శ్రీనివాస్‌రెడ్డి

## దీక్ష కొనసాగిస్తా: కూనంనేని

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ పరిరక్షణతో పాటు, కార్మికుల న్యాయసమ్మతమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు తన నిరవధిక దీక్ష కొనసాగిస్తానని సీపీఐ సహాయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సమ్మెపై జేఏసీతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, వివిధ డిమాండ్లపై సానుకూల నిర్ణయం వెలువడే వరకు తన నిరసన దీక్ష కొనసాగుతుందని 'సాక్షి'కి తెలిపారు. తన పల్స్‌రేట్ 53కు పడిపోయిందని, ఆరోగ్యం విషమిస్తోందని డాక్టర్లు హెచ్చరించారని కూనంనేని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలతోనైనా ప్రభుత్వం కదిలి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే పరిష్కారం సాధ్యం కాదని భావించే విషయాలపై కమిటీని ఏర్పాటుచేసి, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా కూనంనేని చేపట్టిన నిరవధిక నిరాహారదీక్ష బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. నిమ్స్ ఆసుపత్రిలో ప్రొఫెసర్ కోదండరాం (టీజేఎస్), సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, ఈటీ నర్సింహ (సీపీఐ), మంద కృష్ణమాదిగ (ఎమ్మార్పీఎస్), వీహెచ్ (కాంగ్రెస్ ), టీటీడీపీ అధ్యక్షుడు ఎల్. రమణ తదితరులు పరామర్శించారు.

## సకలజనుల సమ్మెతో సమం

- నేటితో 27 రోజులు పూర్తి చేసుకోనున్న ఆర్టీసీ సమ్మె
- సమ్మె ఇంకా ఉధృతంగా కొనసాగే సూచనలు

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులు వెనక్కు తగ్గకుండా ఉధృతంగా సమ్మె కొనసాగిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సకల జనభేరీ సభకు అన్ని జిల్లాల నుంచి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తరలి వెళ్లారు. కోర్టు అనుమతితో ఇండోర్ స్టేడియంలో సభ నిర్వహించినందున, దాని సామర్థ్యం చిన్నది కావటంతో జేఏసీ నేతలు జనసమీకరణకు పెద్దగా యత్నించలేదు. అయినా జిల్లాల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు ప్రైవేటు బస్సుల్లో తరలివెళ్లారు. మిగిలిన వారు ఆయా డిపోల ముందు నిరసనలు కొనసాగించారు. బుధవారంతో సమ్మె 26 రోజులు పూర్తి చేసుకుంది. గురువారంతో తెలంగాణ సాధన కోసం జరిపిన సకల జనుల సమ్మె కాలంతో సమమవుతుంది. అదనంగా ఒక్కరోజు దాటినా తెలంగాణ ఆర్టీసీ చరిత్రలో సుదీర్ఘ సమ్మెగా రికార్డులకెక్కనుంది. 2013లో జరిగిన సకల జనుల సమ్మె సమయంలో తెలంగాణలో 27 రోజుల పాటు బస్సులు నిలిపేసి కార్మికులు సమ్మె చేశారు. ఇప్పుడు అంతకంటే దీర్ఘకాల సమ్మెగా అవతరించనుంది.



## చినజీయర్‌ను కలిసిన ఆర్టీసీ కార్మికులు

**రాజేంద్రనగర్:** తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి.. పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ పలువురు ఆర్టీసీ కార్మికులు చినజీయర్ స్వామిని కలిశారు. మహేశ్వరం, రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో కార్మికులు, జేఏసీ నాయకులు బుధవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో చినజీయర్‌ను కలిశారు. తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందించారు. తాము 26 రోజులుగా సమ్మె చేస్తున్న విషయాన్ని ఆయనకు వివరించారు. ఉద్యోగుల సమస్యలను విన్న చినజీయర్.. 'నేను రాజకీయ నాయకుడిని కాదు. మీకు విజయం కలగాలని ఆశీర్వదిస్తా'అని తెలిపారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు రాజేంద్రనగర్ డిపో వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు ముత్యంరెడ్డి, బీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. సకల జనుల సమరభేరి విజయవంతమైందని తెలిపారు. సభ విజయవంతం కావడంతో ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెరిగిందన్నారు. చినజీయర్ ఆశీర్వాదంతో త్వరలో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 20 వేల ప్రైవేటు బస్సులైనా తీసుకురండి

**ప్రజలకు ఇబ్బంది కలగకూడదు: సీఎం కేసీఆర్**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికుల సమ్మె వ్యవహారం ఎంతకీ తెగట్లేదని, ఎంతకాలం ప్రజలకు ఈ ఇబ్బందులని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. పదిహేను, ఇరవై వేల ప్రైవేటు బస్సులను రాష్ట్రంలో సాధ్యమైనంత త్వరగా ప్రవేశపెట్టాలని, వాటికి రూట్ పర్మిట్లు జారీ చేసేందుకు కసరత్తు చేయాలని రవాణ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఆర్టీసీ సమ్మెపై బుధవారం ప్రగతి భవన్‌లో రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆ శాఖ కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్ శర్మ, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మతో సమీక్షించారు. హైకోర్టు నుంచి ప్రభుత్వానికి ప్రతికూల ఆదేశాలందితే తక్షణమే సుప్రీం కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను సీఎం సూచించినట్లు తెలిసింది. బుధవారం సకల జన భేరి నిర్వహించడం, విపక్ష నేతలను సభకు ఆహ్వానిచడంపై కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారని తెలిసింది.

# ఓటీపీ లేకుండానే ఖాతా ఖాళీ

► మొదటి పేజీ తరువాయి

లావాదేవీలకు ఏటీఎం నంబర్, సీవీవీ నంబర్‌తో ఓటీపీ తప్పనిసరి అని, ఓటీపీ లేకుండా ఆన్‌లైన్ లావాదేవీలను ఎట్టి పరిస్థితిలో అనుమతించరాదని ఇప్పటికే ఆర్‌బీఐ అన్ని బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేసింది. అయినా బ్యాంకులు ఓటీపీ లేకుండా కార్డుల ద్వారా ఓవర్సీస్ లావాదేవీలను పలు బ్యాంకులు అనుమతిస్తున్నాయి. ఒకవేళ మోసం జరిగితే కొన్ని సందర్భాల్లోనే బ్యాంకులు బాధితులకు పూర్తి మొత్తంలో నగదు రీఫండ్ అవుతుండటంతో పెద్ద సంఖ్యలో బాధితులు నష్టపోతున్నారు. నిబంధనల ప్రకారం డబ్బు కోల్పోయిన 3 రోజుల్లోగా ఫిర్యాదు చేస్తేనే 100 శాతం రీఫండ్ చేసే అంశాన్ని బ్యాంకులు పరిశీలిస్తాయి. ఇలాంటి కారణాలతో సగం లేదా అంత కంటే తక్కువ నగదునే రీఫండ్ చేస్తున్నాయి.

### కార్డు మర్చిపోతే అంతే..

నగదును డ్రా చేసిన తర్వాత కొందరు తమ డెబిట్ కార్డును ఏటీఎం యంత్రం నుంచి తిరిగి తీసుకోకుండా మర్చిపోయి వెళ్తున్నారు. కొన్ని ఏటీఎం యంత్రాల్లో నగదు బయటకు వచ్చిన తర్వాతే కార్డు బయటకు వస్తుంది. దీంతో నగదు తీసుకుని కార్డును అక్కడే మర్చిపోతున్నారు. ఇలా మర్చిపోయిన కార్డులను దుండగులు దొంగిలించి ఓటీపీ లేకుండానే ఓవర్సీస్ లావాదేవీలు జరిపి బాధితుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని ఓ బ్యాంకు ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఓవర్సీస్ ట్రాన్సాక్షన్ ద్వారా నేరం జరిగితే నిందితులను పట్టుకునే టెక్నాలజీ సైబర్ క్రైం పోలీసులకే ఉందని, వారి వద్దకే వెళ్లాలని సివిల్ పోలీసులు ఫిర్యాదు తీసుకోకుండా పంపేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### దోపిడీకి మార్గాలెన్నో..

సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు బాధితుల సంఖ్య భారీగా పెరిగిపోయింది. సైబర్ నేరస్తులు అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో గుట్టు రట్టు కాకుండా చూసుకుంటున్నారు. డెబిట్, క్రెడిట్‌కార్డులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌తో పాటు గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం వంటి ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ల వినియోగదారులకు టోకరా వేయడం ఇటీవల సర్వసాధారణమై పోయింది. ఇలాంటి వివరాలను ఎవరితో పంచుకోరాదని బ్యాంకులు, పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా చాలామంది మోసపోతూనే ఉన్నారు. నేరుగా వినియోగదారులకు ఫోన్ చేసి గిఫ్టులు, లాటరీలు, డిస్కౌంట్ సేల్స్ పేరుతో ఎరవేసి కార్డులు/పేమెంట్ యాప్‌లకు సంబంధించిన రహస్య వివరాలను సైబర్ నేరస్తుల ముఠాలు సేకరిస్తున్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల్లో పెట్టే వ్యక్తిగత సమాచారాన్ని వినియోగించుకుని.. 'మీరు పలానా వ్యక్తి.. పలానా బంధువులు/స్నేహితులు మీ నంబర్ ఇచ్చారు.. మీకు ఈ గిఫ్టు ఇవ్వమన్నారు. జీఎస్టీ ట్యాక్సు కడితే మీ అడ్రస్‌కు గిఫ్టు పంపిస్తాం'అని ఫోన్ చేసి చెప్పి నమ్మిస్తున్నారు. బ్యాంకు అధికారుల పేరుతో ఫోన్ చేసి డెబిట్ కార్డు, ఓటీపీ వివరాలు సేకరించడం వంటి మోసాలు ఇటీవల బాగా పెరిగిపోయాయి. ప్రముఖ ప్రైవేటు, ప్రభుత్వ కంపెనీల పేరుతో కొందరు సైబర్ నేరస్తులు ఫేక్ వెబ్‌సైట్లను సృష్టించి ఉద్యోగావకాశాలు, వస్తువులు/సేవల ఆర్డర్ కోసం ఆన్‌లైన్‌లో ఫీజులు, డబ్బులు కట్టించుకుంటున్నారు.

#### బస్సు సీటు పేరుతో మోసం

హైదరాబాద్ నుంచి చిత్తూరుకు వెళ్లేందుకు కావేరీ ట్రావెల్స్‌కు సంబంధిం చిన వివరాలు కనిపించాయి. నంబర్‌కు ఫోన్ చేసి సీటు బుక్ చేయాలని కోరాను. ముందుగానే డబ్బులు చెల్లించాలని అడిగారు. బస్సు ఎక్కిన తర్వాత చెల్లిస్తానంటే రూ.10 అయినా బుకింగ్ ఫీజు కింద చెల్లించాలంటూ పేమెంట్ లింక్ ఎస్ఎంఎస్ చేశారు. లింక్ ఓపెన్ చేసి అందులో ఫోన్‌పే ఐడీ, ఎం-పిన్ ఎంటర్ చేశాను. నా మొబైల్ నంబర్‌తో ఎస్‌బీఐ, విజయబ్యాంకు ఖాతాలు అనుసంధానమై ఉన్నాయి. ఫోన్‌పే యాప్‌తో ఎస్‌బీఐ ఖాతా మాత్రమే అనుసంధానమై ఉంది. కొద్ది క్షణాల్లోనే మూడు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.30 వేలు సైబర్ నేరస్తుడు కాజేశాడు. కావేరీ ట్రావెల్స్‌ను సంప్రదిస్తే ఆ ఫోన్ నంబర్‌తో తమకు సంబంధం లేదన్నారు.

*– హఫీజ్ ఖాన్, గాంధీనగర్, హైదరాబాద్*

### గొలుసుకట్టుగా వేర్వేరు ఖాతాలకు

బాధితుల ఖాతా నుంచి తమ ఖాతాకు డబ్బులు జమ అయిన వెంటనే సైబర్ నేరస్తులు తెలివిగా ఆ డబ్బును మరో ఖాతాకు అక్కడి నుంచి ఇంకో ఖాతాకు.. ఇలా వారం రోజుల్లోనే పది పదిహేను ఖాతాలకు డబ్బు బదిలీ చేస్తున్నారు. ఒక ఖాతాను బ్లాక్ చేసేలోగా డబ్బు మరో బ్యాంకులు/పేమెంట్ యాప్స్ ఖాతాలోకి వెళ్లిపోతోంది. దీంతోఅన్ని బ్యాంకులు/యాప్స్ కంపెనీలతో సంప్రదింపులు జరిపి నిందితుల ఖాతాలను బ్లాక్ చేయిస్తున్నామని సైబర్ క్రైం అధికారులు పేర్కొన్నారు.

### పాటించాల్సిన జాగ్రత్తలు

స్మార్ట్‌ఫోన్, డేటా కనెక్షన్ అందుబాటులోకి వచ్చాక ఏ సమాచారం కోసమైనా గూగుల్ సెర్చ్ ఇంజన్‌ను ఆశ్రయిస్తున్నారు. సైబర్ నేరస్తులు దీన్నే అస్త్రంగా వాడుకుంటున్నారు. తమ ఫోన్ నంబర్లను వివిధ కాల్ సెంటర్లకు చెందినవిగా పేర్కొంటూ ఇంటర్‌నెట్‌లో పెడుతున్నారు. బ్యాంకింగ్ సహా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సంస్థల పేర్లతో ఇవి ఉంటున్నాయి. వీటికి ఫోన్లు చేసిన వారిని నమ్మించి యూపీఐ నంబర్ తీసుకుంటున్నారు. చివరకు వారి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు స్వాహా చేస్తున్నారు.

#### రీఫండ్ అంటూ కాజేశారు

కోర్టులో క్లర్కుగా పనిచేసే మహిళ గ్రేట్ ఇండియా శారీ డాట్ కాం అనే వెబ్‌సైట్ నుంచి చీర ఆర్డర్ చేసింది. ఆర్డర్ క్యాన్సిల్ చేసుకుని డబ్బు రీఫండ్ చేయాలని కోరగా.. గూగుల్ పే నంబర్‌కు రీఫండ్ చేస్తామని వెబ్‌సైట్ నిర్వాహకులు ఆమెకు చెప్పారని, ఆమె నా దగ్గర గూగుల్ పే ఐడీ తీసుకుంది. వెబ్‌సైట్ నుంచి ఎవరో నాకు కాల్ చేసి నా ఫోన్‌కి 'రీఫండ్ ఐడీ'ని పంపించామని, తిరిగి వారి ఫోన్‌కు పంపిస్తేనే రీఫండ్ చేస్తామన్నారు. ఎస్ఎంఎస్‌ను వారికి ఫార్వర్డ్ చేశాను. తర్వాత నా బ్యాంకు ఖాతా బ్యాలెన్స్ గూగుల్ పేలో చెక్ చేయగా.. డబ్బులు బాగా తగ్గిపోయాయి. వెంటనే బ్యాంకుకు వెళ్లి ఖాతా స్తంభింపజేశాను. అప్పటికే రూ.90 వేలు నష్టపోయాను.

*– సింగరాజు సంతోష్, లాయర్, హైదరాబాద్*

- నకిలీ పేర్లు, చిరునామాలతో వివిధ సర్వీసు ప్రొవైడర్ల నుంచి సిమ్‌కార్డులు తీసుకుంటున్న సైబర్ నేరగాళ్లు వాటిని ఈ నేరాలకు వాడుతున్నారు. బోగస్ వివరాలతో కొన్ని యాప్స్, బ్యాంకు ఖాతాలు సిద్ధం చేసుకుంటున్నారు.
- మెయిల్ ఐడీలు సృష్టించి గూగుల్‌లో రిజిస్టర్ చేసుకుంటున్నారు. తమకు చెందిన నంబర్లను ఆయా బ్యాంకులకు చెందిన కాల్ సెంటర్లవిగా పేర్కొంటూ అందులో పొందుపరుస్తున్నారు. ట్రూ కాలర్‌లో సైతం వీటిని 'బ్యాంక్', 'బ్యాంక్ మేనేజర్'పేర్లతోనే రిజిస్టర్ చేసుకుంటున్నారు.
- గూగుల్ సెర్చ్‌లో పొందుపరిచిన నంబర్లలో వేటికి వ్యూస్ ఎక్కువగా ఉంటే అది పైకి వచ్చి ముందు కనిపిస్తుంది. తమ నంబర్లు కన్పించేందుకు సైబర్ నేరగాళ్లు తమ అనుచరుల ద్వారా ఆయా నంబర్లకు వ్యూస్ పెరిగేలా చేసి సెర్చ్‌లో పైకి తీసుకొస్తున్నారు.
- ఇలా కనిపించిన వాటికి ఖాతాదారుడు కాల్ చేస్తే సైబర్ నేరగాడు స్పందిస్తున్నాడు. తాను బ్యాంక్/ఆర్థిక సంస్థ మేనేజర్‌ని అంటూ పరిచయం చేసుకుంటున్నాడు. పోగొట్టుకున్న డబ్బు తిరిగి రావాలన్నా, మీ సమస్య పరిష్కారం కావాలన్నా తాము మరో నంబర్ నుంచి ఎస్సెమ్మెస్ పంపుతామని, దాన్ని మళ్లీ అదే నంబర్‌కు తిప్పి పంపాలని సూచిస్తుంటారు.
- ఎవరైనా సరే తమ బ్యాంకు ఖాతాలను నగదు లావాదేవీలు నెరపే వివిధ రకాలైన యాప్స్‌కు అనుసంధానం చేయాలంటే యూపీఐ కచ్చితంగా ఉండాలి. ఇది కావాలంటే బ్యాంకు ఖాతాతో రిజిస్టరై ఉన్న సెల్‌ఫోన్ నుంచి యూపీఏకు సంబంధించిన ఎంపిన్‌ను బ్యాంకుకు సంబంధించిన నంబర్‌కు పంపాల్సి ఉంటుంది. దీన్నే ఈ సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.
- తమ ఫోన్లలోకి అప్పటికే కొన్ని యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసి ఉంచుకుంటున్న సైబర్ నేరగాళ్లు ఇలాకాల్ వచ్చినప్పుడు ఎంపిన్ క్రియేట్ చేస్తున్నారు. దీన్ని తొలుత తమకు కాల్ చేసిన ఖాతాదారుడికి వేరే నంబర్ నుంచి పంపి తిరిగి పొందుతున్నారు. ఇలా చేయడంతో బాధితుడు తన బ్యాంకు ఖాతాను వారి యాప్‌తో అనుసంధానించడానికి యాక్సెస్ ఇచ్చినట్లు అవుతుంది.

## క్లుప్తంగా...

### నేడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నేడు, రేపు కొన్నిచోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. మాల్దీవులు, కోమోరిన్ ప్రాంతాలలో వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నందున.. ఇది రాగల 24 గంటల్లో లక్షదీవుల మీదుగా వాయువ్య దిశలో ప్రయాణించి తీవ్ర వాయుగుండంగా మారి, తుఫాన్‌గా మారనుందని వివరించింది.

**వివిధ ప్రాంతాలలో నమోదైన వర్షపాతం:**
ఆదిలాబాద్ 5 సెం.మీ., వెంకటాపురం (జయశంకర్ భూపాలపల్లి) 5 సెం.మీ., మంచల్ (రంగారెడ్డి) 4 సెం.మీ., అశ్వాపురం (భద్రాద్రి కొత్తగూడెం) 3 సెం.మీ.

### ఒడిశాకు ఏడీజీ సౌమ్యామిశ్రా



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ కేడర్‌కు చెందిన మరో సీనియర్ ఐపీఎస్ అధికారి సౌమ్యామిశ్రా ఒడిశాకు బదిలీ అయ్యారు. పోలీసు సంక్షేమ విభాగానికి అదనపు డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సౌమ్యామిశ్రాకు సొంత రాష్ట్రం ఒడిశాకు డిప్యుటేషన్‌పై వెళ్లేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆమె గతేడాది చేసుకున్న దరఖాస్తుకు ఆమోదం లభించింది. అయితే అక్కడ ఆమెను ఏ పదవిలో నియమిస్తున్నారన్న సమాచారం లేదు.

### 'నీరా'పై శాస్త్రీయ పరిశీలన చేయండి

**గవర్నర్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి**

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో నీరా అమ్మకాలు ప్రారంభించబోతున్నామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నీరాలో ఉన్న పదార్థాలపై శాస్త్రీయ పరిశీలన చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి గవర్నర్‌కు పంపిన విజ్ఞప్తిని మీడియాకు విడుదల చేశారు. దీంట్లో కేరళలో కల్లుతోపాటు నీరాను మత్తు పానీయాల జాబితాలో చేర్చారని, ఇక్కడ కూడా నీరా పేరుతో కల్లును విక్రయించే ప్రమాదం ఉన్నందున అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

### కాళేశ్వరంపై ఎన్జీటీ విచారణ 13కు వాయిదా

**సాక్షి, న్యూఢిల్లీ:** కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన మధ్యంతర పిటిషన్‌పై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) విచారణ వచ్చే నెల 13వ తేదీకి వాయిదా పడింది. ప్రాజెక్టు నిర్మాణంలో ఉండగా మంజూరు చేసిన అనుమతుల్లో నిబంధనలు పాటించలేదంటూ హయాతుద్దీన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ రఘువర్ధన్ రాథోర్ బెంచ్ బుధవారం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల సామర్థ్యాన్ని పెంచిందని, అయితే పెంచిన సామర్థ్యానికి అనుగుణంగా పర్యావరణ అనుమతుల్లో సవరణలు జరగలేదని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ ఉపాధ్యాయ వాదించారు. దీనిపై వివరణకు తెలంగాణ ప్రభుత్వం గడువు కోరడంతో అంగీకరించిన బెంచ్ తదుపరి విచారణను వాయిదా వేసింది.

### వచ్చే నెల 21 నుంచి దూరవిద్యా పరీక్షలు

**సాక్షి, హైదరాబాద్:** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ద్వారా 2017–18 అంతకు ముందు సంవత్సరాలలో ఎంఏ, బీఏ, పీజీ డిప్లొమా/డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు వచ్చే నెల 21 నుంచి డిసెంబర్ 2 వరకు బ్యాక్‌లాగ్/ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు ఉంటాయని విశ్వవిద్యాలయ డిప్యూటీ రిజిస్ట్రార్ భాస్కర్ ప్రకటించారు. ఈ పరీక్షలు హైదరాబాద్, వరంగల్, శ్రీశైలం, రాజమండ్రి, కూచిపూడి ప్రాంగణాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షల టైం–టేబుల్ వివరాలను www.teluguuniversity.ac.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

### పాడిపశువుల కొనుగోళ్ల మార్గదర్శకాల్లో మార్పు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న పాడిపశువుల పథకం అమలు మార్గదర్శకాల్లో మార్పులు చేసింది. ఈమేరకు పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. విజయ డెయిరీ, నార్మల్, ముల్కనూర్, కరీంనగర్ డెయిరీల వారీగా కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటివరకు కలెక్టర్ల అనుమతితో మొదటి విడతలో ఇష్టారీతిలో ఇతర రాష్ట్రాల్లో, పక్క గ్రామాల్లో, సొంత గ్రామంలో కూడా కొన్ని పాడిపశువులను కొనుగోలు చేశారు. అవకతవకలు జరుగుతున్నట్లు ప్రభుత్వం దృష్టికొచ్చింది. మొదటి దశ కొనుగోళ్లలో రైతులు వెళ్లలేదు. దీంతో ఇప్పుడు పాడిపశువులను కొనుగోలు చేసే సమయంలో రైతులు వెళ్లాలని పేర్కొంది.

# బీకాంలో పెరిగిన ప్రవేశాలు

- గతేడాదికంటే 10 వేల మంది విద్యార్థుల పెరుగుదల
- బీబీఏలోనూ 3వేల నుంచి 9వేలకు పెరిగిన ప్రవేశాలు
- మొత్తం ప్రవేశాల్లో సైన్స్‌కోర్సుల్లోనే ఎక్కువగా చేరిక

**సాక్షి, హైదరాబాద్:** డిగ్రీలో క్రమంగా బీఏ, బీకాం విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. గతేడాదితో పోల్చితే ఈసారి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్‌లో (బీఏ) చేరిన విద్యార్థుల సంఖ్య స్వల్పంగా పెరిగి, బ్యాచిలర్ ఆఫ్ కామర్స్‌లో (బీకాం) చేరిన విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో (బీబీఏ) చేరిన విద్యార్థుల సంఖ్య కూడా గతేడాదికంటే ఈసారి పెరిగినట్లు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) లెక్కలు తేల్చింది.

**బీకాంలో 10 వేలకుపైగా..**

డిగ్రీ ప్రవేశాల్లో భాగంగా ఎప్పటిలాగే ఈసారి కూడా సైన్స్ కోర్సుల్లోనే ఎక్కువ మంది విద్యార్థులు చేరారు. కోర్సుల వారీగా విద్యార్థుల ప్రవేశాలను గతేడాదితో పోల్చితే మాత్రం బీకాం, బీబీఏ, బీఏ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్యలో భారీగా పెరుగుదల నమోదైంది. మొత్తంగా డిగ్రీ కోర్సుల్లో 2,22,707 మంది విద్యార్థులు ఈసారి ప్రవేశాలు పొందగా, అందులో అత్యధికంగా 90,746 మంది విద్యార్థులు బీఎస్సీలో చేరారు. గతేడాది సైన్స్ కోర్సుల్లో 90786 మంది విద్యార్థులు చేరగా, 40 మంది విద్యార్థులు తగ్గిపోయారు. మొత్తం విద్యార్థుల్లో సంఖ్యా పరంగా సైన్స్ కోర్సుల్లోనే అత్యధికంగా చేరారు. ఆ తరువాత బీకాంలో మాత్రం భారీగా పెరుగుదల నమోదైంది. గతేడాది బీకాం కోర్సుల్లో 78,843 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా, ఈసారి ఆ సంఖ్య 88,871కి చేరింది. అంటే గతేడాదికంటే ఈసారి అదనంగా 10 వేల మందికిపైగా విద్యార్థులు బీకాంలో చేరినట్లు దోస్త్ లెక్కలు తేల్చింది. కామర్స్‌కు డిమాండ్ పెరుగుతుండటంతో విద్యార్థులు బీకాంవైపు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు బీబీఏలో గతేడాది 3,147 మంది విద్యార్థులు చేరగా, ఈసారి 9,203 మంది విద్యార్థులు చేరారు. గతేడాదికంటే ఈసారి దాదాపు 6వేల మంది అదనంగా చేరారన్నమాట. ఇక బీఏలోనూ గతేడాది కంటే ఈసారి పెరుగుదల నమోదైందని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి పేర్కొన్నారు. కోర్సుల పునర్వ్యవస్థీకరణ, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో ఈ పెరుగుదల నమోదైందని వివరించారు. బీఏలో గతేడాది 28,292 మంది విద్యార్థులు చేరగా, ఈసారి వారి సంఖ్య 32,722కు పెరిగింది.

# ఒక్క విద్యార్థి లేని స్కూళ్లు 916

- 15 మందిలోపే విద్యార్థులున్నవి 3,467
- 40 మందిలోపు పిల్లలున్నవి 11,127
- లెక్కలు తేల్చిన పాఠశాల విద్యాశాఖ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఒక్క విద్యార్థి లేని స్కూళ్లు 916 ఉండగా, 40 మందిలోపే విద్యార్థులు ఉన్న స్కూళ్లు 11,127 (ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత) ఉన్నట్లు పాఠశాల విద్యాశాఖ లెక్కలు తేల్చింది. మరోవైపు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1–15 మందిలోపే విద్యార్థులు ఉన్న స్కూళ్లు 3,467 ఉన్నాయి. 16–100 మంది విద్యార్థులు ఉన్నవి 15,535 ఉండగా, 101–250 ఉన్నవి 4,660 స్కూళ్లు ఉన్నట్లు లెక్కలు వేసింది. 251–1,000 మంది విద్యార్థులు ఉన్నవి 1,447 స్కూళ్లు ఉండగా, వేయి కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న స్కూళ్లు 22 ఉన్నట్లుగా వెల్లడించింది. 2019–20 విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణకు నియమించిన స్కావెంజర్ల గౌరవం వేతనం చెల్లింపు కోసం, స్కూల్ గ్రాంట్ విడుదల కోసం ఈ లెక్కలను తేల్చింది. పాఠశాలలు, వాటిల్లో పని చేస్తున్న స్కావెంజర్ల సంఖ్యను తేల్చి వారికి చెల్లించాల్సిన గౌరవ వేతనం రూ.32.46 కోట్లు, విద్యార్థుల సంఖ్య ప్రకారం స్లాబ్‌ల వారీగా స్కూల్ గ్రాంటు రూ.23.34 కోట్లను విడుదల చేసింది.

**28,200 మంది స్కావెంజర్లకు నిధులు..**

రాష్ట్రంలో ఒక్క విద్యార్థి లేని 916 పాఠశాలలను మినహాయిస్తే.. విద్యార్థులు ఉన్న 25,131 ప్రభుత్వ పాఠశాలల్లో.. 20,496 ఎలిమెంటరీ స్కూళ్లు (ప్రాథమిక, ప్రాథమికోన్నత) ఉండగా, ఉన్నత పాఠశాలలు 4,635 ఉన్నట్లు వెల్లడించింది. ఆయా పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణ చూస్తున్న 28,200 మంది స్కావెంజర్లకు గౌరవ వేతనాలను విడుదల చేసింది.

# రాష్ట్రంలో శానిటేషన్ హబ్

▶ మొదటి పేజీ తరువాయి

దేశాలకు పారిశుద్ధ్య సేవలు అందించేలా ఒక దీపస్తంభం వంటి శానిటేషన్ హబ్ నెలకొల్పేందుకు చక్కటి అవకాశముంది. ఇది ఆవిష్కరణల సృష్టికి కేంద్రంగా కూడా పనిచేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఇలాంటి హబ్‌ను నెలకొల్పేందుకు ఆసక్తితో ఉంది. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) ఇందుకోసం అత్యున్నత స్థాయి బ్లూప్రింట్ రూపొందించింది. పెట్టుబడులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం తగిన నిధులు కేటాయిస్తుంది. అలాగే వ్యూహాత్మక ప్రణాళికకు తుదిరూపు ఇచ్చే పనిలో ఉన్నాం. వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం కూడా చూస్తున్నాం..'అని తెలిపారు. 'ఈ హబ్ కోసం కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ నుంచి ప్రారంభ మూలధనంగా రూ.1,00 కోట్లు ఇచ్చి సాయపడాలి..'అని కేటీఆర్ అభ్యర్థించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్థలాన్ని గుర్తించిందని, వనరుల మద్దతు అందిస్తోందని తెలిపారు. డిసెంబర్‌లో ఈ శానిటేషన్ ఇన్నోవేషన్ హబ్‌పై అధికారిక ప్రకటన ఉంటుందని మంత్రి వెల్లడించారు.



బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన మంత్రి కేటీఆర్

**రూ. 20 వేల కోట్ల ఆర్థికవృద్ధికి దోహదం**

'ప్రతిపాదిత శానిటేషన్ హబ్ వల్ల ప్రజల ఆరోగ్య వృద్ధితోపాటు ఆర్థిక ప్రయోజనాలు కూడా ఉంటాయి. పారిశుద్ధ్య లేమి కారణంగా ప్రాణాలు కోల్పోతున్న లక్షలాది మందిని ఈ హబ్ కాపాడగలుగుతుంది. దీర్ఘ కాలంలో రూ.20 వేల కోట్ల ఆర్థిక వృద్ధితో పాటు, 20 వేల ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది. దేశంలోనే ఇదొక అద్వితీయమైన నవకల్పన. ఈ హబ్ పట్టణ స్థానిక సంస్థలకు సేవలందిస్తుంది. నవకల్పనలకు అండగా ఉంటుంది. పారిశుద్ధ్య రంగంలో ఉన్న సమస్యలను అధిగమించేందుకు కావాల్సిన పరిష్కారాలను కనుగొనే విధంగా ఈ హబ్ పరిశోధన కొనసాగిస్తుంది. ఇది సుస్థిర వాణిజ్య నమూనాగా నిలుస్తుంది. ఐదేళ్లలో స్వయం సమృద్ధి సాధిస్తుంది..'అని కేటీఆర్ నివేదించారు.

**జీహెచ్‌ఎంసీకి రూ.400 కోట్లివ్వండి**

హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుకి అదనంగా చేపట్టాల్సిన కార్యక్రమాల కోసం మరో రూ.400 కోట్లను స్వచ్ఛ భారత్ మిషన్ లేదా మరే ఇతర కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కింద అయినా కేటాయించాల్సిందిగా మంత్రి కేటీఆర్ మరో వినతి పత్రంలో కోరారు. దీంతోపాటు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం కేటాయించిన నిధుల్లో కేంద్రం నుంచి రావాల్సిన రూ.254 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాల్సిందిగా మరో వినతిపత్రంలో అభ్యర్థించారు.

**శిక్షణ కార్యక్రమాలకు బేగంపేట ఎయిర్‌పోర్టు..**

ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం యునైటెడ్ కింగ్‌డం (యూకే)లోని ప్రముఖ యూనివర్సిటీతో కలసి శిక్షణ కార్యక్రమాలు అందించేందుకు సిద్ధంగా ఉందని, ఇందు కోసం బేగంపేట ఎయిర్‌పోర్ట్‌ను ఉపయోగించుకునేలా వెసులుబాటు కల్పించాలని హర్దీప్‌సింగ్ పురిని మంత్రి కేటీఆర్ కోరారు.

**ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయండి..**

బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రాల పారిశ్రామిక మంత్రుల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలపై మాట్లాడారు. దీంతో పాటు పారిశ్రామికీకరణ మరింత వేగంగా జరగాలంటే కేంద్రప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై పలు సలహాలు, సూచనలు చేశారు. టీఎస్ ఐపాస్ ద్వారా, ఇతర పారిశ్రామిక విధానాల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక వర్గాలకు చేయూతనందిస్తున్న తీరు, దీంతో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న తీరును వివరించారు. హైదరాబాద్ భౌగోళికంగా దేశానికి నడిబొడ్డున ఉందని, ఈ నేపథ్యంలో హైదరాబాద్–బెంగళూరు–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసే విషయాన్ని కేంద్రప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ఈ కారిడార్ ఏర్పాటుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. దీంతోపాటు హైదరాబాద్ నగరంలో ఉన్న ఫార్మా, ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగ పరిశ్రమలకు మరింత ఊతమిచ్చినట్లు అవుతుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించుకున్న 14 ప్రాధాన్యతా రంగాల్లో పెట్టుబడులను ఏవిధంగా ఆకర్షిస్తుందో తెలిపిన కేటీఆర్, రాష్ట్రప్రభుత్వ ప్రయత్నాలకు కేంద్రం నుంచి మరింత సహకారం కావాలని కోరారు. ఈ వర్క్‌షాప్‌లో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**నేడు అమిత్ షాతో భేటీ?**

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మంత్రి కేటీఆర్ గురువారం కలిసే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌ను కూడా కలవనున్నట్లు వెల్లడించాయి.

## రక్షణ శాఖ మంత్రితో భేటీ

రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మంత్రి కేటీఆర్ బుధవారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో ప్రతిపాదిత స్కైవేల నిర్మాణం కోసం రక్షణ శాఖ భూములను అప్పగించాల్సిందిగా కోరారు. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ జాతీయ రహదారి వైపు, హైదరాబాద్ నుంచి రామగుండం రహదారి వైపు నిర్మించే ఈ రెండు స్కైవేలకు సంబంధించి కంటోన్మెంట్, రక్షణ శాఖ భూములను అప్పగించాలని గత కొంత కాలంగా తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతూ వస్తోందని, గతంలోనూ పలు సార్లు కేంద్ర మంత్రులను కలసిన విషయాన్ని రాజ్‌నాథ్‌కు కేటీఆర్ గుర్తు చేశారు. ఈ స్కైవేల నిర్మాణంతో హైదరాబాద్ ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గిపోయే అవకాశాలున్నాయని, వీటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్న విషయాన్ని తెలిపారు.

## కార్మికులను రెచ్చగొడుతున్న కేసీఆర్

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్**



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులు సహనంతో, గాంధీజీ అహింస సిద్ధాంతంతో సమ్మెను కొనసాగిస్తున్నారని, సీఎం కేసీఆర్ చేసే భయానక ప్రకటనలు వారిపై కించిత్తు ప్రభావం కూడా చూపడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కోర్టు చెబుతున్నా, ప్రజాసంఘాలు సూచిస్తున్నా సీఎం ఎగతాళి చేసే విధంగా మాట్లాడుతున్నారని, పిచ్చి ప్రేలాపణలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చాక కూడా ఆత్మహత్యలు దేనికి సంకేతమని ప్రశ్నించారు. కేసీఆర్ హైకోర్టునే ధిక్కరించే విధంగా మాట్లాడుతున్నారని, కోర్టులో పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. మిలియన్ మార్చ్, సాగర హారం రాకముందే ప్రభుత్వం సమస్యను పరిష్కరిస్తే మంచిదని, లేకుంటే పతనం ఖాయమని లక్ష్మణ్ హెచ్చరించారు. గురువారం సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా యూనిటీ ఫర్ రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం లక్ష్మణ్ సమక్షంలో మేడ్చల్ జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు బీజేపీలో చేరారు.




### పాలమూరు ప్రాజెక్టుల సీఈగా అనంతరెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ (సీఈ) గా ఎల్.అనంతరెడ్డిని ప్రభుత్వం నియమించింది. సంగారెడ్డి సర్కిల్ ఎస్ఈగా ఉన్న ఆయనకు పాలమూరు ప్రాజెక్టుల సీఈగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# వెంటాడిన డెంగీ

▶ మొదటి పేజీ తరువాయి

చికిత్స పొందుతూ ఈ నెల 20న మరణించాడు. వీరి మృతిని జీర్ణించుకోక ముందే రాజగట్టు, సోని దంపతుల కుమార్తె శ్రీవర్షిణి (6)కి డెంగీ జ్వరం వచ్చింది. స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 27న దీపావళిరోజు మృతి చెందింది. అప్పటికే సోనీకి నెలలు నిండటం..ఆమెకు కూడా డెంగీ లక్షణాలున్నాయని వైద్యులు నిర్ధారించడంతో.. వైద్యం కోసం ఈనెల 28న సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలో చేర్చారు. మంగళవారం మధ్యాహ్నం సిజేరియన్ ద్వారా సోని మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువుకు కూడా డెంగీ సోకడంతో ఐసీయూ ఉంచి తల్లీ బిడ్డలకు చికిత్సను అందజేశారు. అయితే బుధవారం మధ్యాహ్నం తల్లి సోని మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని బుధవారం రాత్రి మంచిర్యాలకు తరలించారు. స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆస్పత్రి వర్గాలతో మాట్లాడి మృతదేహం తరలింపునకు ఉచితంగా అంబులెన్సును సమకూర్చారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

**కన్నీరుమున్నీరవుతున్న కుమారుడు..**

కేవలం 15 రోజుల వ్యవధిలో నలుగురిని కోల్పోవడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకే కుటుంబంలోని తల్లి, తండ్రి, చెల్లెలు ఒకరి తరువాత ఒకరిని కోల్పోయిన రాజగట్టు సోని దంపతుల కుమారుడు శ్రీవికాస్(8)ను ఓదార్చడం ఎవరి వల్ల కావడం లేదు.

**మిగిలింది ఇద్దరే..**

ఒకే కుటుంబంలో డెంగీ మహమ్మారి నలుగుర్ని పొట్టన బెట్టుకోవడంతో ఆ కుటుంబంలో మంగళవారం సోనికి జన్మించిన మగశిశువు (3రోజులు)తో పాటు, పెద్దకుమారుడు శ్రీవికాస్ మాత్రమే మిగిలారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్య పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉండటంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు.


# అమృత స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ బెంగళూరు క్యాంపస్‌లో జరిగిన సంఘటనలపై వాస్తవ నివేదిక

బెంగళూరు క్యాంపస్‌లో ఇటీవల జరిగిన సంఘటనలు మమ్మల్ని ఎంతో దుఃఖానికి గురి చేశాయి. బి.టెక్. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ చివరి సంవత్సరం చదువుతున్న మా విద్యార్థి శ్రీ జి.ఎన్.ఎన్.కె. శ్రీహర్షను మేము కోల్పోయాము. అతను అక్టోబర్ 21, 2019న అకడమిక్ భవనం ఏడవ అంతస్తు నుండి దూకి తన ప్రాణాలను తీసుకున్నాడు.

ఒక విలువైన జీవితం ఆరిపోయింది, ఇది తన బంధుమిత్రులను తీవ్ర శోకములోకి నెట్టివేసింది. ఈ తీవ్ర పరిస్థితిని అధిగమించడానికి కుటుంబ సభ్యులకు తగిన మనోబలాన్ని, శక్తిని ఇవ్వమని మేము ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాము.

ఈ విషాద సంఘటన జరిగిన కొద్ది గంటలలోనే శ్రీహర్ష మరణానికి దారి తీసిన పరిస్థితుల గురించి పూర్తిగా నిరాధారమైన సమాచారం వైరల్ అవ్వడాన్ని చూసి మేము, తల్లిదండ్రులు, విద్యార్థులతో సహా, శ్రేయోభిలాషులు అవాక్కయ్యాము.

**ఇది, ఈ సంఘటన జరిగినప్పుడు బెంగళూరు క్యాంపస్‌లో ఏమి జరిగిందో శీఘ్ర సమీక్ష :**

సెప్టెంబరు 23న కొన్ని సాంకేతిక లోపాల కారణంగా, బాయ్స్ హాస్టళ్లలో ఒక దానికి నీటి సరఫరా ఆగిపోయింది. అయితే, ప్రక్కనే ఉన్న ఇతర హాస్టల్ బ్లాక్స్ మరియు కళాశాల భవనంలో నీరు అందుబాటులో ఉంది. 16 గంటల్లో నీటి సరఫరా పూర్తిగా పునరుద్ధరించబడింది.

కానీ కొంత మంది విద్యార్థులు ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించి ఆవేశంతో హింసను ప్రేరేపించి కళాశాల బస్సులు, పిక్-అప్ వ్యాన్లు, కార్లు, భవనాల కిటికీలు, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ మరియు నిఘా కెమెరాలను ధ్వంసం చేశారు.

ఈ సంఘటన జరిగిన తదుపరి కళాశాల యాజమాన్యం విచారణ జరిపేందుకు 8 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ప్రాథమిక విచారణ ఆధారంగా, 19 మంది విద్యార్థులను తరగతుల నుండి సస్పెండ్ చేశారు. తదుపరి విచారణ జరుగుతున్నది. ఈ 19 మంది విద్యార్థుల జాబితాలో శ్రీహర్ష పేరు లేదు. మొదటి రౌండ్‌లో విచారణ కమిటీ ముందు హాజరైన విద్యార్థులు శ్రీహర్షతో సహా ఇంకొందరి విద్యార్థుల పేర్లు చెప్పారు. దీని ఆధారంగా విచారణ కమిటీ వీరిని కూడా కమిటీ ముందు హాజరు కావాలని కోరింది.

పిలువబడిన ఇతర విద్యార్థులతో, శ్రీహర్షను కమిటీతో వాస్తవాలను ధృవీకరించమని మాత్రమే కోరారు.

**మాపై వచ్చిన ఆరోపణలకు, ప్రతిస్పందనను ఇక్కడ వివరిస్తున్నాము**

**ఆరోపణ–1 :** కళాశాల యాజమాన్యం వేదింపుల కారణంగా శ్రీహర్ష ఆత్మహత్య చేసుకున్నాడు.

**వాస్తవం :** మేము శ్రీహర్షను ఎలాంటి వేధింపులకు గురి చేయలేదు అని ఖచ్చితంగా చెబుతున్నాము. ఇతర సంస్థలలో ఆచరణలో ఉన్న విధానాల్ని ఈ విషయంలోనూ అనుసరించాం. ఈ మొత్తం విచారణలు వీడియో రికార్డు చేయబడ్డాయి, ఈ రికార్డులు ఇప్పుడు పోలీసు కస్టడీలో ఉన్నాయి. చట్టపరమైన ప్రక్రియలోని భాగంగా వీటిని వారు సీలు చేశారు. వీడియోను పరిశీలిస్తే ఏ రకమైన వేధింపులకు సంబంధించిన సాక్ష్యాలు వెల్లడి కాలేదు.

**ఆరోపణ–2 :** సంఘటన జరిగిన ప్రదేశంలో, దూకి క్రింద పడ్డ అన్ని సంకేతాలను, యాజమాన్యం చెరిపి వేయడం ద్వారా సాక్ష్యాలను దెబ్బతీసింది.

**వాస్తవం :** ఎంతో మంది విద్యార్థులు మరియు సిబ్బంది ముందు, ప్రధాన భవన ప్రాంగణంలో ఈ సంఘటన జరిగింది. అక్కడ అందరి దృష్టి అతనిని వెంటనే ఆసుపత్రికి తరలించడంపై ఉంది. ఈ సంఘటనను దాచడానికి కావాలని ఎవరూ ఎటువంటి ప్రయత్నం చేయలేదు. బహిరంగ ప్రదేశంలో, అందరూ చూస్తుండగా జరిగిన సంఘటన యొక్క జాడను తొలగించడం ద్వారా యాజమాన్యానికి ఏ లబ్ది చేకూరదు.

**ఆరోపణ–3 :** ఎమ్ఎన్‌సితో శ్రీహర్ష యొక్క జాబ్ ప్లేస్‌మెంట్‌ను రద్దు చేస్తామని విచారణ కమిటీ బెదిరించింది. ఒక ఎంక్వైరీ కమిటీ సభ్యుడు, రూ.14 లక్షల పే-ప్యాకేజీని ఉన్న తన ఆఫర్ లెటర్‌ను చింపివేశాడు.

**వాస్తవం :** శ్రీహర్షకు ఇంకా ప్లేస్‌మెంట్ దొరకలేదు మరియు ఏ సంస్థ నుండి ఆఫర్ లెటర్ రాలేదు. మేము విద్యార్థుల సంక్షేమాన్నే పూర్తిగా కోరుకుంటాము. ఏ విద్యార్థి అభివృద్ధిని, అవకాశములను నిరాకరించడం అమృత చరిత్రలో లేదు. వాస్తవానికి, శ్రీహర్షకు అప్పటికే ఏడు వేర్వేరు కంపెనీలలో ప్లేస్‌మెంట్ కోసం అవకాశములను కల్పించబడినది.

**ఆరోపణ–4 :** క్యాంపస్‌లో నీటి కొరతకు యాజయాన్యం స్పందిచలేదు మరియు విద్యార్థుల అవసరాలను పట్టించుకోలేదు.

**వాస్తవం :** దేశంలోని అనేక ఇతర నగరాల మాదిరిగా బెంగళూరులోనూ నీటి కొరత ఉందని అందరికీ తెలుసు. క్యాంపస్ ఉన్న ప్రదేశంలో కావేరి నీరు సరఫరా చేయబడటం లేదు. అందువల్ల, గత 15 సంవత్సరాలుగా, అమృత నీటి సరఫరా కోసం పూర్తిగా ప్రైవేట్ వనరులపై ఆధారపడుతున్నది. నీటి రేషన్ వేసవిలో జరుగుతుంది. నగరంలోని ఎన్నో ఇతర సంస్థలు కూడా నీటి నియంత్రణ చేస్తాయి.

సెప్టెంబరు 23న, ఒక హాస్టల్ భవనం యొక్క పైప్‌లైన్ విరిగింది. ఆలస్యం చేయకుండా నీటి సరఫరాను పునరుద్ధరించడానికి ప్రయత్నించాము. కానీ, కొన్ని సాంకేతిక ఇబ్బందుల కారణంగా, నీటి సరఫరాను పునరుద్ధరించడానికి సుమారు 16 గంటలు పట్టింది. దీనిని యాజమాన్య నిర్లక్ష్య వైఖరిగా భావించకూడదు. కొన్ని సార్లు ఉత్తమ ప్రయత్నాలు చేసినప్పటికీ ఇటువంటి అనివార్య పరిస్థితులు సంభవిస్తాయి.

**ఆరోపణ–5 :** శ్రీహర్ష తల్లిదండ్రులను క్యాంపస్ ప్రాంగణంలోకి ప్రవేశించడానికి యాజమాన్యం అనుమతించలేదు.

**వాస్తవం :** విచారణ కమిటీ ముందు మొదటి సారి హాజరయ్యేందుకు, శ్రీహర్ష తన తండ్రితో వచ్చారు. కాని రెండవ విచారణ కోసం విచారణ కమిటీ తన తండ్రిని రమ్మని కోరలేదు, అందువల్ల తండ్రిని హాస్టల్ వైపు ఉండమన్నారు.

**ప్రస్తుత పరిస్థితి**

దురదృష్టకరమైన ఈ సంఘటన జరిగిన నాటి నుంచి విద్యార్థులు ఆందోళనా మార్గంలో ఉన్నారు. విశ్వవిద్యాలయ సీనియర్ అధికారులు, విద్యార్థుల ఈ ఆందోళనను పరిష్కరించడానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం సీనియర్ పోలీస్ అధికారుల సమక్షంలో జరిగింది. ఈ చర్చ సందర్భంగా, హాస్టల్ ఎంట్రీ మరియు ఎగ్జిట్ టైమింగ్స్, మెస్ టైమింగ్స్, మెనూ మార్పులు, క్యాంపస్ హింసకు పాల్పడిన విద్యార్థుల సస్పెన్షన్ వంటి అనేక విషయాలపై సంస్కరణలు తీసుకురావడంపై విద్యార్థులు మరియు యాజమాన్యము ఏకాభిప్రాయానికి వచ్చాయి. విద్యార్థుల కోసం పారదర్శక మరియు జవాబుదారీ ఫిర్యాదుల పరిష్కార ఫోరంను ఏర్పాటు చేస్తామని ఇంజనీరింగ్ డీన్ హామీ ఇచ్చారు.

క్యాంపస్ సీనియర్ అధికారులను మరియు ప్రస్తుత క్రమశిక్షణా కమిటీ సభ్యులను వెంటనే తొలగించాలని లేదా రాజీనామా చేయాలని విద్యార్థి ప్రతినిధులు అన్యాయమైన డిమాండ్ చేయడం వలన చర్చల కొనసాగింపునకు ఆటంకం కలిగినది.

అధ్యాపక సభ్యులు విశ్వవిద్యాలయంలో చట్టబద్ధంగా కేటాయించిన బాధ్యతను మాత్రమే నిర్వర్తించారు. ఈ డిమాండ్ ఆమోదయోగ్యం కాదు, ఎందుకంటే, వారిని తొలగించడము, ఆ అధికారులను దోషులుగా నిర్ధారించడంతో సమానము. సరైన దర్యాప్తు జరుపకుండా ముందే వారిపై చర్య తీసుకోవడం సరి కాదు. అలా చేస్తే విశ్వవిద్యాలయ అధ్యాపక సభ్యులందరి నిరుత్సాహానికి దారి తీయవచ్చు. ఇది ఏ విద్యాసంస్థకు ఆరోగ్యకరమైనది కాదు.

ఇక విద్యార్థులతో చర్చలు పురోగతి సాధించలేవని తేలినప్పుడు, సాధారణ పరిస్థితి పునరుద్ధరించబడే వరకు క్యాంపస్‌ను నిరవధికంగా మూసివేయాలని యాజమాన్యం నిర్ణయించినది. ప్రశాంతమైన మనసుతో సరైన ధృక్పథంతో పరిస్థితిని పరిశీలించమని మేము, విద్యార్థులందరినీ మరియు వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నాము. మనం పరస్పర అవగాహనతో మరియు అభినందనతో ముందుకు సాగగలము. అమృత యాజమాన్యము తన విద్యార్థుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తుందని, వారి అభివృద్ధిని కాంక్షిస్తుందని మేము అందరికీ హామీ ఇస్తున్నాం.

**కృతజ్ఞతలు,**
**ఇట్లు... డీన్ (ఇంజనీరింగ్),**
**అమృత విశ్వ విద్యాపీఠం,**
**www.amrita.edu**

Advt.

# నవ కశ్మీరం




## కేంద్రపాలిత ప్రాంతాలుగా జమ్మూ కశ్మీర్, లదాఖ్ పునర్వ్యవస్థీకరణ చట్టం నేటి నుంచి అమలు

**శ్రీనగర్:** అక్టోబర్ 31. ఈ తేదీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి ఇదే రోజు. 500కిపైగా విడివిడిగా ఉన్న సంస్థానాలను మన దేశంలో కలపడానికి కృషి చేసిన మహనీయుడాయన. అప్పటి ప్రధాని నెహ్రూ పాక్ సరిహద్దుల్లో ఉన్న సమస్యాత్మక ప్రాంతమైన కశ్మీర్‌ను భారత్‌లో కలపడానికి పటేల్‌కు అనుమతినివ్వలేదు. ఫలితంగా ఇన్నాళ్లూ ఆ సమస్య రావణకాష్టంలా రగిలింది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకు పటేల్ జయంతి రోజే కశ్మీర్‌లో నవ శకానికి నాంది పలికింది. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ అప్పట్లో రాజ్యాంగంలో జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని ఆగస్టు 5న రద్దు చేసింది. కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి ఓకే చెప్పింది. పటేల్ జయంతి అయిన నేటి నుంచి చట్టం అమల్లోకి వచ్చింది. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు అమల్లోకి వచ్చిన ఈ చట్టంతో 173 ఏళ్ల చరిత్ర కలిగిన జమ్మూ కశ్మీర్ కథ ఇక గతం. జమ్ము కశ్మీర్, లదాఖ్ ప్రాంతాలు కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈ చట్టం ప్రకారం అసెంబ్లీఉన్న కేంద్ర పాలిత ప్రాంతంగా జమ్మూకశ్మీర్, పూర్తి స్థాయి కేంద్రపాలిత ప్రాంతంగా లదాఖ్ అవతరించాయి.

**శాంతి భద్రతలు కేంద్రం చేతుల్లోనే**

జమ్మూకశ్మీర్‌లో శాంతి భద్రతలన్నీ గురువారం నుంచి నేరుగా కేంద్రం చేతుల్లోకి వెళ్లనున్నాయి. పోలీసు యంత్రాంగం యావత్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధీనంలో నడుచుకుంటుంది. కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కే సర్వాధికారాలు ఉంటాయి. భూ లావాదేవీల వ్యవహారాలన్నీ ప్రభుత్వ అధీనంలో ఉంటాయి. యూటీగా మారిన కశ్మీర్ అసెంబ్లీకి శాంతి భద్రతలు, పోలీసు యంత్రాంగం, పబ్లిక్ ఆర్డర్ మినహా మిగిలిన అన్ని అంశాల్లోనూ చట్టాలు చేసే అధికారాలున్నాయి. ఐఏఎస్, ఐపీఎస్, ఏసీబీ వంటివన్నీ కేంద్రం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్ పరిధిలోనే పనిచేస్తాయి. ఇక జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికయ్యే ప్రభుత్వ అసెంబ్లీ స్థానాలు 107గా ఉన్నాయి. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి వచ్చాక తర్వాత వాటి సంఖ్య 114కి పెరుగుతుంది. లెఫ్టినెంట్ గవర్నర్ సిఫారసు లేనిదే ఆర్థిక బిల్లులేవీ అసెంబ్లీలో ప్రవేశపెట్టే అధికారాలు కొత్త ప్రభుత్వానికి ఉండవు. ఇక, లదాఖ్‌కు శాసనసభ అంటూ ఏమీ ఉండదు. ఇది పూర్తిగా కేంద్ర నియంత్రణలోనే ఉంటుంది.

**ఎల్‌జీల ప్రమాణం నేడే**

జమ్మూ కశ్మీర్ కొత్త లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) గా ఐఏఎస్ అధికారి గిరీశ్ చంద్ర ముర్ము, లదాఖ్ ఎల్‌జీగా ఆర్‌కే మాథూర్‌లను కేంద్రం నియమించింది. గురువారం నాడు శ్రీనగర్, లేహ్‌లలో జరిగే కార్యక్రమాల్లో ఈ ఇద్దరు లెఫ్టినెంట్ గవర్నర్స్ పదవీ ప్రమాణం చేయనున్నారు. వీరిద్దరితో కశ్మీర్ హైకోర్టు సీజే గీత ప్రమాణం చేయిస్తారు.

# ముంపు ముప్పు ముంచుకొస్తోంది!



## భారత్‌లో మూడున్నర కోట్ల మందిపై ప్రభావం!

**అమెరికా సంస్థ అధ్యయనం**

**న్యూఢిల్లీ/వాషింగ్టన్:** సముద్ర తీరప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ముంచుకొస్తోంది. ఇంకో 30 ఏళ్లలో ఒక్క భారత్‌లోనే సుమారు మూడున్నర కోట్లమంది ముంపు ముప్పును ఎదుర్కోనుండటం ఇందుకు కారణం. వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా సముద్ర మట్టాలు పెరుగుతాయని చాలా కాలంగా తెలిసినా వాటి ప్రభావాన్ని మాత్రం మనం ఇప్పటివరకూ తక్కువ అంచనా వేశాం. అమెరికాలోని క్లైమెట్ సెంట్రల్ జరిపిన తాజా అధ్యయనం పాత అంచనాలను మార్చేస్తోంది. గతంలో కంటే కనీసం ఐదు నుంచి పది రెట్లు ఎక్కువ స్థాయిలో నష్టం జరగనున్నట్లు చెబుతోంది. చైనాలో 9 కోట్లు, బంగ్లాదేశ్‌లో 4.3 కోట్ల మందికి ముంపు ముప్పు ఉందని హెచ్చరిస్తోంది.

**అధ్యయనంలోని ముఖ్యాంశాలు**

- భూతాపోన్నతి ప్రభావం కారణంగా సముద్ర మట్టాలు ఎంత మేరకు పెరుగుతాయి? అదే సమయంలో తీరప్రాంతాల్లో నివసించే ప్రజల సంఖ్య ఎంత మేరకు ఎక్కువవుతుంది? అన్న రెండు అంశాల ఆధారంగా భవిష్యత్తు పరిణామాలను అంచనా వేసేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నించారు.
- ప్రపంచవ్యాప్తంగా 34 కోట్ల మంది తీరప్రాంత ప్రజలు ముంపు బారిన పడే చాన్సుంది. భారత్ విషయానికొస్తే.. సుమారు కోటిన్నర మంది ప్రజలు ఏటా వరద, ముంపు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.
- ముంబై, నవీ ముంబై, కోల్‌కతాల్లో ఈ ప్రభావం చాలా ఎక్కువ. గత అంచనాల ప్రకారం ఈ సంఖ్య కేవలం 50 లక్షలు.
- 20వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టం 11–16 సెంటీమీటర్లు పెరిగింది. కార్బన్ ఉద్గారాలను తీవ్రంగా తగ్గించినప్పటికీ ఈ శతాబ్దంలో సముద్ర మట్టం మరో 0.5 మీటర్లు పెరగనుంది.
- 2050నాటికి ప్రపంచవ్యాప్తంగా 34 కోట్ల మంది వార్షిక వరదల్లో మునిగిపోయే ప్రాంతాల్లో ఉండగా.. శతాబ్దం చివరినాటికి ఈ సంఖ్య 63 కోట్లను దాటనుంది.

**ఎత్తైన అల స్థాయిలో 25 కోట్లు**

ప్రపంచవ్యాప్తంగా గరిష్ట అలల ఎత్తు కంటే పదిమీటర్ల ఎక్కువ ఎత్తులో నివసిస్తోన్న తీరప్రాంత ప్రజలే వంద కోట్ల మంది ఉండగా.. మీటరు కంటే తక్కువ ఎత్తులో ఉండేవారే 25 కోట్ల మంది ఉన్నారు. వరదల ప్రభావానికి గురయ్యేవారిలో 70 శాతం మంది భారత్, చైనా, బంగ్లాదేశ్, వియత్నాం, ఇండోనేసియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, జపాన్ దేశస్తులేనని వెల్లడించింది.

**క్లుప్తంగా...**

### బాగ్దాదీ జాడ చెప్పినందుకు రూ.177 కోట్లు!

**వాషింగ్టన్/బాగ్దాద్:** ఇటీవల అమెరికా దాడుల్లో హతమైన ఉగ్రసంస్థ ఐసిస్ అధినేత అల్‌బకర్ బాగ్దాదీ గురించి ఐసిస్‌లోని కీలక సభ్యుడే ఉప్పందించాడు. బాగ్దాదీ తలపై రూ. 177 కోట్ల బహుమతిని అమెరికా గతంలో ప్రకటించింది. బాగ్దాదీ సిరియాకి వచ్చిన విషయాన్ని ఐసిస్ కీలక సభ్యుడే అమెరికాకు తెలిపాడు. ఈ నేపథ్యంలో అమెరికా ఇస్తామన్న రూ. 177 కోట్ల నగదు పూర్తిగాగానీ, ఎక్కువ మొత్తంలోగానీ అతడికే దక్కే అవకాశం ఉంది. ఆ వ్యక్తి జాతీయతనుగానీ మరే వివరాలనుగానీ అతడి భద్రత రీత్యా వెల్లడించలేదు. గతంలో ఇతడే బాగ్దాదీ లోదుస్తులను, రక్తపు శాంపిల్‌ను అమెరికాకు అందించాడు. వీటి ఆధారంగానే మరణించింది బాగ్దాదీదేనని డీఎన్‌ఏ పరీక్షల్లో నిర్ధారించుకున్నారు.

### మెడిటేషన్ కోసం విదేశాలకు రాహుల్!



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విదేశాలకు ఆధ్యాత్మిక పర్యటనకు వెళ్లారు. ఆయన త్వరలోనే తిరిగి వస్తారని పార్టీ అధికార ప్రతినిధి సూర్జేవాలా చెప్పారు. రాహుల్ ధ్యానం చేసుకునేందుకు తాను తరచుగా వెళ్లే ప్రాంతానికి వెళ్లారన్నారు. నవంబర్ 5 నుంచి ఆర్థిక మందగమనం, రైతాంగ సంక్షోభం తదితర సమస్యలపై దేశవ్యాప్తంగా పోరాటాలు చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఆ ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన సమావేశానికి రాహుల్ హాజరయ్యారని సూర్జేవాలా తెలిపారు. రాహుల్ ఇండోనేసియా వెళ్లారని పార్టీ వర్గాలు తెలిపాయి.

### ఈడీ ముందుకు శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రా



**ముంబై:** ప్రముఖ వ్యాపారవేత్త, నటి శిల్పాశెట్టి భర్త రాజ్ కుంద్రా బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు హాజరయ్యారు. దివంగత గ్యాంగ్‌స్టర్ ఇక్బాల్ మిర్చికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ రాజ్‌కుంద్రాకు సమన్లు జారీ చేసింది. కుంద్రా ఉదయం 11 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయానికి వచ్చారని దర్యాప్తు సంస్థ అధికారులు తెలిపారు. కుంద్రాను నవంబర్ 4న హాజరు కావాలని దర్యాప్తు సంస్థ కోరగా, ఆ సమయంలో తాను అందుబాటులో ఉండలేని కారణంగా ముందస్తు తేదీని కోరినట్లు తెలిసింది. ఈ కేసుకు సంబంధించి రంజీత్ బింద్రా, బాస్టియన్ హాస్పిటాలిటీ సంస్థలతో కుంద్రాకు గల సంబంధాలు, వడ్డీలేని రుణాలు అందించిన విషయంపై ఈడీ పరిశీలిస్తోంది.

### అమ్మకానికి 13 లక్షల పేమెంట్ కార్డుల డేటా

**న్యూఢిల్లీ:** భారతీయులకు చెందిన 13 లక్షల డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు డార్క్ వెబ్ అనే హ్యాకర్ల వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమయ్యాయి. వీటిని హ్యాకర్లు ఓపెన్ సేల్‌లో ఉంచారు. ఈ కార్డుల్లో ఉన్న మొత్తం డబ్బు విలువ రూ. 922 కోట్లు కాగా ఒక్కో కార్డును దాదాపు రూ. 7వేలకు విక్రయిస్తున్నట్లుగా వెబ్‌సైట్లో ఉంచారు. డార్క్ వెబ్‌లోని జోకర్స్ స్టాష్‌లో వీటిని అందుబాటులో ఉంచారు. కార్డుల వివరాలను ఏదైనా ఏటీఎం నుంచిగానీ లేదా పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) మెషీన్ల ద్వారా సేకరించి ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. కార్డులకు ఉండే మాగ్నటిక్ స్ట్రిప్‌లో వినియోగదారుడి వివరాలుంటాయి. వాటిని క్లోన్ చేయడం ద్వారా హ్యాకర్లు అకౌంట్లపై దాడి చేసే చాన్సుంది. గత జనవరిలో హ్యాకర్లు ఇలాగే 21 లక్షల అమెరికన్ కార్డుల వివరాలు హ్యాక్ చేసి ఓపెన్ సేల్‌లో ఉంచారు.

# తేరే మేరే బీచ్ మే



మహారాష్ట్ర బీజేపీ శాసనసభ పక్షనేతగా ఎన్నికయ్యాక పార్టీనేతలతో కలసి ఫడ్నవీస్ అభివాదం

- బీజేపీ శివసేన మధ్య ఏదో తెలియని బంధముందన్న 'మహా'మంత్రి
- త్వరలోనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న ఫడ్నవీస్

**సాక్షి, ముంబై/న్యూఢిల్లీ:** తేరే మేరే బీచ్ మే కైసా హైయే బంధన్ అంజానా. ఇదీ 1981లో విడుదలైన హిందీ చిత్రం ఏక్ దూజే కేలియేలో సూపర్ హిట్ సాంగ్. నీకూ, నాకూ మధ్య ఎంత వింత అనుబంధం ఉంది. అదేంటో నీకూ తెలీదు, నాకూ తెలీదు అన్న అర్థంలో ఆ పల్లవి సాగుతుంది. మహారాష్ట్ర బీజేపీ మంత్రి సుధీర్ ముంగన్‌తివార్ ఈ పాటను గుర్తుకు చేస్తూ బీజేపీ, శివసేన మధ్య అధికారాన్ని పంచుకోవడంలో ప్రతిష్టంభన నెలకొన్నప్పటికీ ఇరుపార్టీల మధ్య ఏదో తెలియని బంధముందని వ్యాఖ్యానించారు.

**శాసనసభా పక్ష నాయకుడిగా ఫడ్నవీస్**

మహారాష్ట్ర బీజేపీ శాసనసభా పక్ష నాయకుడిగా బుధవారం నాడు దేవేంద్ర ఫడ్నవీస్ మరోసారి ఎన్నికయ్యారు. కేంద్ర పరిశీలకులుగా వచ్చిన కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, పార్టీ ఉపాధ్యక్షుడు అవినాష్ రాయ్ ఖన్నాల సమక్షంలో అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన 105 మంది ఎమ్మెల్యేలు సమావేశమై తమ నాయకుడిగా ఫడ్నవీస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకం ఉంచిన ఎమ్మెల్యేలకు ఫడ్నవీస్ కృతజ్ఞతలు తెలిపారు. శివసేన అధినేత ఉద్ధవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

**శివసేన లేకుండా ప్రభుత్వమే లేదు: ఫడ్నవీస్**

మహారాష్ట్రలో నెలకొన్న రాజకీయ సంక్షోభం నేపథ్యంలో వచ్చిన ప్రత్యామ్నాయాలన్నింటినీ దేవేంద్ర ఫడ్నవీస్ ఒక్క వ్యాఖ్యతో తోసిపుచ్చారు. మహారాష్ట్రలో బీజేపీ–శివసేన కూటమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. శాసనసభా పక్ష నాయకుడిగా ఎన్నికైన తర్వాత ఫడ్నవీస్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయం గురించి బయటకు వచ్చిన వార్తలన్నీ ఊహాగానాలేనని, కేవలం వినోదం కోసమే వాటిని ప్రచారం చేశారని అన్నారు. 'ఎన్నికల్లో ప్రజలు బీజేపీ–శివసేన కూటమికే ఓట్లు వేశారు. పూర్తి స్థాయి మెజార్టీని అప్పగించారు. అందుకే ఆ కూటమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 56 స్థానాలు గెలిచిన శివసేన ఆరుగురు స్వతంత్రుల మద్దతుతో బలాన్ని 62కు పెంచుకుంది. తమ గౌరవానికి భంగం కలగకుండా బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటం శివసేనకు అవసరమని ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్ రౌత్ చెప్పారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై శివసేన కొంచెం మెత్తబడినట్లయిందని భావిస్తున్నారు.

**ఎన్సీపీ, కాంగ్రెస్‌లది ప్రతిపక్ష పాత్రే..**

ప్రజా తీర్పుకి అనుగుణంగా కాంగ్రెస్, ఎన్సీపీలు ప్రతిపక్షంలోనే కూర్చుంటాయని మహారాష్ట్ర ఎన్సీపీ చీఫ్ జయంత్ పాటిల్ స్పష్టం చేశారు. శివసేనకు ఎన్సీపీ, కాంగ్రెస్ మద్దతునిస్తాయని ఊహాగానాలు రేగుతున్న నేపథ్యంలో పాటిల్ ఈ విషయంలో స్పష్టమైన ప్రకటన చేశారు. ''ప్రజలు మమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోమని తీర్పు ఇచ్చారు. మేము దానిని పాటిస్తాం''అని పాటిల్ చెప్పారు. ఎన్సీపీలో మరో కీలక నాయకుడు అజిత్ పవార్ మహారాష్ట్ర కొత్త ప్రభుత్వం చేసే తప్పుల్ని ఎత్తి చూపుతూ సరైన దారిలో వెళ్లేలా చేస్తామని అన్నారు.

**శివసేనకు ఉప ముఖ్యమంత్రి పదవి?**

ఉప ముఖ్యమంత్రి సహా ఇతర కీలక శాఖల్ని శివసేనకు అప్పగించడానికి బీజేపీ ముందుకొచ్చింది. ఈ మేరకు శివసేన పార్టీతో మంతనాలు సాగిస్తోందని ప్రచారం జరుగుతోంది. కేంద్రంలో కూడా మంత్రి పదవులు ఇవ్వడానికి సిద్ధమైందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. హోంశాఖ, ఆర్థిక, రెవిన్యూ శాఖ బీజేపీ తన దగ్గర ఉంచుకోనుందని ప్రచారం జరిగింది.

**మహా కార్టూన్**



మహారాష్ట్రలో బీజేపీ, శివసేన మధ్య ప్రతిష్టంభనకు ఈ కార్టూన్ అద్దం పడుతోంది. బీజేపీ గుర్తు కమలంపై, శివసేన గుర్తు బాణం వేళ్లాడుతున్నట్టుగా వేశారు. దాని కింద క్యాప్షన్ రూపంలో ఒక సామెత ఉంది. 'మెడపై కత్తి వేలాడుతోంది' అని మరాఠీలో రాశారు.

# కేంద్ర ప్రభుత్వంలో చేరుతాం: జేడీయూ

**కానీ, సరైన ప్రాతినిధ్యం ఇవ్వాలి**

**న్యూఢిల్లీ:** సరైన ప్రాతినిధ్యం కల్పిస్తే కేంద్ర కేబినెట్లో చేరేందుకు సిద్ధమేనని జనతాదళ్(యునైటెడ్) బుధవారం సంకేతాలిచ్చింది. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఈ జూన్ నెలలో కేంద్ర ప్రభుత్వంలో చేరాలంటూ బీజేపీ నుంచి వచ్చిన ఆహ్వానాన్ని జేడీయూ నిరాకరించిన విషయం తెలిసిందే. జేడీయూకి కేంద్రంలో ఒకే మంత్రి పదవి ఇస్తామని బీజేపీ ప్రతిపాదించడంతో ప్రభుత్వంలో చేరేందుకు నాడు జేడీయూ నిరాకరించింది. తాజాగా, బుధవారం జరిగిన జేడీయూ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను పార్టీ మరో మూడేళ్ల కాలానికి అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ఆ తరువాత నితీశ్ పార్టీ నేతలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆ వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ త్యాగి మీడియాకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో చేరేందుకు జేడీయూ సిద్ధంగానే ఉందని, అయితే, తమకు మంత్రిమండలిలో సరైన ప్రాతినిధ్యం కావాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ కానీ, బీజేపీ చీఫ్ అమిత్ షా కానీ ఈ విషయంలో చొరవ తీసుకుంటే తాము స్వాగతిస్తామన్నారు. ఈ విషయంలో తామేమీ షరతులు విధించబోమన్నారు. మహారాష్ట్రలో మిత్రపక్షాలు బీజేపీ, శివసేనల మధ్య ప్రభుత్వ ఏర్పాటులో విబేధాలు ఏర్పడిన నేపథ్యంలో.. తాజాగా జేడీయూ ఈ ప్రతిపాదన తీసుకురావడం గమనార్హం. 2015 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేను నితీశ్ ఓడించారు.

# '370' భారత అంతర్గత వ్యవహారం

- కశ్మీర్లో పర్యటించిన ఈయూ పార్లమెంటేరియన్ల బృందం వ్యాఖ్య

**శ్రీనగర్:** ఆర్టికల్ 370 రద్దు అనేది భారత అంతర్గత వ్యవహారమని కశ్మీర్లో పర్యటిస్తున్న యూరోపియన్ యూనియన్ పార్లమెంటేరియన్ల బృందం పేర్కొంది. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తమ సంపూర్ణ మద్దతుంటుందని స్పష్టం చేసింది. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగ అధికరణ 370ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నాక కశ్మీర్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించేందుకు ఈయూ పార్లమెంటేరియన్ల బృందం భారత్‌కు రావడం తెల్సిందే. కశ్మీర్‌పై అంతర్జాతీయ మీడియా వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని, అక్కడికి వెళ్లాక ఇక్కడి వాస్తవ పరిస్థితిని వారికి వివరిస్తామని తమ పర్యటన అనంతరం ఈయూ ఎంపీలు తెలిపారు. కశ్మీరీలు తాము భారతీయులమనే భావిస్తున్నారని, వారు శాంతియుత భవిష్యత్తునే కోరుకుంటున్నారని వివరించారు. తమను ఫాసిస్టులు అంటూ ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.



ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఈయూ బృందం

**అతిపెద్ద తప్పు..**

కశ్మీర్లోకి ఈయూ పార్లమెంటేరియన్ల బృందాన్ని అనుమతించడం భారత విదేశాంగ విధాన చరిత్రలోనే అతిపెద్ద తప్పిదంగా కాంగ్రెస్ అభివర్ణించింది. కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం భారత్‌ను అవమానపరుస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా ఆరోపించారు.

# కొలీజియం నిర్ణయాల్లో గోప్యత అవసరమే

**జస్టిస్ బాబ్డే వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జీల నియామకానికి సంబంధించి కొలీజియంలో జరిగే చర్చలను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టుకు కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే అభిప్రాయపడ్డారు. జడ్జీలుగా నియమించాలని సిఫారసు చేసేందుకు కొలీజియం తిరస్కరించిన వారికి సంబంధించి జరిగిన చర్చల వివరాలను వెల్లడించనక్కరలేదన్నారు. ఈ మేరకు బుధవారం పీటీఐ వార్తాసంస్థకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. నవంబర్ 18న సుప్రీంకోర్టు 47వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బాబ్డే బాధ్యతలు స్వీకరించనున్న విషయం తెలిసిందే. కేవలం సమాచారం తెలుసుకోవాలన్న పౌరుల కోరిక తీర్చడం కోసం వ్యక్తుల ప్రతిష్టకు సంబంధించిన విషయాన్ని బహిర్గత పరచడం సరికాదని తన అభిప్రాయమని జస్టిస్ బాబ్డే పేర్కొన్నారు. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని తీర్పునిచ్చిన 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ బాబ్డే కూడా ఒకరు. న్యాయమూర్తులిచ్చే తీర్పులపై సోషల్ మీడియాలో వచ్చే విమర్శలను కూడా జస్టిస్ బాబ్డే తప్పుపట్టారు. అలాంటి విమర్శలతో చాలామంది న్యాయమూర్తులు ఆవేదన చెందుతుంటారన్నారు. 'ఉదాహరణకు.. ఒక హైకోర్టు జడ్జికి సుప్రీంజడ్జీగా పదోన్నతి కల్పించాలనుకుని, ఆ తరువాత పరిశీలనలో తమకందిన సమాచారం మేరకు సుప్రీంకోర్టు జడ్జీగా ఆయన సరికాదని కొలీజియం నిర్ణయిస్తుంది. ముందుగా, ఆయన పేరును పరిశీలించడం ఎందుకు? ఆ తరువాత పదోన్నతికి పనికిరాడని నిర్ణయించి, ఆ విషయాన్ని బహిర్గం చేయడం ఎందుకు? ఆ జడ్జీ ఆ తరువాత కూడా ఆ హైకోర్టులో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది కదా! అతనికి అది ఇబ్బందికరంగా ఉండదా?' అని ప్రశ్నించారు. వారిని బాధపెట్టడం సరికాదన్నారు.



ఢిల్లీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం ప్రారంభించిన నేపథ్యంలో బుధవారం వారి అభిప్రాయాలు తెల్సుకుంటున్న సీఎం కేజ్రీవాల్

# ముందస్తుకు బ్రిటన్ జై



**పార్లమెంటు ఆమోద ముద్ర**
**డిసెంబర్ 12న ఎన్నికలు**

**లండన్:** బ్రెగ్జిట్ సంక్షోభాన్ని నివారించడానికి బ్రిటన్ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు సిద్ధమైంది. బ్రిటిష్ పార్లమెంటుకి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ ఇచ్చిన పిలుపుకి ప్రజాప్రతినిధులందరూ అనుకూలంగా స్పందించారు. దీంతో డిసెంబర్ 12న ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు మొదలయ్యాయి. యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలగడానికి జనవరి నెలఖారువరకు ఈయూ గడువు పొడిగించడంతో ఈలోగా ఎన్నికలు నిర్వహించాలని బోరిస్ జాన్సన్ భావించారు. బ్రిటన్‌లో ముందస్తు ఎన్నికలు నిర్వహించాలంటే ప్రధానమంత్రి ఎంపీల మద్దతుతో మాత్రమే ఆ పని చేయగలరు.

**ఎన్నికలకు పార్లమెంటు ఆమోదం**

ప్రధాని బోరిస్ జాన్సన్ ముందస్తు ఎన్నికల ప్రతిపాదనపై చర్చించిన హౌస్ ఆఫ్ కామన్స్ 438–20 తేడాతో ఆమోద ముద్ర వేసింది. బ్రెగ్జిట్ ప్రణాళికకు అనుకూలంగా ప్రజా మద్దతు కూడగట్టుకోవడానికి జాన్సన్ క్రిస్మస్ పండుగకి ముందే ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని వ్యూహరచన చేశారు. ఓటు హక్కు వయసుని 16కి తగ్గించాలని, ఓటింగ్‌లో ఈయూ పౌరులు కూడా పాల్గొనాలని, డిసెంబర్ 9న ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్ష లేబర్ పార్టీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

**ఇరు పార్టీలకూ ప్రతిష్టాత్మకమే**

మైనార్టీ ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్న కన్జర్వేటివ్ పార్టీ ఎలాగైనా బ్రెగ్జిట్ ఒప్పందానికి ఆమోద ముద్ర పడేలా ఎప్పటికప్పుడు వ్యూహాలు పన్నుతోంది. కానీ బ్రెగ్జిట్ ఒప్పందాన్ని విపక్ష లేబర్ పార్టీ వ్యతిరేకిస్తూ ఉండడంతో అది సాధ్యం కావడం లేదు. బ్రెగ్జిట్‌కు ఈయూ గడువును అక్టోబర్ 31 నుంచి 2020 జనవరి 31 వరకు పెంచిన వెంటనే ప్రధాని బోరిస్ జాన్సన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు ప్రతిపక్ష లేబర్ పార్టీ కూడా సహకరించింది. పార్లమెంటులో మరింత బలం పెంచుకొని ఈయూకి గుడ్‌బై కొట్టేయాలని లెక్కలు వేసుకుంటున్న బోరిస్ దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఈ ఎన్నికలు అత్యంత కీలకమని ప్రజలందరూ గ్రహించాలన్నారు. బ్రిటన్ బ్రెగ్జిట్ కల సాకారమవడానికి ప్రజలందరూ చేతులు కలపాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. వామపక్షభావజాలం కలిగిన లేబర్ పార్టీ నాయకుడు జెర్మీ కార్బన్ కూడా మార్పు కోసం పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని వ్యూహాలు రచిస్తున్నారు. అయితే ఒపీనియన్ పోల్స్ అన్నీ కన్జర్వేటివ్ పార్టీకే అధికారం దక్కుతుందని అంచనా వేస్తూ ఉండడంతో కార్బన్ నేతృత్వంలో ఎలాంటి ఫలితాలు వస్తాయోనన్న ఆందోళన ఆ పార్టీ ఎంపీల్లో నెలకొని ఉంది.

**నాలుగేళ్లలో మూడో ఎన్నికలు**

బ్రిటన్‌లో గత నాలుగేళ్లలో మూడోసారి జరుగుతున్న ఎన్నికలు ఇవి. ఈ నాలుగేళ్ల కాలంలో ప్రజా తీర్పులో చాలా వైరుధ్యాలు ఉన్నాయి. 2015, 2017 ఎన్నికల్లో ప్రజల మూడ్‌లో వచ్చిన మార్పు చూస్తే ఈ ఎన్నికల్లో జాన్సన్ చావో రేవో తేల్చుకోవాల్సిందేనని రాజకీయ నిపుణులు అంటున్నారు. బ్రెగ్జిట్ ఒప్పందం ముందుకు వెళ్లాలంటే బోరిస్ జాన్సన్ కచ్చితంగా ఈ ఎన్నికల్లో గెలిచి తీరాలి. హంగ్ పార్లమెంటు వస్తే మళ్లీ దేశంలో అనిశ్చితి తప్పదని నిపుణుల అభిప్రాయంగా ఉంది.

సాక్షి
గురువారం, అక్టోబర్, 31

# తుది ఘట్టంలో 'నాగా చర్చలు'

వలస పాలకులు వదిలివెళ్లిన సమస్యల్లో అత్యంత సంక్లిష్టమైన నాగాలాండ్ సమస్యపై కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లక్రితం ప్రారంభించిన శాంతి చర్చల ప్రక్రియ నేటితో ముగుస్తోంది. ఇంతవరకూ దేనిపైనా స్పష్టత లేనందువల్ల ఈ ప్రక్రియను మరికొంత కాలం కొనసాగించాలని నాగాలాండ్‌లోని భిన్న సంస్థలు కోరుతున్నాయి. కానీ కేంద్రం తన వైఖరేమిటో ఇంకా చెప్పలేదు. ఏడు దశాబ్దాలుగా నానుతూ, మూడు దశాబ్దాలుగా సంక్షోభాల మధ్యే భిన్న ప్రభుత్వాల హయాంలో శాంతి చర్చలు సాగుతూ ఈ నాగా సమస్య సవాలు విసురుతూనే ఉంది. తొలిసారి 1986లో ఆనాటి ప్రధాని రాజీవ్‌గాంధీ మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్)తో శాంతి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఆ తర్వాత 2015లో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో అటువంటిదే కుదిరింది. దానిపై దాదాపు అన్ని పక్షాలూ హర్షం వెలిబుచ్చినా ఈశాన్య రాష్ట్రాల్లో... ముఖ్యంగా అస్సాం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే దాన్ని ఒప్పందం అనకుండా, ఒప్పందానికి సంబంధించిన స్వరూపం(ఫ్రేమ్‌వర్క్) అని అప్పట్లో కేంద్రం ప్రకటించింది. ఆ స్వరూపానికి అనుగుణంగా స్పష్టమైన విధివిధివిధానాలతో, సవివరమైన నిబంధనలతో ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పింది. అయితే అప్పటినుంచీ చర్చలు సాగుతూనే ఉన్నా ఇంతవరకూ ఒప్పందం తుది మెరుగులు దిద్దుకుందన్న సూచనలెక్కడా లేవు. భిన్న పక్షాలతో తాను సాగిస్తున్న చర్చలు ముగింపు దశకొచ్చాయని కేంద్రం తరపున వారితో మాట్లాడుతున్న నాగాలాండ్ గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఇటీవల చెప్పారు. కానీ ఉన్నట్టుండి మ్యువా పక్షం చేసిన ప్రకటన పెనుతుపాను రేపింది. నాగాలాండ్‌కు ప్రత్యేక జెండా, ప్రత్యేక రాజ్యాంగం ఉండాలన్నదే తమ కృతనిశ్చయమని దాని సారాంశం. ఒకపక్క కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే 370 అధికరణను ఉండరాదనుకున్న కేంద్రం ఇలాంటి డిమాండ్లకు తలొగ్గుతుందని ఎవరూ అనుకోరు. కానీ ఈ డిమాండ్ పెట్టడంలోనే మ్యువా పక్షం కఠిన వైఖరి అర్థమవుతుంది. పైగా భారతీయులకూ, నాగాలకూ మధ్య పరస్పర సహజీవనం ఎప్పటినుంచో ఉన్నదని, ఉమ్మడి ప్రయోజనాల కోసం ఇకముందూ అది కొనసాగుతుందని తెలిపి సంచలనం రేపింది.

అయితే రవి అంటున్నట్టు కేవలం చర్చల ప్రక్రియను సాగదీయడం ఒక్కటే మ్యువా ప్రకటన వెనకున్న లక్ష్యమా లేక ఇతరత్రా ఉద్దేశాలున్నాయా అన్నది చూడాల్సి ఉంది. కానీ సమస్య ఎంత జటిలమైనదో, అది ఏ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తున్నదో అటు మణిపూర్ ప్రభుత్వం, ఇటు అరుణాచల్ ప్రదేశ్‌లో వెలువడుతున్న ప్రకటనలే తార్కాణం. తమను ప్రభావితం చేసేలా ఎలాంటి నిర్ణయాలు ఉండటానికి వీల్లేదని ఆ రెండు రాష్ట్రాల్లోని విద్యార్థి సంఘాలు, ఇతర సంస్థలూ అంటున్నాయి. ఎన్‌ఎస్‌సీఎన్–ఐఎం కోర్కెలు సాధారణమైనవి కాదు. నాగా ప్రజలు అధికంగా నివసిస్తున్న మణిపూర్‌లోని నాలుగు జిల్లాలు, అస్సాంలోని రెండు జిల్లాలు, అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలూ కలిపి విశాలం నాగాలాండ్ ఏర్పాటు చేయాలని అది కోరుతోంది. ఈ ప్రాంతాలన్నిటా మొత్తంగా 12 లక్షలమంది నాగా ప్రజలున్నారు. ఇక్కడ మాత్రమే కాదు... పొరుగునున్న మయన్మార్‌లో సైతం ఆ జాతి ప్రజలున్నారు. వివిధ ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న వివక్ష వల్ల తమ జాతి జనం నానా ఇబ్బందులూ పడుతున్నారని, తమ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ధ్వంసమవుతున్నాయని ఐఎం ఆరోపిస్తోంది. దీనిపై ఆ సంస్థ మొదటినుంచీ గట్టిగా పట్టుబడుతున్నందునే 2015లో ఒప్పందం కుదిరిందన్న ప్రకటన వెలువడినప్పుడు అస్సాంతోపాటు మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో అనేక అనుమానాలు తలెత్తాయి. ఇప్పుడున్న భౌగోళిక సరిహద్దులేవీ మారవని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా అవి సమసిపోలేదు. కుదిరిన ఆ ఒప్పందంలోని అంశాలు బయటపెట్టాలని అప్పట్లో ఆ రాష్ట్రాలు కోరాయి. ఇప్పుడు ఆ మూడుచోట్లా బీజేపీ ప్రభుత్వాలు వచ్చాయి. కనుక ప్రభుత్వాలు మాట్లాడటం లేదుగానీ అక్కడి ప్రజా సంఘాలు డిమాండు చేస్తూనే ఉన్నాయి.

అయితే సమస్య ఉన్నప్పుడు, అది అత్యంత సంక్లిష్టమైనది అయినప్పుడు పరిష్కార మార్గంలో అవరోధాలు ఉండటం సహజమే. అవి ఉన్నాయి కదా అని మొత్తం పరిష్కారం జోలికే పోకుండా ఉండటం మరిన్ని సమస్యలు తెచ్చిపెడుతుంది. ఏడు దశాబ్దాలుగా నాగాలాండ్ నెత్తుటి చరిత్రే దీనికి సాక్ష్యం. నాగాలాండ్‌లో ఎన్నో మిలిటెంట్ సంస్థలు ఆవిర్భవించాయి. అవి సాగించిన హింసవల్ల ఎందరో పౌరులు, మిలిటెంట్లు, భద్రతా బలగాలకు చెందినవారు మరణించారు. తరచు తెగల మధ్య ఘర్షణలు చెలరేగి వందలాదిమంది ఊచకోతకు బలయ్యారు. 60వ దశకంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తొలిసారి తిరుగుబాటుదార్లతో న్యూఢిల్లీలో చర్చలకు సిద్ధపడ్డారు. అయితే తమకు కేటాయించిన హోటల్ గదులను ఒక విదేశీ బృందం కోసం ఖాళీ చేయించడంతో ఆగ్రహించిన తిరుగుబాటుదార్లు చర్చలకు స్వస్తిచెప్పి నిష్క్రమించారు. కేంద్రం తమకు సమాన స్థాయినిచ్చి మాట్లాడకపోతే చర్చల సమస్యేలేదని అప్పట్లో తిరుగుబాటుదార్లు ప్రకటించారు. అటుపై మిలిటెంట్ సంస్థల మధ్య ఉన్న విభేదాలను ఉపయోగించుకుని ప్రభుత్వాలు వాటిని బలహీనపరచడానికి ప్రయత్నించాయి. అయితే పాత సంస్థలు కనుమరుగవుతున్నా అంతకు మించిన శక్తితో కొత్తవి పుట్టుకొస్తున్నాయి. కేంద్రం గత కొంతకాలంగా మ్యువా పక్షంతోనూ, ఏడెనిమిది సంస్థలకు ప్రాధాన్యం వహిస్తున్న నాగా నేషనల్ పొలిటికల్ గ్రూప్(ఎన్‌ఎన్‌పీజీ)తోనూ విడివిడిగా చర్చిస్తోంది. ఐఎం వంటి సంస్థను చర్చలకు ఒప్పించడమే కాదు...ఫ్రేమ్‌వర్క్‌పై సంతకం కూడా చేయించిన కేంద్రం ఇప్పుడు చివరి దశలో అన్ని పక్షాలనూ తన దారికెలా తెచ్చుకుంటుందన్నది చూడాల్సి ఉంది. చర్చల ఉద్దేశం శాంతి స్థాపన కనుక, అది సాధ్యపడే వరకూ వాటిని కొనసాగించడమే ఉత్తమం. అప్పుడు మాత్రమే దీర్ఘకాలంగా ఈశాన్యాన్ని పీడిస్తున్న సమస్యకు అర్థవంతమైన పరిష్కారం సాధ్యపడుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, తిథి శు.చవితి తె.4.12 వరకు (తెల్లవారితే శుక్రవారం) నక్షత్రం జ్యేష్ఠ రా.1.23 వరకు, తదుపరి మూల వర్జ్యం ఉ.7.10 నుంచి 8.44 వరకు, దుర్ముహూర్తం ఉ.9.48 నుంచి 10.34 వరకు, తదుపరి ప.2.23 నుంచి 3.10 వరకు అమృతఘడియలు... సా.4.39 నుంచి 6.12 వరకు, నాగుల చవితి.

**సూర్యోదయం :** 6.01
**సూర్యాస్తమయం:** 5.27
**రాహుకాలం :** ప.1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

# అయోధ్యలో శాంతి కుసుమించేనా?

విశ్లేషణ



వలయ్ సింగ్

**దశాబ్దాలుగా ఆధ్యాత్మిక గురువులు, సన్యాసుల రూపంలో నేరస్తులు రాజ్యమేలుతున్న అయోధ్యలో పవిత్రత నశించిపోతోంది. కానీ రామమందిర ఉద్యమం, దానిచుట్టూ నడుస్తున్న రాజకీయాలు ఏవీ అయోధ్యలో వారసత్వంగా వస్తున్న భక్తి, శాంతిని ధ్వంసం చేయలేకపోయాయి. ముక్తిగాములై ఆశ్రయం పొందగోరి వచ్చిన, ఆధ్యాత్మికత తప్ప మరేమీ ఎరుగని ప్రజల నివాస ప్రాంతంనుంచి హిందూ ఓటు బ్యాంకును సృష్టించే రాజకీయ ఉద్యమానికి ప్రయోగ స్థలంగా అయోధ్య ప్రస్తుతం రూపాంతరం చెందింది. మందిర్–మసీద్ వివాదానికి న్యాయపరిష్కారం సమీపిస్తున్న తరుణంలో మసీదు కూల్చివేత సందర్భంగా నమోదు చేసిన కేసులను కూడా ఫాస్ట్ ట్రాక్ తరహాలో విచారించి తీర్పు చెప్పడం అవసరం. ముస్లింలలో తమకూ న్యాయం జరిగిందనే సంతోషాన్ని కల్పించే బాధ్యత కూడా సుప్రీంకోర్టు మీదే ఉంది.**

హిందూ మతతత్వవాదులు బాబ్రీమసీదులో రామ్ లల్లా విగ్రహాన్ని నిర్బంధంగా స్థాపించి 25,500 రోజులు దాటాయి. విశ్వహిందూ పరిషత్ మత ప్రచారాన్ని కౌగలించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం బాబ్రీ మసీదును తిరిగి తెరిచి హిందువులు అక్కడ పూజలు జరుపుకునేలా రాజకీయం చేసి 30 సంవత్సరాలకు పైబడింది. మధ్యయుగాలకు చెందిన బాబ్రీ మసీదును కూలగొట్టిన సందర్భంగా హిందూ ముస్లింల మధ్య రక్తపాత దాడుల నేపథ్యంలో దేశ సామాజిక చట్రమే కుప్పగూలిపోయి దాదాపు 27 సంవత్సరాలు కావస్తోంది. ఇంత సుదీర్ఘ కాలం విరామం తర్వాత సుప్రీంకోర్టు ఈ లీగల్ కేసులో తుది తీర్పును మరికొన్ని రోజుల్లో వెలువరించనుందని వింటున్నాం.

అయోధ్య, బాబ్రీ మసీదు వివాదం గురించిన పతాక శీర్షికల వెనుక ఎలాంటి ప్రత్యేకతా లేకుండా సాధారణంగా కనిపించే అయోధ్యలో తరాలుగా నడుస్తున్న ఈ వివాదానికి తెరపడే క్షణాల కోసం ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. ఇక అసంఖ్యాక హిందువుల దృష్టిలో, శ్రీరాముడు జన్మించిన స్థలంగా భావిస్తున్న అయోధ్యపై తమ హక్కును సాధించేందుకోసం దశాబ్దాలుగా కాకుంటే శతాబ్దాలుగా సాగిస్తున్న పోరాటానికి మంగళం పలుకుతున్న క్షణాలివి.

ఇటీవలి సంవత్సరాల్లో తాము ముట్టడికి గురైన భావన పెరుగుతున్న ముస్లింల విషయానికి వస్తే, ఇదొక బాధాకరమైన, భ్రష్ట అధ్యాయం ముగింపుకొస్తున్న క్షణంగా కనిపిస్తోంది. వాస్తవానికి హిందూ మెజారిటీ తత్వం నుంచి పొంచి ఉన్న ప్రమాదం తీవ్రతను గుర్తించిన కొందరు పదవీ విరమణ చేసిన ముస్లిం మేధావులు ఒక బహిరంగ సభను నిర్వహించి అయోధ్యలో వివాదాస్పద స్థలాన్ని హిందువులకు 'కానుక'గా ఇచ్చేయాలంటూ వివాదంలో ముస్లింల పక్షం వహిస్తున్న లీగల్ పార్టీలను కోరారు. ఒకవేళ లీగల్ పోరాటంలో ముస్లింలే గెలిచినప్పటికీ కూల్చివేతకు గురైన స్థలంలో బాబ్రీమసీదును పునర్నిర్మించడం అసాధ్యమని వీరి అభిప్రాయం. దేశ న్యాయవ్యవస్థపై మనకున్న సామూహిక విశ్వాసం గతి ఇదన్నమాట.

వాస్తవానికి, అయోధ్య–బాబ్రీ మసీదు వ్యవహారం మన న్యాయవ్యవస్థ, ప్రభుత్వం మూక సంకల్పానికి ఎలా తలొగ్గుతాయో తెలిపే పరమోదాహరణంగా నిలుస్తుంది. మొదటిసారిగా 1949లో, తర్వాత 1989లో, అంతిమంగా 1992లో భద్రతా బలగాలు చూస్తుండగానే బాబ్రీ మసీదును నిర్మూలించిన ఘటన న్యాయపాలనపై మూక పాలన ప్రాబల్యానికి తిరుగులేని ఉదాహరణగా నిలుస్తుంది.

అయితే మెజారిటీ అభిప్రాయం రాజ్యమేలుతున్నది వీధుల్లోనే కాదు.. సుప్రీం కోర్టు తుది విచారణగా పేరొందిన ప్రక్రియలో కూడా ఈ తీరే కనిపిస్తోంది. వివాదంలో భాగమైన ముస్లిం పార్టీలు సుప్రీం కోర్టు కూడా పాక్షికత్వంతో ఉంటోందని ఆరోపించాయి. సుప్రీంకోర్టు తుది విచారణ సాగిన 38వ రోజున, ముస్లిం పార్టీల తరపున వాదించిన సీనియర్ కౌన్సిల్ రాజీవ్ ధావన్ అయిదుగురు జడ్జీలతో కూడిన ధర్మాసనం ముందు ఇదే విషయాన్ని చెప్పారు. ''న్యాయమూర్తులుగారూ.. మీరు ముస్లిం పక్షాలను తప్పితే ఎదుటి పక్షంపై ప్రశ్నలు సంధించలేదు. అన్ని ప్రశ్నలూ మాకే వేస్తున్నారు. మేం



వాటికి జవాబు చెప్పామనుకోండి''. అయితే ధావన్ వ్యాఖ్యలను రామ్ లల్లా పక్షాన వాదిస్తున్న కౌన్సిల్ వ్యతిరేకించడమే కాకుండా ఇది పూర్తిగా అసంబద్ధమైన వ్యాఖ్య అంటూ పేర్కొంది.

అయితే ధావన్ వ్యాఖ్యలు ముఖ్యమైనవి. ఎందుకంటే ఆయా ప్రభుత్వాల మద్దతు తోడుగా భారతదేశ వ్యాప్తంగా కనీవినీ ఎరుగని స్థాయిలో వ్యతిరేకతను చవిచూస్తున్న ముస్లింలలో పేరుకుపోయిన భయం, వివక్షతను ఆయన వ్యాఖ్యలు ప్రతిబింబించాయి. జాతీయ పౌరసత్వ నమోదు కానివ్వండి, ట్రిపుల్ తలాక్ చట్టం కానివ్వండి లేక ఉత్తర భారతదేశంలో ఆవులను తరలిస్తున్నారని, చంపుతున్నారని అనుమానం వచ్చినంతమాత్రానే జనం వారిని చితకబాది చంపుతున్న వరుస ఘటనలు కానివ్వండి, లేక తమపై ఉగ్రవాద ముద్ర వేయబడిన స్థితిలో మీరు జాతి వ్యతిరేకులు అంటూ మూక ఆరోపిస్తూ కొడుతున్నప్పుడు భారతీయ ముస్లింలు తమ కళ్లను దించుకుని, స్వరం తగ్గించి, తల దించుకుని ఒక అపరాధ భావనతో జీవించాల్సి వస్తోంది.

1990లలో రామ్ మందిర నిర్మాణ ఉద్యమం తారాస్థాయికి చేరిన సమయంలో, మత వెర్రితో ఊగిపోతున్న వారికి అయోధ్యను హిందూ వాటికన్‌గా మార్చాలనే స్వప్నం బలంగా ఉండేది. 1992 డిసెంబర్ 6న కరసేవకులు బాబ్రీమసీదును కూలగొడుతున్నప్పుడు వారి నాయకులు అయోధ్యలో ముస్లింలు, వారి ఇస్లామిక్ చరిత్ర ఆనవాళ్లు లేకుండా చెరిపివేయాలని మూకలను రెచ్చగొడుతూ కనిపించారు. ఫలితం.. డజనుకుపైగా ముస్లింలు దారుణ హత్యకు గురయ్యారు. వారి దేహాలను తగులబెట్టేశారు. ముస్లిం మసీదులు, మజార్లను ధ్వంసం చేశారు. ఈ హత్యాకాండకు పాల్పడిన వారి ఉద్దేశం ఒకటే. ముస్లింలకు, హిందువులకు మాత్రమే కాకుండా జైనులు, సిక్కులు, బౌద్ధులకు కూడా పవిత్ర స్థలంగా ఉంటున్న అయోధ్య పట్టణంలో ఒక్క ముస్లిం కుటుంబం కూడా కనిపించకూడదంతే.

బాబ్రీమసీదు కూల్చివేత తర్వాత దాదాపు మూడు దశాబ్దాల పాటు ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీల నేతృత్వంలో బీజేపీయేతర ప్రభుత్వం రాజ్యమేలింది. ఈ రెండు పార్టీలూ లౌకికవాదానికి చాంపియన్లు కావడంతో అయోధ్యను హిందూ వాటికన్ సిటీగా మార్చాలనే హిందుత్వవాదుల స్వప్నం సాకారం కాలేదు.

కొంతవరకు ఇరు మతాలూ వేరు చేయబడిన వాతావరణంలో అయోధ్యలో ప్రస్తుతం ముస్లింలు, హిందువులు కలిసి పనిచేసే వాతావరణం ఎక్కడా కనిపించడం లేదు. యాత్రికుల మార్కెట్లో గానీ, మొబైల్స్, ఇతర గాడ్జెట్లు అమ్మే స్టోర్లలో కానీ ఇరు మతాలకు చెందిన వారు కలిసి పనిచేస్తున్నట్లు కనబడదు. కానీ వాస్తవానికి అయోధ్యలోని సామాన్యులు భారత్‌లో పరమ నిర్లక్ష్యానికి గురవుతున్నా.. అంతగా అభివృద్ధి చెందని లోతట్టు ప్రాంతాల్లో భాగమైన అయోధ్యలో కొన్ని విషయాల్లో కలిసే జీవిస్తున్నారు. మురికికాలువలు, ఎగుడుదిగుడు గుంతల రోడ్లు, నాసిరకం విద్యా సౌకర్యాలు, ఉద్యోగాల కొరత, జీవితాన్ని ముందుకు తీసుకెళ్లగలిగే అవకాశాల లేమి వంటి సాధారణ అంశాల్లో ఇరు మతాల ప్రజలదీ ఒకే తీరుగా ఉంటోంది. ఇక యువత విషయానికి వస్తే అన్ని చిన్న పట్టణాలకు మల్లే అయోధ్యనుంచి పరారై ఏ ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి మహా నగరాలకు తరలి వెళ్లడానికే చూస్తున్నారు.

హిందువైనా, ముస్లిమైనా అయోధ్యలోని సగటు వ్యక్తి వ్యవస్థ పట్ల తీవ్రాతితీవ్రమైన నిస్పృహను కలిగి ఉంటున్నాడు. రాజకీయ నాయకుల పట్ల, కండబలంతో పట్టణంలో దాష్టీకం చలాయిస్తున్న నకిలీ సాధువుల పట్ల సగటు మనిషిలో వ్యతిరేకత పెరుగుతోంది. సాధువుల ముసుగులో నేరస్తుల ఉపద్రవం కూడా నిరాకరించలేని వాస్తవంగా ఉంటోంది. ఈ దైవసమానులు వారి అనుయాయులూ లైంగికదాడికి ఇతర హింసాత్మక నేరచర్యలకు పాల్పడకుండా ప్రశాంతంగా గడిచిన నెలను అయోధ్య చూడటంలేదు. దశాబ్దాలుగా ఆధ్యాత్మిక గురువులు, సన్యాసుల రూపంలో నేరగాళ్లు రాజ్యమేలుతున్న అయోధ్యలో పవిత్రత అనేది నశించిపోతోంది. కానీ రామమందిర ఉద్యమం, దానిచుట్టూ నడుస్తున్న రాజకీయాలు ఏవీ అయోధ్యలో వారసత్వంగా వస్తున్న ధర్మపరాయణత్వం, భక్తి, శాంతిని ధ్వంసం చేయలేకపోయాయి. ముక్తిగాములై ఆశ్రయం పొందగోరి వచ్చిన, ఆధ్యాత్మికత తప్ప మరేమీ ఎరుగని ప్రజల నివాస ప్రాంతంనుంచి హిందూ ఓటు బ్యాంకును సృష్టించే రాజకీయ ఉద్యమానికి ప్రయోగ స్థలంగా అయోధ్య ప్రస్తుతం రూపాంతరం చెందింది.

బాబ్రీమసీదు కూల్చివేత అనంతరం మూడు దశాబ్దాల తర్వాత కూడా ఆలయ నిర్మాణం అనే ఒకేఒక్క అంశం అయోధ్యలో ప్రాబల్య స్థానంలో కొనసాగుతోంది. ఈ సుదీర్ఘ వివాదానికి న్యాయపరమైన పరిష్కారం తుది అంచుల్లో ఉంటూండగా, మసీదును కూల్చివేసిన సందర్భంగా నమోదు చేసిన కేసులను కూడా ఫాస్ట్–ట్రాక్ ప్రాతిపదికన విచారించి తీర్పు చెప్పడం అవసరం. ముస్లింలలో తమకూ న్యాయం జరిగిందనే సంతోషాన్ని కల్పించే బాధ్యత కూడా సుప్రీంకోర్టు మీదే ఉంది. అయోధ్య ఏనాడో కోల్పోయిన ధర్మనిష్ఠను పునరుద్ధరించే మార్గం ఇదొక్కటి మాత్రమే. శ్రీరాముడు ప్రతిపాదించిన, ఆచరించిన న్యాయం, శాంతికి సంబంధించిన విలువలకు నిజమైన నివాళి కూడా ఇదే మరి. ఎందుకంటే శ్రీరాముడి పేరుమీదనే కదా ఇంత చరిత్ర, ఇన్ని సంఘటనలు జరుగుతూ వచ్చాయి!

(ది వైర్‌తో ప్రత్యేక ఏర్పాటు)
వ్యాసకర్త జర్నలిస్టు, రచయిత

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### గుడ్డు



"గుడ్లు తినడానికి కొందరికి మత పరమైన అడ్డంకులు ఉంటే ఉండనివ్వండి. కానీ, ఇతరులు ఎందుకు తినకూడదు? గుడ్లు తినేవారిపై ఈ రకమైన ఆంక్షలు పెట్టడం ఏంటి? మధ్యప్రదేశ్ ప్రభుత్వం అంగన్‌వాడీలలో గుడ్లు అందజేస్తే భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయ్ వర్గీయకు అభ్యంతరమేంటి? బహుశా మీరు, మీ అబ్బాయి మానవ శరీరాలను బంతులుగా చేసుకుని క్రికెట్ ఆడాలనుకుంటున్నారు. పైగా, అందులో అతడికి మంచి ప్రావీణ్యం ఉంది"

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

### బేబీ



"నా సన్నిహిత మిత్రుడికి మూడు వారాల క్రితం బాబు పుట్టాడు. ఎయిర్ ప్యూరిఫైర్స్ వినియోగిస్తూ ఆ బాబును చాలా రోజులు ఇంట్లోనే ఉంచారు. కానీ, ఆ బాబుకి దగ్గు వచ్చింది. మీకు కూడా పిల్లలు ఉంటే, వీలైనంత వరకు ఢిల్లీ వదిలి వెళ్లిపోవడానికి ప్రయత్నించండి. ఇక్కడ నివసించడం అంత శ్రేయస్కరం కాదు"

– సిద్ధార్థ్ సింగ్, రచయిత

### నాన్ వెజ్



"ఈ రోజు ఓ విషయం ఆలస్యంగా తెలిసి, ఆశ్చర్యానికి గురి చేసింది. ఎకానమీ క్లాస్‌లో నాన్ వెజ్ అందించడాన్ని ఎయిర్ ఇండియా నిలిపివేసిందిట. ఈ ఎయిర్‌లైన్ ఎక్కి రెండేళ్లయ్యింది. ఎందుకని అడిగితే, స్టీవార్డ్ క్షమించమన్నట్టు చూశాడేగాని సమాధానం చెప్పలేదు. ఇది ఆహార ఉగ్రవాదం, ఆహార వివక్ష కూడా"

– కె.మాల్మరుగన్, కార్పొరేషన్ మాజీ ఉద్యోగి

### ఆపండి



"మా పండుగ వేడుకలను అపహాస్యం చేస్తూ మమ్మల్ని అపరాధ భావంలోకి నెట్టే ప్రయత్నాలను ఆపండి. మీరు పెద్దపెద్ద హోటళ్లకు వెళ్లి ఖరీదైన ఆహారం తింటున్నప్పుడు ఆకలితో అల్లాడుతున్న పిల్లల గురించి ఆలోచించారా? ఖరీదైన కారులో మీరు వెళ్తున్నప్పుడు తమ పాదాలను కాపాడుకోవడానికి కనీసం చెప్పులు కూడా లేని వారి గురించి ఆలోచించారా?"

– మధుపూర్ణిమ కిష్వర్, ప్రొఫెసర్

### పాట



"డిసెంబర్ 1993లో నిస్సహాయులైన కశ్మీరీ పండిట్లంతా తమ మాతృ భూమిని వదిలి ఢిల్లీలోని సిరి ఫోర్ట్‌కు చేరుకున్నారు. 'మేం విషం తీసుకోనిదెప్పుడు, అయినా ఇంకా బతికే ఉన్నాం. జీవితమంతా కన్నీళ్లే అయినా, మేమంతా చిరునవ్వులు చిందిస్తున్నాం' అంటూ ఓ పాప కశ్మీరీ భాషలో దుఃఖగీతం ఆలపించింది. ఆ గాయాలు ఈనాటికీ మానలేదు"

– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

### ఏమో

"ఎవరికి తెలుసు? తరువాత జరుగబోయే పార్లమెంట్ సమావేశాలకు యూరోపియన్ పార్లమెంట్ సభ్యులను ఆహ్వానించి ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడమని కోరుతారేమో"



– పి.చిదంబరం, కాంగ్రెస్ నేత

ఇన్‌బాక్స్

## మరో పటేల్ రావాలి

స్వాతంత్ర్య భారతానికి గాంధీ, నెహ్రూ రెండు కళ్లయితే సర్దార్ వల్లభాయ్ పటేల్ గుండె లాంటి వారు. గాంధీలోని ముందుచూపు, నెహ్రూలోని దూరదృష్టి రెంటిని తనలో ఇముడ్చుకున్న మహానుభావుడు పటేల్. సూటిగా, నిజాయితీగా, నిర్భయంగా, నిర్మొహమాటంగా, ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టడం ఆయన నైజం. స్వాతంత్ర్య పోరాటంలోనూ, స్వాతంత్ర్యానంతర నవ భారత నిర్మాణంలోనూ తనదైన పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్. ఆయన జన్మదినమైన అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినం (రాష్ట్రీయ ఏక్తా దివస్)గా ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయం.



ఇంగ్లండ్‌లో బారిష్టర్ పూర్తి చేసుకొని స్వదేశానికి తిరిగివచ్చిన పటేల్ దేశంలో జరుగుతున్న జాతీయోద్యమానికి ఆకర్షితుడై మహాత్మాగాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకున్నారు. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా మొదలైన ఉద్యమాలలో కూడా ఆయన ప్రముఖ పాత్రను పోషించారు. 1928లో బార్డోలీలో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం విధించిన పన్నులకు వ్యతిరేకంగా కిసాన్ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించి, దేశ ప్రజల దృష్టిని ఆకర్షించారు. అప్పుడే ఆయనకు 'సర్దార్' అనే పేరు వచ్చింది. 1931లో కరాచీలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించారు. స్వాతంత్ర్యానంతరం 560 స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం కావడానికి గట్టిగా కృషిచేసి సఫలుడైన పటేల్ 'ఇండియన్ బిస్మార్క్'గా ఖ్యాతిగాంచారు. ఒకవైపు పాక్... మరోవైపు చైనా భారత్ పైకి రావాలని పొంచి చూస్తున్న ప్రస్తుత తరుణంలో మన దేశానికి మరో పటేల్ రావాల్సిన అవసరం ఉంది.

(నేడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి)
డా॥ తన్నీరు కళ్యాణ్ కుమార్,
తెలుగు టీచర్, నాగార్జునసాగర్

# శరదశ్శతమ్



గొల్లపూడి మారుతీరావు

జీవన కాలమ్

కొన్ని రోజుల్లో చచ్చిపోతున్నావని డాక్టర్లు తేల్చారు. నిన్ను చూడాలని ఉందిరా అని సమాచారం పంపాడు కాశీ, దాసుకి. దాసుది సామర్లకోటలో సగ్గుబియ్యం హోల్‌సేల్ వ్యాపారం. కాలేజీలో చదువుకునే రోజుల్లోనే తండ్రి వ్యాపారం దాసు వారసత్వంగా పుచ్చుకున్నాడు.

పై చదువులు చదివి రైల్వేలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఇద్దరూ కలిసి దశాబ్దాలు గడిచింది. అందుకే ఈ సమాచారం దాసుకి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయినా కానీ పనికట్టుకుని చిన్ననాటి స్నేహితుడిని చూడటానికి బయలుదేరాడు దాసు. కాశీ 77, దాసు 75. కాశీకి ఇన్నేళ్లలో ఉన్న జుత్తు ఊడిపోయింది. దాసుకి వారసత్వంగా తల్లిదండ్రుల పొట్ట వచ్చింది.

చిన్ననాటి స్నేహితులు కలుసుకుని కావలించుకుని, గెంతులేసి పొంగిపోయారు. విచిత్రం, స్నేహితుడిని బాధిస్తానని దాసు కాశీ జబ్బు గురించి అడగలేదు. రాకరాక వచ్చిన స్నేహితుడిని ఇబ్బంది పెడతానని కాశీ చెప్పలేదు. బయటికి ఇద్దరూ ఆనందంగా, డాబుగా, అన్నిటినీ మించి తృప్తిగా ఉన్నారు.

ఆమాటా, ఈమాటా మాట్లాడుతూ చిన్నతనంలో తమ అక్కలు ఆడే 'ఆడ ఆటలు' ఆడారు. చెమ్మాచెక్కా ఆడినందుకే పగలబడి నవ్వుకున్నారు. చింతపిక్కలతో ఆడవాళ్లు ఆడే తొక్కుడుబిళ్ల ఆట ఆడారు.

వెనక వరండాలో 75 సంవత్సరాల బొజ్జ దాసు, కాశీ 77 సంవత్సరాల జబ్బు శరీరం గెంతులాట చూసి ఇంటిల్లిపాదీ ముక్కుమీద వేలేసుకున్నారు. ఆ రాత్రి డాక్టరు కాశీకి రెండు మాత్రలు తక్కువ చేశాడు.

రానురానూ మిత్రులిద్దరూ పసిపిల్లలయిపోయారు. కాశీ చిన్నతనంలో బొమ్మలు వేసేవాడు. ఒకరోజు రెండు అట్టలమీద పులి ముఖాలు వేశాడు. ఇది మిత్రులు ఇద్దరూ శ్రీరామనవమి సంబరాల్లో రోజూ ఆడే ఆట.

ఎప్పుడు? 25 సంవత్సరాల కిందట. అయినా ఇద్దరూ బొమ్మలు పెట్టుకుని పులిగెంతులు గెంతారు. ఇదే ఆట. ఇంటిల్లిపాదీ నిర్ఘాంతపోయారు. ఆ రోజుల్లో దాసు బొజ్జకి డాక్టరు ఇంజక్షన్ ఇచ్చాడు.

ఇద్దరూ ఇంటర్మీడియట్ చేసే రోజుల్లో కాకినాడలో అద్దెకి ఉండేవారు. ఇద్దరూ భయంకరమైన గొంతు కలవారు. 'పాతాళభైరవి' చూసి వచ్చి– పాటల పుస్తకం కొని పాటలన్నీ భయంకరంగా పాడారు. ఇంటివారు మొత్తుకుంటే మరింత విజృంభించారు.

ఇప్పుడా ఇల్లు లేదు. ఇంటాయన లేడు. 65 సంవత్సరాల కిందటిమాట. 75 సంవత్సరాల దాసు విజృంభించాడు. 77 సంవత్సరాల కాశీ అందుకున్నాడు. ఇప్పుడు తమ ఇంట్లో కాదనే వారెవరు? వాళ్ల గొంతుల్ని, అల్లరిని బాలక్రిష్టత్వాన్ని భరించారు. భరిస్తున్నారని తెలిసి ఇద్దరు మిత్రులూ రెచ్చిపోయారు.

దాసు వెళ్తానంటే కాశీ, దాసు బొజ్జమీద దరువువేశాడు. చిన్నతనం ఆటలు, ఆ చవకబారు ఇద్దరూ గుర్తు చేసుకున్నారు. స్కూలుకి వస్తే, రైలు పట్టాలు దాటుతున్న చంటిబాబు చావు తలుచుకుని ఇద్దరూ ఏడ్చారు. అతని 'మాజిక్' విన్యాసాలు ఒక రోజంతా చెప్పుకున్నారు.

ఏతావాతా 15 రోజుల్లో ఉద్యోగి కాశీ, వ్యాపారి దాసూ మారిపోయారు. 65 సంవత్సరాలు వెనక్కిపోయారు. మనస్సుల ముసుగులు మళ్లీ అతుక్కున్నాయి. వాస్తవం అటకెక్కింది.

'ఏమిటి తాత ధోరణి' కాశీ మనుమడు డాక్టరు దగ్గర ఆశ్చర్యపడ్డాడు. డాక్టరు కంగారు పడటానికి బదులు నవ్వాడు.

'ఎప్పుడు వస్తారు' అని సామర్లకోట నించి ఫోన్ చేసిన దాసు మేనల్లుడికి– దాసు చేతుల్లో ఫోన్ లాక్కుని సమాధానం చెప్పాడు కాశీ ' మీ మామ ఇప్పుడు రాడురా' అని.

ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు.

18 రోజులు గడిచిపోయాయి. ఇద్దరు మిత్రులూ వర్తమానాన్ని మర్చిపోయారు.

జీవితాన్ని తిరగేసి మళ్లీ గడపటం ప్రారంభించారు. 25 రోజులు అయింది. దాసు లేచేసరికి కాశీ సూర్యోదయం చూస్తూ కనిపించాడు.

'ఏంట్రా ఆలోచిస్తున్నావు?' అన్నాడు దాసు.

కాశీ ధైర్యంగా ఇటుతిరిగి 'నేను చావనురా– నువ్వు సామర్లకోట పో' అన్నాడు కాశీ.

జ్ఞాపకాలు బంగారు తాకిడీలు, ఆలోచనలు ఆత్మబంధువులు.

(నన్ను మళ్లీ 'జీవనకాలమ్' రాయమని పోరి రాయించిన మా తమ్ముడు శివకి అంకితం)

# తపోధనులు

దైవికమైన, ఆత్మీయమైన ఆలోచనకే తపం అని వ్యవహారం. లౌకిక విషయాలను గూర్చి, లోక సంబంధ వ్యవ హారాల గూర్చి చేసే ఆలోచన తపం అవదు. తపమే ముఖ్య సంపదగా కలవారు తపోధనులు. వీరు అరణ్యాలలో ఆశ్రమాలను నిర్మించుకొని సాత్వికమైన వాతావరణంలో జీవనయానాన్ని కొనసాగిస్తుంటారు. లోకోత్తరమైన సత్కార్యాన్ని సాధించేందుకై ధనాన్ని కూడబెట్టిన వ్యక్తి చిల్లరపనులకు ఆ ధనాన్ని ఉపయోగించనట్లు, తపోధనులు కూడా తాము చిరకాలం దీక్షబూని జపతపాదులను ఆచరించటం ద్వారా కూడబెట్టుకున్న తపశ్శక్తిని మోక్ష లాభమనే మహోన్నతమైన ఫలితాన్ని పొందేందుకే ఉపయోగిస్తారు. అంతేకానీ, తమ శరీర రక్ష ణకో, ఆశ్రమ అవసరాలకో వినియోగించరు. తపోధనులు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను అణచివేసి ఇంద్రియాలను అధీనంలోకి తెచ్చుకొని జితేంద్రియులు అనే కీర్తిని కలిగి ఉంటారు.



జ్యోతిర్మయం

శ్రీరామచంద్రుడు అరణ్యవాసానికి వచ్చినప్పుడు ఆశ్రమవాసులైన తపోధనులైన మహర్షులందరూ కందమూల ఫలాల్ని తీసుకువచ్చి రామునికిచ్చి 'ఓ రాజా! రాక్షసుల వల్ల మాకు కలిగే ఆపదల్ని తొలగించి మమ్మల్ని రక్షించండి' అని కోరారు. వాస్తవానికి శ్రీరాముడు రాజు కాదు, భరతుడు రాజు. సర్వజనరంజకమైన తేజస్సును, ఆపదల నుండి, గాయాలనుండి కాపాడగలిగిన ఉత్తమ క్షత్రియ లక్షణాన్ని ఆయన కలిగి ఉన్నందున మహర్షులు శ్రీరాముణ్ణి 'రాజా' అని సంబోధించారు. శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని దర్శించిన అర్జునుడు– ఓ కృష్ణా! నీవే నాకు తల్లివి, తండ్రివి, బంధువు, సఖుడవు, సర్వస్వం అని పేర్కొన్నట్లు తత్వజ్ఞులైన తపోధనులు అయిన మహర్షులు శ్రీరాముని పరత్వమైన శ్రీమన్నారాయణునిగా భావించి తమ శరీర రక్షణతో పాటు శాశ్వతానందమైన మోక్షాన్ని కూడా అనుగ్రహించేందుకు తగిన శక్తి సామర్థ్యాలు కలవాడని శ్రీరాముని గూర్చి శరణాగతి చేసినారు.

మానవులు తమ శక్తియుక్తులను, కర్తవ్యాన్ని పొందవలసిన సద్గతికి సంబంధించిన ధర్మసూక్ష్మాలను తెలుసుకునేందుకు తపోధనులైన మహర్షులు మనకు విస్తృతమైన వాఙ్మయాన్ని అందించారు. వారిపట్ల కృతజ్ఞులమై ఉందాం.

– సముద్రాల శఠగోపాచార్యులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899







మళ్లీ జోడీగా...
సినిమా పేజీలో...

అంత డోస్
వద్దు బసు!
సినిమా పేజీలో...



# అమ్మ నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే

**అమ్మ ఏడుస్తుంది.
ఎవరైనా తెలిసినవారు
ఎదురుపడితే ఏడుస్తుంది.
ఎవరైనా అయినవారు
పలకరిస్తే ఏడుస్తుంది.
ఎవరైనా బాధలో ఉంటే ఏడుస్తుంది.
ఎక్కడైనా శుభకార్యం
జరుగుతున్నా ఏడుస్తుంది.
అమ్మకు ఏడుపు ఆగదు.
62 సంవత్సరాల
అమ్మ ఏడుస్తూనే ఉంది.
ఆమెకు కావలసింది ఏమిటి?
ఆదరించే ఒక గుండె.
వినే శ్రద్ధ ఉన్న రెండు చెవులు.**

అప్పటికి ఇద్దరు కంటి డాక్టర్లు పరీక్షించి కంటిలో లోపం ఏమీ లేదని చెప్పారు. కన్నీళ్ల కారడం కంటి జబ్బు వల్ల కాదన్నారు. అవి లోపలి నుంచి వస్తున్నాయని, మనసు నుంచి వస్తున్నాయని, చూడబోతే ఆమె లోపల ఒక కన్నీటి సరోవరమే ఉన్నట్టుగా అనిపిస్తోందని డాక్టర్లు అన్నారు. ఇది కంటి డాక్టర్లు చూసే సమస్య కాదు. మరెవరు చూడాలి?

* * *

అమెరికాలో సంధ్యమ్మ రెండు నెలలు ఇద్దరు కొడుకుల దగ్గర ఉండొచ్చింది. అక్కడకు వెళ్లిన రోజు నుంచి ఆమె ఊరికూరికే ఏడుస్తోంది. కొడుకులను చూస్తే ఏడుపు. కోడళ్లను చూస్తే ఏడుపు. బుజ్జి మనవడు, మనవరాళ్లను చూస్తే కూడా ఏడుపు. అక్కడ వారాంతంలో తెలిసినవారు రావడమో తెలిసినవారి ఫంక్షన్లకు వెళ్లడమో చేసేవారు కోడళ్లు. తోడుగా ఈమెను తీసుకెళ్లేవారు. అక్కడకు వెళ్లగానే ఎవరితో ఒకరితో మాట్లాడుతూ ఆమె ఏడుపు మొదలెట్టేది. ఇది కోడళ్లకు ఇబ్బంది అయ్యి ఈమె వల్ల మాకు చెడ్డపేరొస్తోంది అని మెల్లగా పంపించేసేందుకు సిద్ధమయ్యారు. ఇది గమనించిన సంధ్యమ్మ అమెరికాలోనే ఉన్న పెళ్లికాని మూడోకొడుకు దగ్గరకు వెళ్లింది అతడు బాగా సంపాదిస్తున్నాడు. చిన్న వయసులోనే పెద్ద భవంతి కూడా కొన్నాడు. అక్కడకు వెళ్లి ఆమె ఏడుస్తుంటే విసుక్కోవడం మొదలెట్టాడు.

'నీకేం తక్కువని ఇక్కడ. చూడు ఎంత పెద్ద ఇల్లుందో. టీవీ చూడు. యూ ట్యూబ్‌లో భక్తి పాటలు విను. సినిమాలు చూడు. నాతో షికారుకు రా. కాని ఏడవకు. ఎందుకేడుస్తావ్ అలా? ఇంకా ఎన్నేళ్లని బతుకుతావ్ నువ్వు. ఉన్నన్ని రోజులు సంతోషంగా ఉండు' అని అతనికి తోచిన పద్ధతిలో మాట్లాడటం మొదలుపెట్టాడు. కాని ఆమెకు ఏడుపు ఆగేది కాదు. ఆగదు కూడా.

మెల్లగా ఆమె ఇండియా వచ్చేసింది.

సొంత ఇంట్లో పనిమనిషిని పెట్టుకొని ఒక్కత్తే ఉంటోంది. ఆమెకు ఇద్దరు సోదరులు. ఇద్దరూ చనిపోయారు. భర్త చనిపోయి సంవత్సరం. కొడుకులు ముగ్గురూ అమెరికాలో. ఆమెకు ప్రస్తుతం తోడు ఉన్నది కన్నీరు. కన్నీరు. కన్నీరు.

* * *

'ఏమ్మా.. ఎలా ఉన్నావ్?' అని అడిగాడు సైకియాట్రిస్ట్.

ఆ చిన్న ప్రశ్నకు, ఆ ఒక్క ప్రశ్నకు ఆమెకు ఏడుపు తన్నుకురాబోయింది.

'ఆగమ్మా. ఆగు. నా ప్రశ్నకు నువ్వు ఏడవకుండా సమాధానం చెప్పగలిగితే మనం ఈ సమస్యను సగం అధిగమించినట్టు' అన్నాడు సైకియాట్రిస్ట్.

సంధ్యమ్మ కొంచెం సంభాళించుకోవడానికి ప్రయత్నించింది.

'ఏం చెప్పను డాక్టర్... నా ప్రమేయం లేకుండానే నాకు ఏడుపు వస్తోంది' అందామె.

'ఏం పర్లేదమ్మా. నీకు ఈ సమస్య. మరొకరికి మరో సమస్య. సమస్య లేకుండా ఎవరూ ఉండరు. మనం ప్రయత్నించి, డాక్టర్ సాయం తీసుకుని, అయినవారి సాయం తీసుకుని వాటి నుంచి బయటపడాలి'

'నాకెవరూ లేరు డాక్టర్' అందామె గంభీరంగా.

'అదేంటమ్మా'

'అవును. పెళ్లయినప్పుడు ఎవరూ లేరు. పిల్లలు పుట్టాక ఎవరూ లేరు. భర్త ఉండగా ఎవరూ లేరు. భర్త లేనప్పుడూ ఎవరూ లేరు. నాకెవరూ లేరు' అందామె.

మెల్లగా ఆమె తన కథను డాక్టర్‌కు చెప్పడం మొదలుపెట్టింది.

* * *

సంధ్యమ్మది పెద్దలు కుదిర్చిన పెళ్లి. భర్త ఆర్ అండ్ బిలో ఇంజనీరు. కాని అతనిది ముక్కుసూటి వ్యవహారం. ఉద్యోగానికి సంబంధించిన కొన్ని లోపాయికరమైన వ్యవహారాలు తెలిసేవి కావు. మనసులో ఏదీ దాచుకోడు. ఎవరు తనవాళ్లో ఎవరు శత్రువులో తెలియక పై ఆఫీసర్ల గురించి ఏదో ఒక మాట అనేసేవాడు. దాంతో అతడికి ఉద్యోగంలో నిత్యం సమస్యలు ఉండేవి. ఒక్కోసారి ట్రాన్స్‌ఫర్లు, ఒక్కోసారి తనే లాంగ్‌లీవ్‌లు. బంధువులదగ్గర సంధ్యమ్మకు ఇదంతా తలకొట్టేసే పనిగా ఉండేది. పైగా ప్రతిసారీ ముగ్గురు పిల్లలను వేసుకొని ట్రాన్స్‌ఫర్ల మీద ఊర్లు తిరగాలంటే చాలా కష్టం. వాళ్ల చదువు, పెంపకం ఆమెకు కష్టంగా ఉండేది. ఏమైనా అతనికి హితవు చెప్పబోతే చాలా కర్కశంగా ఎదురు తిరిగేవాడు. అసలు ఆమె మాటే అతని దగ్గర చెల్లుబాటయ్యేది కాదు. ఒకరోజు రెండు రోజులు కాదు... అతడు మరణించేవరకు ఆమెకు అదే శిక్ష. పిల్లలు వాళ్ల లోకంలో వాళ్లు ఉండేవారు. ఆమెకు తన బాధలు ఎవరితోనైనా చెప్పుకోవాలని ఉండేది. వినడానికి ఎవరూ ఉండేవారు కాదు. చెప్పాలన్నా మళ్లీ భర్తకు తెలిస్తే ఏమవుతుందోనని ఆ భయం. అలాగే నిన్నమొన్నటి వరకూ కృశించింది. ఎంతగా అంటే భర్త మరణించాక దుఃఖం కలగడంతోపాటు కొంత రిలీఫ్‌గా కూడా అనిపించేంత. కాని ఆ తర్వాతే ఆమె సమస్య మొదలయ్యింది. దారిలో ఏ కొత్త జంట స్కూటర్ మీద వెళుతున్నా తన పెళ్లయ్యాక అలా వెళ్లలేదే అని ఏడుపు. ఎవరు సంతోషంగా కబుర్లు చెప్పుకుంటున్నా తన భర్తతో అలా చెప్పుకోలేదే అని ఏడుపు. పిల్లలు ఆడుకుంటుంటే తన పిల్లల ఆటపాటలు చూసేంత తీరిక తనకు లేకపోయాయని ఏడుపు. శుభకార్యాలకు వెళితే తాను సరిగ్గా ఏ శుభకార్యంలోనూ హాయిగా గడపలేదని గుర్తుకొచ్చి ఏడుపు. రాను రాను సంతోషానుభూతికి విషాదానుభూతికి తేడా తెలియని స్థితికి ఆమె చేరుకుంది. ఒక మనిషికి అసలైన విషాదం మాట్లాడే గొంతు లేకపోవడం కాదు. ఎదురుగా వినే రెండు చెవులు లేకపోవడం అని ఆమెను చూస్తే సైకియాట్రిస్ట్‌కు అనిపించింది. ఇదే బాధ కొంచెం అటు ఇటుగా ఇవాళ చాలామంది స్త్రీలు అనుభవిస్తున్నారని అనిపించింది.

* * *

'చూడమ్మా. నీ కష్టం అర్థమైంది. నీ కష్టానికి మందు ఏమిటంటే నువ్వు చెప్పడం నేను వినడం. ఎంత చెప్పుకుంటావో చెప్పు. రోజూ వచ్చి నువ్వు పడ్డ కష్టాలన్నీ చెప్పు' అని అన్నాడు సైకియాట్రిస్ట్.

ఆమె నాలుగు వారాల పాటు అప్పుడప్పుడు వచ్చి డాక్టర్‌తో ఒక గంట కూచుని మాట్లాడి వెళ్లేది. తనలో బాగా గుచ్చుకుపోయిన అనుభవాలు చెబుతూ చెబుతూ వాటి ఉచ్చు నుంచి మెల్లగా బయటపడటం మొదలుపెట్టింది. ఇక ఆమెకు కావలసింది రోజూ మాట్లాడే మనుషులు. వినే మనుషులు.

'చూడమ్మా. నీ పిల్లల గురించి నేనేం చెప్పలేను. కాని నీలాంటి స్థితిలో ఉన్న మనుషులు ఉన్న ఓల్డ్ ఏజ్ హోమ్‌లు ఉన్నాయి. వారితో గడపడం నీకు కొంత లాభించవచ్చు. లేదా నీ కాలనీలో నీ వంటి మనుషులతో స్నేహం చేసి రోజూ మీరంతా ఒకచోట కలుస్తుంటే మరింత లాభం చేకూర్చవచ్చు. అసలు నీ మాటలు అందరూ ఎందుకు వినాలి.. అందరి మాటలు నువ్వు విని నీ అనుభవంతో సలహాలు ఇవ్వొచ్చు కదా అనుకుంటే నువ్వే అందరికీ ఆప్తురాలివైపోతావ్. అందరూ నీ కోసం ఎదురు చూసే దానివిలా మారిపోతావ్. నువ్వు రోగిగా కాదు ఉండాల్సింది. డాక్టర్‌గా. నీ కోసం నువ్వు బతికే నలుగురి కోసం బతికే డాక్టర్‌గా' అన్నాడతను.

ఆ సలహా పని చేసింది. సంధ్యమ్మ ఇప్పుడు కొంచెం బిజీగా ఉంటోంది. ఎదుటివారి మాటలు వింటోంది. నవ్వే విషయాలకు నిజంగా నవ్వుతోంది. నిజంగా ఏడ్వాల్సిన విషయాలకు కూడా దిటవు ప్రదర్శిస్తోంది. సంధ్యమ్మ గతం నుంచి వర్తమానం నుంచి కూడా విముక్తం అయ్యి జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకోగలిగింది.

– కథనం: **సాక్షి ఫీచర్స్ డెస్క్**
ఇన్‌పుట్స్: **డాక్టర్ కల్యాణ చక్రవర్తి**, సైకియాట్రిస్ట్

మొబిలిటీ



ఢిల్లీ సిటీబస్‌లలో మహిళల ఉచిత ప్రయాణానికి కండక్టర్‌లు ఇస్తున్న పింక్ టికెట్

# పింక్ టికెట్

**ఆర్థిక స్వేచ్ఛ మహిళను కదిలేలా చేస్తే, కదలిక ఆమెను సాధికారత వైపు నడిపిస్తుంది అనడానికి ఢిల్లీ ప్రభుత్వం మహిళలకు తాజాగా కల్పించిన ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం ఒక నిదర్శనం.**

'స్త్రీ సాధికారత' అనే మాట అర్థమైనట్లే ఉంటుంది కానీ, అర్థమేంటని అడిగితే మాత్రం సరిగ్గా అర్థమయ్యేలా చెప్పలేం. దేన్నైనా సాధించుకునే అధికారం సాధికారత. అడిగే హక్కు, ప్రశ్నించే హక్కు, సొంతకాళ్లపై నిలబడే హక్కు, నలుగుర్ని పోషించే హక్కు... ఇవన్నీ కలిస్తే సాధికారత. స్త్రీ సాధికారత అంటే స్త్రీకి ఈ హక్కులన్నీ ఉండటం. స్త్రీ సాధికారతకు విద్య ఉండాలి. ఉద్యోగం లేదా ఉపాధి ఉండాలి. ఇవి సాధించడానికి 'మొబిలిటీ' ఉండాలి. మొబిలిటీ అంటే కదిలే వెసులుబాటు. ఇంటి నుంచి బయటికి స్వేచ్ఛగా, ఆర్థిక ఇబ్బందులు లేకుండా వెళ్లొచ్చే సదుపాయం ఉన్నట్లయితే.. అన్ని అర్హతలుండీ కేవలం కదిలే అవకాశాల్లేక గృహిణులుగా మాత్రమే ఉండిపోయిన ఎందరో మహిళలకు 'మొబిలిటీ' వస్తుంది. ప్రయాణ ఖర్చులను భరించలేక, ప్రయాణంలో భద్రత లేక ఇంటి చుట్టుపక్కల ఉండే స్కూళ్లు, కాలేజీలతో సరిపెట్టుకునే అవసరం ఉండదు. మంచి స్కూల్లో సీటొస్తే వెళ్లి చేరిపోతారు. మంచి ఆఫీస్‌లో ఆఫర్ వస్తే చాలీచాలని జీతంతో పాత ఉద్యోగాన్నే పట్టుకుని వేళ్లాడే పని ఉండదు. మొబిలిటీలో సాధికారత వచ్చేస్తుంది. లేదా సాధికారతకు దారి పడుతుంది.

మంగళవారం నుంచి ఢిల్లీ సిటీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఉచిత ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు, వారి భద్రత కోసం అన్ని బస్సులలో కలిపి సుమారు 13 వేల మంది మార్షల్స్‌ను నియమించారు! ఈ సంఖ్య గతంలో 3,400 మాత్రమే ఉండేది. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డీటీసీ) ప్రస్తుతం 3,700 బస్సులను నడుపుతోంది. ప్రైవేటుగా మరో 1800 బస్సులను (క్లస్టర్ బస్సులు) నడుపుతోంది. వీటన్నిటిలోనూ మహిళలకు ఉచిత ప్రయాణమే. సిటీ బస్సెక్కగానే కండక్టరే వచ్చి టికెట్ ఇస్తాడు. డబ్బులు తీసుకోడు. మహిళలకు మాత్రమే ఇచ్చే ఆ టికెట్ లేత గులాబీ రంగులో ఉంటుంది. మహిళలకు ఈ సదుపాయాన్ని కల్పించడానికి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అక్టోబర్ 29న అన్నాచెల్లెళ్ల పండగైన 'భాయ్ దూజ్' (సోదరుని ఆశీస్సులు) రోజును ఎంచుకున్నారు. కేవలం సిటీ బస్సులకే కాకుండా, నోయిడా–ఎన్‌సిఆర్ (నేషనల్ రీజినల్ క్యాపిటల్) సర్వీసులు, విమానాశ్రయానికి, ఇతర ప్రత్యేక స్థలాలకు డీటీసీ నడిపే బస్సులకు కూడా ఈ ఉచితం వర్తిస్తుంది. బస్సు ఎక్కిన మహిళా ప్రయాణికులకు పది రూపాయల టిక్కెట్ ఇస్తారు. ఆ టికెట్‌తో ఆ బస్సులో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఆ బస్సు దిగి ఇంకో బస్సు ఎక్కినప్పుడు అందులోనూ పది రూపాయల టిక్కెట్ ఇస్తారు. అలా మహిళలు ఢిల్లీ అంతా ప్రయాణించవచ్చు.



సాధికాతకు నాంది:
తొలిరోజు మహిళా ప్రయాణికులు

ఇంటిప్స్

## తరగక ముందే కడగాలి



- ఆకు కూరలను ఉప్పునీటితో కడిగితే త్వరగా శుభ్రపడుతాయి. మామూలు నీటితో నాలుగు సార్లు కడగడం కంటే ఉప్పు నీటితో రెండుసార్లు కడిగితే చాలు.
- ఆకుకూరలు, కూరగాయలను కడిగిన తర్వాత మాత్రమే తరగాలి. తరిగిన తర్వాత కడిగితే వాటిలో ఉండే పోషకాలు నీటిలో కలిసిపోతాయి.
- జిడ్డు పట్టిన ఇనుప పెనాలను శుభ్రం చేయడం కష్టం. పెనం మీద ఉప్పు చల్లి, పేపర్‌తో తుడిచి ఆ తర్వాత సబ్బునీటితో శుభ్రం చేయాలి.
- కప్పుల్లో చివరగా మిగిల్చే కొద్దిపాటి కాఫీ, టీల వల్ల కప్పు అడుగున మరకలు పడుతుంటుంది. అలా పట్టేసిన మరకలు పోవాలంటే పొడి కప్పులో ఉప్పు చల్లి రుద్దాలి.
- రిఫ్రిజిరేటర్ లోపల శుభ్ర పరచడానికి ఉప్పు, సోడా బైకార్బనేట్ కలిపిన నీటిని వాడాలి. సోడా బైకార్బనేట్ రిఫ్రిజిరేటర్‌లో దుర్వాసనను కూడా పోగొడుతుంది. చిన్న కప్పులో (వంటసోడా) వేసి ఫ్రిజ్‌లో ఒక మూల పెడితే కొద్దిగంటల్లోనే దుర్వాసన పోతుంది.
- రాగి పాత్రల మీద మరకలు పోవాలంటే మరకల మీద ఉప్పు చల్లి వెనిగర్‌లో ముంచిన క్లాత్‌తో తుడవాలి.
- ద్రాక్షపండ్ల మీద చల్లిన రసాయనాలు వదలాలంటే ఉప్పు కలిపిన నీటిలో కనీసం గంటసేపు ఉంచి కడగాలి.

బ్యూటిప్స్

### చుండ్రు నివారణకు అల్లం

చిన్న అల్లం ముక్క తీసుకొని సన్నగా తరగాలి. ఈ ముక్కలను నువ్వుల నూనెలో వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత మాడుకు, కుదుళ్లకు నూనె పట్టించి మర్దనా చేయాలి. గంట తర్వాత తలస్నానం చేయాలి. వారానికి ఒకసారి ఈ విధంగా చేస్తూ ఉంటే చుండ్రు సమస్య తగ్గుతుంది.



### కళ్లకింద వలయాలకు

కళ్ల కింద చర్మం ఉబ్బినట్టుగా కనిపిస్తుంటే చల్లటి నీళ్లతో లేదంటే ఒక ఐస్‌క్యూబ్‌తో మృదువుగా మర్దన చేయాలి. నిస్తేజంగా ఉన్న కళ్లకు జీవకళ వచ్చేస్తుంది. రోజుకు ఒకసారైనా ఇలా చేస్తుంటే కళ్లకింద వలయాలు కూడా తగ్గుముఖం పడతాయి.



### ముఖంపైన మచ్చలకు

ముఖంపైన మొటిమల వల్ల అయిన మచ్చలు పోవాలంటే కలబంద జెల్ మహత్తరంగా పనిచేస్తుంది. మచ్చలు ఏర్పడిన చోట కలబంద జెల్‌ను రాసి, పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే ముఖంపైన మచ్చలు తగ్గుతాయి. చర్మకాంతి పెరుగుతుంది.



### స్నానానికి ముందు

ఉదయం స్నానం చేయడానికి అరగంట ముందు కొబ్బరి నూనె లేదా నువ్వుల నూనె మేనికి రాసుకోవాలి. మృదువుగా మర్దనా చేయాలి. తర్వాత మరీ వేడిగా అలాగని చల్లగా కాకుండా గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి. స్నానానికి లిక్విడ్ సోప్స్ ఎంచుకోవడం లేదంటే సున్నిపిండిని వాడటం వల్ల చర్మం మృదుత్వాన్ని కోల్పోదు.



చెట్టు నీడ

## నమ్మకమే ఆశీర్వాదం

ఆయన ఒక సంపన్నుడు. ఒకసారి ఆయన విదేశాలకు వెళ్లవలసి వచ్చింది. అలా వెళ్లేటప్పుడు తన ఆస్తిని, ఇంటిని తన ముగ్గురు సేవకులకు అప్పగిస్తూ ఒక్కొక్కరి సామర్థ్యాన్ని బట్టి మొదటి సేవకునికి ఐదు లక్షల వరహాలు, రెండవ వానికి రెండులక్షల వరహాలు, మూడవ వ్యక్తికి లక్షరూపాయలు ఇచ్చి విదేశాలకు వెళ్లాడు. కొంతకాలం అయిన తర్వాత స్వదేశానికి తిరిగి వచ్చాడు.

మొదటి సేవకుడు యజమానికి వద్దకు వచ్చి, ''అయ్యా! మీరిచ్చిన ఐదు లక్షలతో వ్యాపారం చేసి మరొక ఐదు లక్షలు సంపాదించా''నని చెప్పాడు.

రెండవ వాడు రెండులక్షలకు మరో రెండు లక్షలు సంపాదించానంటాడు.

అప్పుడా యజమాని ''భళా! మీరు నమ్మకమైన మంచి సేవకులు. ఇచ్చిన దానిలో విశ్వాసంగా, నమ్మకంగా ఉన్నారు కాబట్టి మరికొన్ని ఆస్తులు కూడా మీకు అప్పగిస్తాను అని చెప్పాడు అభినందన పూర్వకంగా.

మూడవ సేవకుడు యజమాని వద్దకు వచ్చి ''స్వామీ! మీరు విత్తనం విత్తకనే పంట కోయువారు, కఠినాత్ములు కాబట్టి నేను లక్ష వరహాలు భూమిలో భద్రపరిచాను''



అన్నాడు.

అప్పుడు యజమాని సేవకునితో – ''సోమరివైన చెడ్డ దాసుడా! నేను ఇలాంటి గుణం కలవాడినని నీవెరుగుదువా? అట్లయితే నా సొమ్ము సాహుకారుల వద్ద ఉంచవలసినది. నేను వడ్డీతో సహా తీసుకొనేవాడిని కదా! '' అని చెప్పి ఆ లక్ష వరహాలను తీసుకొని మొదటి సేవకునికి ఇచ్చివేశాడు.

కొంచెంలోనే నమ్మకం కలవారు మరి ఎక్కువగా ఆశీర్వదించబడతాడు. నమ్మకం లేని వారికి ఉన్నవి కూడా తీసి వేయబడతాయి.

**– బి.బి. చంద్రపాల్ కోట**

ఇంటర్వ్యూ

# గొంతు తగ్గించాల్సిన విషయం కాదు

**కొన్ని విషయాలను మనమింకా గొంతు తగ్గించే మాట్లాడుతున్నాం. అయితే రుతుక్రమం విషయంలో స్వేచ్ఛగా బయటికి మాట్లాడితేనే సమాజంలో పేరుకు పోయిన నిషిద్ధ భావనను తొలగించగలం.. అని యు.కె.కి చెందిన చార్లెట్ అంటున్నారు.**

''గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ కూతుళ్లను చదివిస్తున్నారు, ఉద్యోగాలకు పంపిస్తున్నారు. అయినప్పటికీ వాళ్లు చాలా సందర్భాల్లో మగపిల్లలతో పోటీ పడాల్సిన పరుగులో ఒకింత వెనకడుగు వేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా ఇండియాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అమ్మాయిల విషయంలో ఇలా జరుగుతోంది. మెన్‌స్ట్రువల్ పీరియడ్స్ వల్ల క్లాసులు మిస్ అవడం ఇందుకు ప్రధాన కారణం. ఒక ఇంజనీర్, ఒక డాక్టర్, ఒక ఎంట్రప్రెన్యూర్, ఒక ఆస్ట్రోనాట్... ఇలా ఎన్నో రంగాల్లో మహిళలకు అవకాశాలున్నాయి. వీటన్నింటిలోనూ అబ్బాయిలు ఉన్నంత సంఖ్యలో అమ్మాయిలు లేరు. పీరియడ్స్ అంటే సమాజంలో కరడు గట్టిపోయి ఉన్న ఒక కళంకిత భావనను తొలగించగలితే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అందుకోసమే యూకే నుంచి ఇండియాకి వచ్చాను'' అన్నారు చార్లెట్ లియోన్‌హార్డ్‌సెన్.

మాంచెస్టర్‌లోని 'ద బ్యూరో కమ్యూనిటీ వెల్ బీయింగ్' సంస్థలో హెల్త్ అండ్ వెల్ బీయింగ్ మేనేజర్‌గా ఉన్న చార్లెట్ బుధవారం ఇండియా వచ్చారు. మెదక్ జిల్లా, ఇస్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించడానికి వెళ్తూ హైదరాబాద్‌లో సాక్షితో మాట్లాడారు.

''కొన్ని మతపరమైన నిబంధనలు భారతీయ మహిళకు కనిపించని సంకెళ్లుగా మారుతున్నాయి. రుతుక్రమం అపరిశుభ్రం అనే భావనను వదిలించుకున్నప్పుడే సమాజం సమానత్వం దిశగా నడుస్తుంది. మరొక ప్రాణికి జన్మనివ్వాల్సిన ప్రకృతి సహజమైన ఏర్పాటును మలినం అని ఎలాగంటారు? ఈ విషయంలో మహిళలకు అవగాహన కల్పించడం అన్నది మనకు బయటకు కనిపిస్తున్న అంశం. నిజానికి మగవాళ్లను సెన్సిటైజ్ చేయడం అవసరం. మహిళల్లో ఈ కళంకిత భావనను తొలగించాలంటే వీలయినంత ఎక్కువగా దీని గురించి మాట్లాడడం ఒక్కటే మార్గం'' అన్నారు చార్లెట్. ''లండన్‌లో కొన్ని మారుమూల ప్రాంతాల్లో కూడా ఇలాంటి భావన ఉంది. కానీ అక్కడ స్కూళ్లలో ఆడపిల్లలకు, మగపిల్లలకు కూడా పదేళ్ల వయసు నుంచే స్త్రీ–పురుష దేహాల మధ్య ఉండే తేడాలను వివరిస్తారు. అది అక్కడ పాఠ్యాంశాలలో భాగం. అలా పెరిగిన పిల్లలకు మెన్‌స్ట్రువల్ సైకిల్ అనేది గొంతు తగ్గించి మాట్లాడాల్సిన విషయంగా అనిపించదు. ఓపెన్‌గా మాట్లాడగలిగినప్పుడు ఇక సిగ్గుతో ముడుచుకోవాల్సిన అవసరమే ఉండదు కదా? బజారు నుంచి వచ్చేటప్పుడు స్టోర్ నుంచి తన కోసం శానిటరీ పాడ్స్ తీసుకురమ్మని అక్కడ ఒక మహిళ భర్తను అడగగలుగుతుంది. ఇండియాలో చదువుకున్న మహిళ కూడా భర్త ఎదురుగా స్టోర్ నుంచి శానిటరీ నాప్‌కిన్స్ పాకెట్ తీసుకోవడానికి బిడియ పడుతుంటుంది. ఇండియాలో ఉన్నంత తీవ్రంగా కాకపోయినప్పటికీ ప్రపంచంలో మరి కొన్ని చోట్ల ఇలాంటి భావన ఇంకా ఉంది. దాని నుంచి మహిళకు విముక్తి కలిగించాలి. అందుకోసం ప్రపంచ దేశాల్లోని స్కూళ్లు, కాలేజ్‌లు, యూనివర్సిటీలను సందర్శించడమే పనిగా పెట్టుకున్నాను. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు రీ యూజబుల్ నాప్‌కిన్స్‌ని పరిచయం చేయడం కూడా నా పర్యటనలో ముఖ్యమైన భాగం. ఇస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలను ఇండియాలోని 'రోజ్' అనే స్వచ్ఛంద సంస్థ దత్తత తీసుకుంది. అమ్మాయిల కోసం స్కూల్లో ఆ సంస్థ ప్యాడ్స్ వెండింగ్ మెషీన్ ఏర్పాటు చేసిన విషయం మాకు తెలిసింది. అక్కడి అమ్మాయిలకు టైలరింగ్ కూడా నేర్పిస్తున్నారు. వారికి రీ యూజబుల్ నాప్‌కిన్స్ తయారీలో శిక్షణ ఇవ్వడానికి వెళ్తున్నాను. తప్పని సరిగా పర్యావరణ హితమైన జీవనశైలితోపాటు, వ్యక్తిగత ఆరోగ్యకరమైన జీవనశైలిని పరిచయం చేయడమే నా ఈ పర్యటన ఉద్దేశం'' అన్నారు చార్లెట్.



ఇస్నాపూర్ విద్యార్థినులకు ల్యాప్‌టాప్, రీయూజబుల్ ప్యాడ్స్ ప్రదానం చేస్తున్న చార్లెట్, సహాయకుడు రసెల్



చార్లెట్

**– వాకా మంజులారెడ్డి**

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ గురువారం 31-10-2019

# థ్రిల్లింగ్ రెడ్


● 'స్రవంతి' రవికిశోర్, కిశోర్ తిరుమల, చార్మి, రామ్, పూరి జగన్నాథ్

రామ్ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'రెడ్'. శ్రీ స్రవంతి మూవీస్ పతాకంపై కృష్ణ పోతినేని సమర్పణలో 'స్రవంతి' రవికిశోర్ నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత కిరణ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా రవికిశోర్ మాట్లాడుతూ– ''రామ్‌కు 'ఇస్మార్ట్ శంకర్' వంటి సూపర్‌హిట్ అందించిన పూరి జగన్నాథ్‌గారికి థ్యాంక్స్. మా బ్యానర్‌లో రామ్ ఇప్పటివరకు చాలామంచి సినిమాలు చేశారు. 'రెడ్' కూడా మరో మంచి చిత్రంగా నిలిచిపోతుందని భావిస్తున్నాను. నవంబర్ 16 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది ఏప్రిల్ 9న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం. ఓ సినిమా సోల్‌ను తీసుకుని, అందులో మార్పులు చేసి 'రెడ్' సినిమాను తెరకెక్కిస్తాం'' అన్నారు. ''కెరీర్‌లో తొలిసారి థ్రిల్లర్ జానర్‌లో సినిమా చేస్తున్నందుకు సంతోషంగా ఉంది'' అని రామ్ అన్నారు. ''రామ్‌తో మూడోసారి సినిమా చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. థ్రిల్లర్‌కు వాణిజ్య పరమైన అంశాలు జోడించి కథ, కథనాలు ప్రేక్షకులకు కొత్తగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మణిశర్మగారు మా సినిమాకు సంగీతం అందిస్తున్నందుకు చాలా సంతోషం'' అన్నారు కిశోర్ తిరుమల. నిర్మాతలు బీవీఎస్ఎన్ ప్రసాద్, అనిల్ సుంకర, రామ్ ఆచంట, కృష్ణ పోతినేని పాల్గొన్నారు.

# మళ్లీ జోడీగా...


● శ్రుతీహాసన్

'డాన్ శీను' (2010), 'బలుపు' (2013) చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని మరోసారి చేతులు కలిపారు. ఇదే సినిమాతో మళ్లీ రవితేజ–శ్రుతీహాసన్ జోడీ కుదిరింది. ఈ ఇద్దరూ 'బలుపు' చిత్రంలో జంటగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. అలాగే రెండేళ్ల తర్వాత శ్రుతీ అంగీకరించిన తెలుగు చిత్రం ఇదే. 'కాటమరాయుడు' (2017) సినిమా తర్వాత ఆమె తెలుగులో కనిపించలేదు. ఇక తాజా చిత్రం విషయానికి వస్తే.. ఈ చిత్రాన్ని బి. మధు నిర్మిస్తారు. వచ్చే నెలలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరుగుతుంది.


● రవితేజ


● దేవిశ్రీ ప్రసాద్, రవిశంకర్, నవీన, సుకుమార్, అల్లు అర్జున్, అల్లు అరవింద్, చెర్రీ

# మ్యాజిక్ రిపీట్

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా ప్రారంభోత్సవం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ చిత్రంలో రష్మికా మండన్నా కథానాయికగా నటించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారు. ముత్తంశెట్టి మీడియా ఈ సినిమాకు సహ – నిర్మాతగా వ్యవహరిస్తోంది. ''ఆర్య (2004), ఆర్య 2 (2010) సినిమాల తర్వాత నా డార్లింగ్ సుక్కు (సుకుమార్)తో మూడో సినిమా చేయబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మళ్లీ ఆ మ్యాజిక్ రిపీట్ అవుతుందని ఆశిస్తున్నాను. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాన్నగారికి (అల్లు అరవింద్), దర్శకులు కొరటాల శివ, సురేందర్ రెడ్డిగార్లతో పాటు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఇతర అతిథులకు ధన్యవాదాలు. మైత్రీ మూవీస్, ముత్తంశెట్టి మీడియాలకు థ్యాంక్స్. సంగీత దర్శకుడు దేవీతో నాది ఎప్పుడూ స్పెషల్ కాంబినేషనే'' అన్నారు అల్లు అర్జున్. ఈ సినిమాకు కెమెరా: మిరస్లోవ్ కుబ బ్రోజెక్, లైన్ ప్రొడ్యూసర్: బాలసుబ్రహ్మణ్యం కె.వి.వి.

# అప్పుడు ఆవారా కార్తీ.. ఇప్పుడు ఖైదీ కార్తీ

''ఖైదీ' సినిమాని ఘనవిజయం చేసిన ప్రేక్షకులకు పెద్ద థ్యాంక్స్. ఇంతకు ముందు నన్ను 'ఆవారా' కార్తీ అనేవారు.. ఇప్పుడు నేనెక్కడికి వెళ్లినా 'ఖైదీ' కార్తీ అని పిలుస్తుంటే థ్రిల్లింగ్‌గా ఉంది'' అన్నారు కార్తీ. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో కార్తీ కథానాయకుడిగా ఎస్.ఆర్. ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్. ప్రభు, తిరుప్పూర్ వివేక్ నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ 'ఖైదీ'. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రీసత్యసాయి ఆర్ట్స్ అధినేత కేకే రాధామోహన్ ఈ నెల 25న విడుదల చేశారు. బుధవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో కార్తీ మాట్లాడుతూ– ''ఆంధ్ర, తమిళనాడు, కేరళలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా మా సినిమాకు మంచి స్పందన వస్తోంది. 'ఖైదీ'లో ఢిల్లీ (కార్తీ పాత్ర పేరు)లాంటి పాత్ర నాకు దొరకడం చాలా సంతోషంగా ఉంది. లోకేష్ రాసిన, తీసిన విధానం అద్భుతం. నాకు ఒక బామ్మ ఫోన్ చేసి, మంచి సినిమా, గొప్ప సినిమా చేశావని ప్రశంసించారు.. అదే నిజమైన సక్సెస్. ఈ కథను నా దగ్గరకు తీసుకువచ్చిన ఎస్.ఆర్. ప్రభుకు థ్యాంక్స్. 'ఖైదీ' టైటిల్ పెడితే సినిమా హిట్ అనే సెంటిమెంట్ మరోసారి వర్కవుట్ అయ్యింది. రవితేజ గారు ఫోన్ చేసి, 'ఇటువంటి సినిమా చేయాలనుకుంటున్నాను' అని చెప్పారు. 'ఖైదీ 2' కూడా ఉంటుంది'' అన్నారు. కేకే రాధామోహన్ మాట్లాడుతూ – ''ఈ దీపావళికి 'ఖైదీ' వెలుగులు నింపింది. మా సినిమాకు అన్ని ఏరియాల నుంచి మంచి స్పందన వస్తోంది. కంటెంట్ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి ఈ సినిమా నిరూపించింది'' అన్నారు. ''ఖైదీ'కి భారీ సక్సెస్ అందించిన తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు ఎస్.ఆర్. ప్రభు.


● ఎస్.ఆర్. ప్రభు, కార్తీ, రాధామోహన్

# కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేయటం నా బాధ్యత

**– విజయ్ దేవరకొండ**

''విజయ్ వాళ్ల నాన్న గోవర్ధన్‌తో వర్క్ చేశాను. చాలామంచి వ్యక్తి. ఈ చిత్రం ట్రైలర్ చూశాను, బావుంది. సినిమా విడుదల కోసం వెయిట్ చేస్తున్నాను. ఈ చిత్రంతో పాటు విజయ్ చేస్తున్న 'వరల్డ్ ఫేమస్ లవ్' పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు పూరి జగన్నాథ్. 'పెళ్ళిచూపులు' దర్శకుడు తరుణ్‌భాస్కర్ హీరోగా ఆ చిత్ర హీరో విజయ్ దేవరకొండ నిర్మాతగా షామీర్ సుల్తాన్ దర్శకునిగా చేసిన చిత్రం 'మీకు మాత్రమే చెప్తా'. ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో పూరి జగన్నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి. సురేశ్‌బాబు మాట్లాడుతూ– ''విజయ్, తరుణ్ ఎదిగిన తీరు చూస్తుంటే ముచ్చటగా ఉంటుంది. ఈ చిత్రం ట్రైలర్ చూశాను. చాలా బాగుంది'' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''ఐదారేళ్ల క్రితం టీవీలో సెలబ్రిటీలందరినీ చూసి నటుడవ్వాలనే కోరిక ఉండేది. అప్పుడు మా నాన్న నన్ను పూరిగారి దగ్గర వర్క్ చేయమని చెప్పారు. ఇప్పుడు నేను పూరిగారితో వర్క్ చేయటం మర్చిపోలేని అనుభూతి. కలలు కనండి, వాటిని నిజం చేసుకోవటానికి కష్టపడండి. నన్ను చాలామంది సపోర్ట్ చేయటంతో ఈ స్థానంలో ఉన్నాను. అందుకే నేను కొత్త వారిని సపోర్ట్ చేస్తున్నాను. నా సక్సెస్‌కు కారణం సందీప్‌రెడ్డి వంగా. నిర్మాత సురేశ్‌బాబు గారు నా మొదటి సినిమా నుండి సపోర్ట్ చేస్తున్నారు'' అన్నారు. ''విజయ్ దేవరకొండ చేసే ఏ ప్రయత్నమైనా సక్సెస్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ఈ సినిమా అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నా'' అన్నారు తరుణ్ భాస్కర్. షామీర్ మాట్లాడుతూ– ''నాకు ఈ అవకాశం ఇచ్చిన విజయ్‌కి, వర్ధన్ గారికి థ్యాంక్స్. రాకేశ్ పాత్రలో తరుణ్ భాస్కర్ చక్కగా నటించారు. అంతేకాకుండా ఎడిటింగ్, మ్యూజిక్ ఇలా అన్ని విభాగాల్లో చాలా సపోర్ట్ చేశారు. సినిమా విడుదల తర్వాత అందరి పాత్రలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి'' అన్నారు. నిర్మాతలు కె.ఎస్.రామారావు, మధురా శ్రీధర్, గోవర్ధన్ దేవరకొండ, చార్మి తదితరులు పాల్గొన్నారు.


● షామీర్, గోవర్ధన్, తరుణ్ భాస్కర్, పూరి జగన్నాథ్, విజయ్ దేవరకొండ, సురేశ్‌బాబు

# ఆవిరి ఐడియా అలా వచ్చింది

''హారర్ జానర్‌లో రకాలు ఉన్నాయి. 'ఆవిరి' హారర్ మూవీ కాదు. మంచి ఫ్యామిలీ బేస్డ్ థ్రిల్లర్. గతంలో నేను చేసిన 'అవును, అనసూయ' చిత్రాలు కూడా థ్రిల్లర్ మూవీసే. హారర్ కాదు. ప్రేక్షకులను భయపెడితే థ్రిల్ ఫీల్ అవుతారని నేను అనుకోను'' అని దర్శక–నిర్మాత, రచయిత రవిబాబు అన్నారు. నేహా చౌహాన్, రవిబాబు, శ్రీముక్త, భరణీ శంకర్, ముక్తార్ ఖాన్ ప్రధాన తారాగణంగా రవిబాబు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఆవిరి'. నవంబరు 1న ఈ చిత్రాన్ని 'దిల్' రాజు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా రవిబాబు చెప్పిన విశేషాలు.

- నేను, 'దిల్' రాజుగారు ఎప్పట్నుంచో మంచి మిత్రులం. ఆయన నిర్మించిన 'బొమ్మరిల్లు' నాకు చాలా ఇష్టం. మేం ఇద్దరం ఎప్పట్నుంచో సినిమా చేయాలనుకుంటున్నాం. 'ఆవిరి' సినిమాతో కుదిరింది. ఈ సినిమా తీయడానికి ముందు 'దిల్' రాజుగారికి కథ చెప్పాను. సినిమా పూర్తయ్యాక చూపిస్తే, బాగుందన్నారు. నేను ఎవరితో సినిమా తీసినా ఫస్ట్ కాపీ పూర్తయ్యేవరకు బాధ్యత తీసుకుంటాను.
- 'అదుగో' పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలకు రెండున్నరేళ్లు పట్టింది. ఆ సమయంలో నెక్స్ట్ ఏ చిత్రం చేయాలి? అని ఆలోచిస్తున్నప్పుడు అప్పటి వరంగల్ కలెక్టర్ ఆమ్రపాలి ఇంట్లో ఓ స్పిరిట్ ఉందన్న వార్తలు చదివాను. ఈ ఐడియాకు కొన్ని కల్పిత అంశాలు జోడించి 'ఆవిరి' కథ రాసుకున్నాను. 'అదుగో' పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉండటంతో కొన్ని సినిమాల్లో నటించలేకపోయా. 'సాహో' వదులుకున్నాను. మళ్లీ నటుడిగా బిజీ అవుతా.
- భారీ బడ్జెట్ సినిమాలు తీయడం కంటే కొత్త ఐడియాలతో ప్రేక్షకుల మెప్పు పొందడమే గొప్పగా భావిస్తాను. ఇప్పటివరకు నేను ప్రయత్నించిన జానర్‌లు ఎవరూ ప్రయత్నించి ఉండరు.
- నా దగ్గర నాలుగైదు ఐడియాలు ఉన్నాయి. వాటిలో ఓ ముసలాయన పాత్ర ఆధారంగా ఓ కథ ఉంది. అక్కినేని నాగేశ్వరరావు గారు బతికి ఉండి ఉంటే ఆయన్ను ఈ క్యారెక్టర్ చేయమని రిక్వెస్ట్ చేసేవాడిని.


● శ్రీముక్త, రవిబాబు

# అంత డోస్ వద్దు బసు!

బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్, అజయ్ దేవగన్, సైఫ్ అలీఖాన్, కియారా అద్వానీ, రాధికా ఆప్టే.. తదితర తారలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కూ ఓకే చెబుతున్నారు. తాజాగా బిపాసా బసు కూడా ఈ వైపు అడుగులు వేయబోతున్నారని బీటౌన్ టాక్. పాపులర్ అమెరికన్ టెలివిజన్ సిరీస్ 'అన్‌రియల్' ఆధారంగా ఓ టెలివిజన్ సిరీస్ బాలీవుడ్‌లో మొదలు కానుందట. ఇందులో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట బిపాసా. టీఆర్‌పీల కోసం అడల్ట్ కంటెంట్‌ను క్రియేట్ చేసే ఓ రియాలిటీ షో ప్రొడ్యూసర్‌గా బిపాసా నటిస్తారట. 'అన్‌రియల్'లోని కంటెంట్ కాస్త బోల్డ్‌గా ఉంటుందట. అయితే డోస్ వద్దు బసు అని సన్నిహితులు చెప్పడంతో పాటు, తాను కూడా సుముఖంగా లేకపోవడంతో నిర్వాహకులతో మాట్లాడి ఇండియన్ సిరీస్‌కి మాత్రం డోస్ తగ్గించాలనుకుంటున్నారట బిపాసా.


● బిపాసా బసు

# మరుదనాయగమ్ ఎవరు?

కమల్‌హాసన్‌కి డ్రీమ్ ప్రాజెక్ట్స్ చాలానే ఉన్నాయి. వాటిలో 'మరుద నాయగమ్' ఒకటి. 1997లో స్వీయదర్శకత్వంలో టైటిల్ రోల్ చేస్తూ ఈ సినిమాని మొదలుపెట్టారు కమల్. అయితే మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. దానికి ఓ కారణం బడ్జెట్ అని అప్పట్లో వార్తలు వినిపించాయి. అప్పటినుంచి ఇప్పటివరకూ ఈ సినిమా గురించి ఏదో సందర్భంలో కమల్ ప్రస్తావిస్తూ వస్తున్నారు. తాజాగా ఓ అప్‌డేట్ ఇచ్చారు. 'మరుదనాయగమ్'ని పూర్తి చేయాలనుకుంటున్నానని కమల్ పేర్కొన్నారు. అయితే రాజకీయాల్లోనూ బిజీగా ఉన్నందువల్ల ఈ సినిమాలో నటించలేనని స్పష్టం చేశారు. విక్రమ్ నటిస్తారని టాక్. ఇంతకీ 'మరుదనాయగమ్' ఎవరు? అంటే.. 18వ శతాబ్దానికి చెందిన పోరాట యోధుడు. ఆయన ఇస్లామ్ మతానికి మారాక యూసఫ్ ఖాన్‌గా పేరు మార్చుకున్నారు.


● విక్రమ్


● కమల్







గర్భిణులలో రక్తహీనత

# బిడ్డకు రక్తం పంచబోతున్నారా?



**మన దేశంలోని మహిళల్లో రక్తహీనత (అనీమియా) చాలా ఎక్కువ. దాదాపు 80 శాతం మందిలో రక్తహీనత ఉందని ఒక అంచనా. ఓ మోస్తరు రక్తహీనత దీర్ఘకాలం కొనసాగినా రకరకాల అనర్థాలు వస్తాయి. అయితే గర్భవతుల్లో రక్తహీనత వల్ల ఇటు కాబోయే తల్లికీ, అటు పుట్టబోయే బిడ్డకూ ప్రమాదమే. కాబట్టి వారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లోనూ అనీమియా కేసులు ఎక్కువే... మరీ ముఖ్యంగా గర్భవతుల్లో. కాబట్టి ఈ రక్తహీనత వల్ల వచ్చే అనర్థాలు, దాన్ని అధిగమించడానికి మార్గాలను తెలుసుకుందాం.**

రక్తంలోని ఎర్రరక్తకణాలుగాని, దానిలో ఉండే పిగ్మెంట్ అయిన హీమోగ్లోబిన్‌గాని లేదా రెండూగాని తక్కువ అయితే వచ్చే సమస్యను రక్తహీనత (అనీమియా) అంటారు. కారణాలను బట్టి రక్తహీనతల్లో చాలా రకాలున్నాయి. గర్భిణుల్లో 90 శాతం రక్తహీనత ఐరన్ లోపం వల్ల, 5 శాతం ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల ఏర్పడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రమాణాల ప్రకారం రక్తంలో 10 గ్రాముల కంటే తక్కువ హీమోగ్లోబిన్ ఉంటే రక్తహీనత ఉన్నట్లుగా పరిగణించాలి.

## గర్భిణుల్లో రక్తహీనత ఎందుకు ఏర్పడుతుందంటే?

గర్భిణుల్లో మామూలు మహిళల కంటే 40 శాతం (అంటే 1 నుంచి 2 లీటర్లు) ఎక్కువగా రక్తం వృద్ధి అవుతుంటుంది. గర్భంలో ఎదిగే బిడ్డకు ఆహారం, ఆక్సిజన్ సమృద్ధిగా అందడానికి వీలుగా ప్రకృతి ఈ ఏర్పాటు చేసింది. గర్భం ధరించిన నాలుగో నెల నుంచి మహిళల్లో రక్తం వృద్ధి చెందడం మొదలవుతుంది. ఎనిమిదో నెల నిండే సరికి ముందున్న దానికంటే రక్తం 40–50 శాతం పెరుగుతుంది. ఎంత ఆరోగ్యంగా ఉన్న స్త్రీకైనా గర్భం వచ్చిన 5–6 నెలలకి రక్తంలోని ప్లాస్మా పెరగడం వల్ల హీమోగ్లోబిన్ శాతం తగ్గుతుంది. రక్తం పట్టడానికి తగిన ఆహారం, ఐరన్ మాత్రలు వాడేవారిలో మళ్లీ కొద్ది వారాల్లోనే హీమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. అలా తీసుకోని వారిలో హీమోగ్లోబిన్ శాతం మరింత తగ్గుతుంది.

### గర్భవతుల్లో రక్తహీనత లక్షణాలు

తీవ్రతను బట్టి లక్షణాలు కొద్దిగా మారుతుంటాయి. సాధారణంగా కనిపించేవి... • అలసట; • గుండెదడ; • కళ్లుతిరగడం; • తలనొప్పి; • తలబరువుగా ఉన్నట్లు అనిపించడం; • ఆయాసం; • కొంచెం పనికే ఊపిరి అందకపోవడం; • నిద్రపట్టకపోవడం; • ఆకలిలేకపోవడం; • కాళ్లూ, చేతులు మంటలు, నొప్పులు; • నోరు, నాలుకలో నొప్పి, పుండ్లు; • నీరసం; • బియ్యం, మట్టి తినాలనిపించడం; • చర్మం మ్యూకస్‌పొరలు పాలిపోయి ఉండటం; • కాళ్లవాపు; • గుండె వేగంగా కొట్టుకోవడం; • గోళ్లు పలచగా తయారవ్వడం, జుట్టు రాలిపోవడం.

### రక్తహీనతలో రకాలు

| | |
|---|---|
| స్వల్పరక్తహీనత (మైల్డ్) | ... 8.7 గ్రా. నుంచి 10 గ్రా. ఉంటే |
| ఒకమోస్తరు రక్తహీనత (మోడరేట్) | ... 6.6 గ్రా. నుంచి 8.6 గ్రా. ఉంటే |
| తీవ్రమైన రక్తహీనత (సివియర్) | ... 6.5 గ్రా. కంటే తక్కువ |

### రుతుస్రావం కూడా మరో కారణం...

రుతు సమయంలో సాధారణంగా ఐదు రోజుల పాటు రక్తస్రావం అయ్యే మహిళల్లో నెలకు 45 సి.సి. రక్తం కోల్పోతే 15 మి.గ్రా. ఐరన్‌ను కోల్పోయినట్లే. అంతకంటే ఎక్కువ బ్లీడింగ్ అయ్యేవారిలో ఇంకా ఎక్కువగా ఐరన్ తగ్గిపోతుంది. వీరు సరిగా ఆహారం తీసుకోకపోతే రక్తహీనత కలగవచ్చు. ఇక అప్పటికే రక్తహీనతతో ఉన్న మహిళ గర్భం ధరిస్తే... అనీమియా తీవ్రత మరింత పెరగవచ్చు.

### రక్తహీనత నివారణ / చికిత్స...

◆ 21 ఏళ్లకంటే ముందర గర్భం రాకుండా చూసుకోవాలి. ◆ గర్భం దాల్చిన తర్వాత నాల్గవ నెల నుంచి పౌష్టికాహారంతో పాటు రోజూ ఐరన్, ఫోలిక్ యాసిడ్ ఉన్న మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలి ◆ నులిపురుగులు, మూత్రంలో ఇన్ఫెక్షన్ వంటివి ఉంటే తప్పనిసరిగా చికిత్స తీసుకోవాలి ◆ కాన్పుకి, కాన్పుకి మధ్య కనీసం రెండేళ్ల వ్యవధి ఉండేట్లు జాగ్రత్త పడటం వల్ల ఐరన్ నిలువలు పెరిగి మరో కాన్పుకు రక్తహీనత లేకుండా చూసుకోవచ్చు.

**సవరించడానికి...**

◆ రక్తహీనతకు గల కారణాలను గుర్తించి దాన్ని బట్టి చికిత్స చేయాలి. ◆ డాక్టర్ సలహా మేరకు ఐరన్ మాత్రలు వాడాలి.

### రక్తహీనతకు కారణాలు

- గర్భం వచ్చాక రక్తంలో జరిగే మార్పుల వల్ల హీమోగ్లోబిన్ పరిమాణం తగ్గడం.
- ఆర్థిక, సామాజిక కారణాల వల్ల పౌష్టికాహార లోపం కారణంగా ఇనుము, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 లోపం.
- జంక్‌ఫుడ్ తీసుకోవడం.
- జీర్ణవ్యవస్థలో నులిపురుగులు ఉంటే అవి రక్తాన్ని పీల్చుకోవడం
- జీర్ణకోశంలోని కొన్ని సమస్యల వల్ల ఆహారం నుంచి ఐరన్ సక్రమంగా రక్తంలోకి చేరకపోవడం (కడుపులో అల్సర్ల వంటి కారణాల వల్ల కూడా)
- రక్తవిరేచనాలు, మొలలు
- గర్భవతిగా ఉన్నప్పుడు, ప్రసవ సమయంలో రక్తస్రావం.
- దీర్ఘకాలంగా మలేరియా వ్యాధితో బాధపడుతున్నవారిలో ఎర్రరక్తకణాలు విరిగిపోవడం.
- దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లు, లక్షణాలేమీ బయటకు కనపడకుండా మూత్రవ్యవస్థలో బ్యాక్టీరియా చేరడం వల్ల ఎర్రరక్తకణాల ఉత్పత్తి తగ్గడం.
- యువతులు 21 ఏళ్ల లోపు గర్భం ధరిస్తే ఐరన్, ప్రోటీన్స్ వంటివి బాలిక శరీరానికీ, గర్భంలో ఉన్న బిడ్డ పెరుగుదలకూ... ఇలా ఇద్దరికీ అవసరం ఉంటుంది. కాబట్టి అవి సరైన పాళ్లలో అందక రక్తహీనత రావచ్చు.
- పుట్టుకతో వచ్చే థలసీమియా, సికిల్‌సెల్ డిసీజ్ వంటి వాటి కారణంగా.
- అరుదుగా వచ్చే ఎప్లాస్టిక్ అనీమియా, రక్త సంబంధిత వ్యాధుల వల్ల
- కాన్పుకి, కాన్పుకి మధ్య ఎక్కువ వ్యవధి లేకపోవడం వల్ల
- క్షయ, కిడ్నీ వ్యాధి ఉన్నవారిలో

బలంగా ఎదిగే పిల్లలతో ఒక ఆరోగ్యకరమైన సమాజం కోసం గర్భవతుల్లో రక్తహీనత సమస్యను తప్పనిసరిగా అధిగమించాల్సిన అవసరం ఉంది. అందుకే మహిళల్లో రక్తహీనతతోపాటు మరీ ముఖ్యంగా గర్భవతుల్లో అనీమియా సమస్యను నివారించడానికి సమాజం మొత్తం ఈ విషయంపై అవగాహన పెంచుకోవడం అవసరం.



డా॥ వేనాటి శోభ
బర్త్‌రైట్ బై రెయిన్‌బో
హైదర్‌నగర్, హైదరాబాద్

### రక్తహీనత వల్ల గర్భవతికి కలిగే అనర్థాలు...

గర్భిణిలో రక్తహీనత ఎక్కువగా ఉన్నప్పుడు ● అబార్షన్లు ● బిడ్డ సరిగా బరువు పెరగకపోవడం ● శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు ● ఇన్ఫెక్షన్లు ● నెలలు నిండకముందే కాన్పు ● కాన్పు సమయంలో బ్లీడింగ్ ఎక్కువైతే తల్లి రక్తస్రావాన్ని తట్టుకోలేక ప్రాణాపాయ స్థితికి చేరడం, దాంతో రక్తం ఎక్కించాల్సిన అవసరం రావడం వంటి దుష్ఫలితాలు ఏర్పడతాయి.

### ఆహారం నుంచి ఐరన్ అందడానికి...



ఆహారం నుంచే ఐరన్ మన దేహానికి స్వాభావికంగా అందడానికి ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం మంచిది. మన దేహానికి అందే ఐరన్ రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది హీమ్ ఐరన్, రెండోది నాన్–హీమ్ ఐరన్. హీమ్ ఐరన్ మన శరీరంలోకి నేరుగా వేగంగా అబ్‌సార్బ్ అవుతుంది. అదే నాన్‌హీమ్ ఐరన్ అబ్‌సార్బ్ అయ్యేందుకు విటమిన్ 'సి' సహాయం అవసరమవుతుంది. హీమ్ ఐరన్ మాంసం, చేపలు... లాంటి మాంసాహారం నుంచి లభిస్తుంది. నాన్–హీమ్ (ఇనార్గానిక్ ఐరన్) ఆకుపచ్చని ఆకుకూరల్లో (గ్రీన్ లీఫీ వెజిటబుల్స్),అంజీర్, ఎండు ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్స్‌లో ఉంటుంది.

శాకాహారులైతే తాజా ఆకుకూరలు, నువ్వుల ఉండలు, గసగసాలు (జింజెల్లీ సీడ్స్), అటుకులు, పల్లీపట్టీ, బీన్స్, తాజాపండ్లు వంటి వాటిని గర్భం రాక ముందునుంచే తీసుకుంటూ ఉండాలి. ప్రభుత్వ ఆసుపత్రులలో ఐరన్ మాత్రలను ఉచితంగానే ఇస్తారు. వీటికి తోడు విటమిన్ బీ 12, ప్రోటీన్ పుష్కలంగా ఉండే ఆహారాలను కూడా తీసుకోవాలి.

---

ప్రోబయాటిక్స్

# ఇడ్లీ, దోసె, మజ్జిగ కూడా మందులే!



మనం రోజూ తినే ఇడ్లీలు, దోసెలు, రోజూ తాగే మజ్జిగ కూడా మందులా ఉపయోగపడతాయంటే నమ్మగలరా? ఎన్నోరకాల జబ్బుల్నీ నయం చేస్తాయి కూడా. మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది పూర్తిగా వాస్తవం. అలాగే కాస్సేపు వదిలేస్తే పులవడానికి అవకాశమున్న ఇడ్లీపిండి, దోసెపిండి, మజ్జిగ వంటి వాటిల్లో మన జీర్ణవ్యవస్థకు మేలు చేసే మంచి బ్యాక్టీరియా పుష్కలంగా ఉంటుంది. ఈ బ్యాక్టీరియానే మనం ప్రోబయోటిక్స్ అని పిలుస్తాం.

**ఇడ్లీ, దోసె, మజ్జిగలు మందెలా అవుతాయంటే...**

మన చుట్టూ సూక్ష్మజీవులైన అనేకరకాల బాక్టీరియా ఉంటుంది. మన చుట్టే కాదు.. మన చర్మంపైనా, నోట్లో, గొంతులో, మన జీర్ణవ్యవస్థ పొడవునా కోటానుకోట్ల సూక్ష్మజీవులు నివాసం ఉంటుంటాయి. ఇలా మన జీర్ణవ్యవస్థలో ఉండే బ్యాక్టీరియా మన ఆహారాలు జీర్ణం కావడానికి ఉపయోగపడటంతో పాటు కొన్ని రకాల వ్యాధులనుంచి మనల్ని రక్షిస్తుంటాయి. అంటే... పరోక్షంగా అవి మన రోగనిరోధకశక్తిని పెంపొందిస్తూ మనకు మేలు చేస్తుంటాయన్నమాట. మన ఆహార సంప్రదాయంలో మనకు తెలియకుండానే మనం ప్రో–బయాటిక్స్‌ను తీసుకుంటూ ఉంటాం. ఉదాహరణకు ఇడ్లీపిండిని రాత్రి కలుపుకుని ఆ మర్నాడు ఇడ్లీ వాయి దింపుతాం. మన దక్షిణభారతీయులు ఇడ్లీ, దోసె తింటే... గుజరాత్ వంటి చోట్ల ధోక్లా అనే వంటకాన్ని కూడా పిండి పులిసే వరకు ఉంచి చేసుకుంటారు.

**ప్రోబయోటిక్స్ ఇచ్చే సందర్భాలు...**

యాంటీబయాటిక్స్ వాడినప్పుడు: డాక్టర్లు యాంటీబయాటిక్స్ ప్రిస్క్రయిబ్ చేసినప్పుడు అవి మనలోని హాని చేసే సూక్ష్మజీవులతో పాటు మేలు చేసేవాటినీ చంపేస్తాయి. దాంతో మనలో కొన్ని రకాల సైడ్‌ఎఫెక్ట్స్ కనిపిస్తాయి. అంటే కడుపులో గ్యాస్ పెరగడం, మజిల్ క్రాంప్స్, డయేరియా వంటివి. మనలో ఉండే ప్రోబయాటిక్స్ మన దేహానికి అవసరమైన కొన్ని విటమిన్లు స్వాభావికంగానే అందేలా చేస్తాయి. అయితే యాంటీబయాటిక్స్ కారణంగా విటమిన్లు కూడా అవసరమైన మేరకు అందని పరిస్థితి వచ్చే అవకాశాలు ఉండవచ్చు. అందుకే ఈ పరిణామాన్ని నివారించడానికి యాంటీబయాటిక్స్‌తో పాటు కొన్ని విటమిన్లు, ప్రోబయాటిక్స్ డాక్టర్లు ప్రిస్క్రయిబ్ చేస్తారు.

- **డయేరియాతో బాధపడేవారికి:** కొన్ని ఇన్ఫెక్షన్స్ కారణంగా నీళ్ల విరేచనాలు అవుతున్నవారికి సైతం ప్రో–బయాటిక్స్ ఇస్తారు.
- **ఇరిటబుల్ బవెల్ సింగ్రోమ్ (ఐబీఎస్):** ఈ సమస్య ఉన్నవారిలో విరేచనం సరిగా కాదు లేదా అదేపనిగా విరేచనాలు కావచ్చు. తిన్న వెంటనే టాయిలెట్‌కు వెళ్లాల్సి వస్తుంటుంది. ఇలా ఇరిటబుల్ బవెల్ సింగ్రోమ్ సమస్య ఉన్న వారికి ప్రో–బయాటిక్స్ బాగా పనిచేస్తాయి.
- **ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్:** అల్సరేటివ్ కొలైటిస్ లేదా క్రోన్స్ డిజీస్ ఉన్నవారికి ప్రో–బయాటిక్స్ మేలు చేస్తాయి.
- **హెలికోబ్యాక్టర్ పైలోరీ:** కొందరిలో పేగులో పుండు పడి, పేగుకు రంధ్రం పడేలా చేసే హెలికోబ్యాక్టర్ పైలోరీ కారణంగా కడుపులో మంట వంటి లక్షణాలు కనిపిస్తున్నప్పుడు సైతం ప్రో–బయాటిక్స్ మంచి మేలు చేస్తాయి.



డాక్టర్ శరత్ చంద్ర జి.
మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
హైదర్‌గూడ, హైదరాబాద్.

---

# కంటికి శ్రమ లేకుండా ఎలా చదవాలి?

చదువుకునే పిల్లలు తమ ఇష్టం వచ్చినట్లు చదువుతుంటారు. ఉదాహరణకు ఎదుటి నుంచి లైట్ పడుతుంటే... దానికి అడ్డంగా పుస్తకం పెట్టి చదివేవారూ ఉంటారు. నిజానికి లైట్ వెనక నుంచి పుస్తకంలోని పేజీలపై పడి... అక్కడి నుంచి కంటికి చేరితే కంటికి శ్రమ తగ్గుతుంది. అదే లైట్ పుస్తకానికి వెనకవైపు ఉంటే పుస్తకం నీడే పేజీల మీద పడి... కంటికి శ్రమ పెరుగుతుంది. అదీగాక... మంచి బ్రైట్‌గా ఉండే కాంతిలో చదవడం వల్ల కంటిపై పడే శ్రమ కూడా తగ్గుతుంది. దాంతో చూపు నాలుగు కాలాలపాటు పదిలంగా ఉంటుంది. దృష్టిదోషాలు అంత త్వరగా రావు. అందుకే చదువుకునే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఆ జాగ్రత్తలను తెలుసుకోండి.

- చిన్నప్పుడు పిల్లలు తమ ఆసక్తి, అభిరుచి కొద్దీ కథల పుస్తకాల వంటి వాటిని మసక వెలుతురులో సైతం చదువుతుండటాన్ని గమనించే ఉంటారు. పిల్లల దశలో చదవగలిగేంత కాంతి ఉన్నప్పుడు మసక వెలుతురులో చదివినా పెద్దగా అభ్యంతరం ఉండదు. కానీ పెద్దయ్యాక మాత్రం మసక వెలుతురులో చదవడం మంచిది కాదు. పిల్లలైనా, పెద్దలైన కంటి మీద పడే శ్రమ చాలా ఎక్కువ. కాబట్టి తగినంత కాంతిలోనే చదవడం మంచిది.
- టేబుల్ లైట్ కాంతిలో చదువుతున్నప్పుడు అది కంటిపై తీవ్రంగా పడి దాన్ని అలసటకు గురి చేయకూడదు. అలాగని గుడ్డి వెలుగులోనూ చదవవద్దు. మంచి కాంతిని ఇచ్చే బల్బ్‌ను ఎంచుకోండి. టేబుల్ లైట్ కనీసం పుస్తకం నుంచి మూడు అడుగుల దూరంలో ఉండాలని గుర్తుపెట్టుకోండి.
- సాధారణంగా 40 ఏళ్లు దాటాక చదవడానికి కాంతి ఎక్కువ కావాలి. అంటే ఉదాహరణకు 20 ఏళ్ల వ్యక్తి చదవగలిగే కాంతి కంటే... 60 ఏళ్ల వ్యక్తి చదవడానికి అవసరమైన కాంతి రెట్టింపు కావాలి. సాధారణంగా ఇలా చదవడానికి ఎక్కువ కాంతి అవసరం కావడం అన్నది 40 ఏళ్ల వయసు తర్వాత మొదలవుతుంది. కాబట్టి ఆ వయసు నుంచి తరచూ కంటి డాక్టర్‌ను సంప్రదించి మీ కంటి చూపు ఎలా ఉందో పరీక్షలు చేయించుకుంటూ ఉండండి. అవసరమైతే కంటి అద్దాలు, మందులు వాడాలి.
- నేరుగా సూర్యకాంతిలో చదవకూడదు.
- మీ కంప్యూటర్ కాంతి కంటికి హాని చేయకుండా ఉండేలా అడ్జస్ట్ చేసుకోండి. కంప్యూటర్ తెరపై వీలైతే యాంటీ గ్లేర్ స్క్రీన్‌ను అమర్చుకోండి. కంప్యూటర్ స్క్రీన్ సరిగ్గా కంటి లెవెల్‌లో ఉండాలి.
- చదివే గది ఎప్పుడూ చీకటిగా ఉండకూడదు.
- ట్యూబ్‌లైట్ కాలిపోయే ముందర మిణుకు మిణుకుమంటూ వెలుగుతుంటుంది. ఇలా మిణుకుమిణుకు (ఫ్లిక్కరింగ్) కాంతిలో అస్సలు చదవకూడదని తెలుసుకోండి.
- చదవడానికి టీవీ లైట్‌ను గాని, కంప్యూటర్ మానిటర్ లైట్‌ను గానీ, మొబైల్ కాంతిని గానీ ఉపయోగించకండి.



**కొన్ని ప్రధాన సూచనలు**

● ఇప్పుడు చాలామంది ఈ–బుక్స్, టాబ్స్, మొబైల్‌ఫోన్లలో చదువుతున్నారు. ఇక స్మార్ట్ ఫోన్‌లో బదులు ట్యాబ్‌లో చదవడం మంచిది. కంప్యూటర్‌లో చదవడం ఇంకా మంచిది. కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లలో మళ్లీ కంప్యూటరే మంచిది. ● ట్యాబ్స్‌లో లేదా మొబైల్‌లో చదివే సమయంలో మనం ఫిక్స్‌డ్‌గా ఉంచి చదవాలి. ● వెన్ను, మెడ, కళ్లు ఇవన్నీ ఒకే స్ట్రెయిల్‌లైన్‌లో ఉండాలి. ● వెన్నెముకకు సపోర్ట్ ఉండేలా కూర్చోవడం మంచిది. (స్టూల్‌కంటే వెనక మెత్తటి సపోర్ట్ ఉండే కుర్చీ మేలు). ● 4 – 6 గంటలు చదవడం ఐడియల్. అంత కంటే ఎక్కువ సేపు చదవాల్సి వస్తే కొంత కొంత వ్యవధి ఇస్తూ చదవాలి. ● ఫాంట్స్ సైజ్ ఎక్కువగా ఉండాలి. ● కాంట్రాస్ట్ బాగా ఉండాలి.



డాక్టర్ రవికుమార్ రెడ్డి
కంటి వైద్య నిపుణులు,
మెడివిజన్ ఐ హాస్పిటల్,
హైదరాబాద్.

---

హోమియో కౌన్సెలింగ్స్

# టెండనైటిస్ తగ్గుతుందా?



నా వయసు 39. నేనొక క్రీడాకారుణ్ణి. కొంతకాలంగా చేయి కదిలించినప్పుడు భుజంలో విపరీతమైన నొప్పితో బాధపడుతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే టెండన్స్‌కి సంబంధించిన సమస్య అని చెప్పారు. హోమియో చికిత్స ద్వారా దీన్ని పూర్తిగా నయం చేసే అవకాశం ఉందా?

– శ్రీహర్ష, విశాఖపట్నం

మీరు తెలిపిన లక్షణాలను బట్టి మీరు టెండినైటిస్ సమస్యతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. మన శరీరంలోని కండరాలను ఎముకలతో జతపరిచే తాడు లాంటి కణజాలాన్ని టెండన్స్ అని అంటాము. వీటికి సాగగల గుణం ఉండటం వల్ల అవి కండరాలు ముడుచుకునే సమయంలో, ఎముకలు, కీళ్ల కదలికలకు సహకరిస్తాయి. ఏ కారణం చేతనైనా వీటికి హానికలిగితే, కదలికలు ఇబ్బందికరంగా మారి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి.

ఈ టెండన్స్ ఇన్ఫెక్షన్‌కు గురికావడాన్ని టెండినైటిస్ అంటారు. శరీరంలో ఎక్కడైనా ఏర్పడే ఈ సమస్య... భుజాలలో, మోచేతుల్లో, మణికట్టు, బొటనవేలు మొదటి భాగంలో, తుంటి, మోకాలు, మడమలు వంటి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. 40 ఏళ్లు పైబడిన వారిలో సాధారణంగా టెండాన్స్ సాగేతత్వం, ఒత్తిడిని తట్టుకునే శక్తి తగ్గడం వల్ల ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. **కారణాలు:** ● వృత్తిరీత్యా లేదా హాబీల కారణంగా టెండన్స్‌పై అధిక ఒత్తిడి కలిగించే ఒక రకమైన కదలికలను ఎక్కువగా కొనసాగించడం. ఉదా: కంప్యూటర్ కీ–బోర్డులు, మౌస్‌లు ఎక్కువగా వాడటం, కార్పెంటింగ్, పెయింటింగ్ మొదలైనవి. ● **క్రీడల వల్ల:** పరుగెత్తడం, టెన్నిస్, బాస్కెట్‌బాల్, గోల్ఫ్, బౌలింగ్ మొదలైనవాటివల్ల. ● డయాబెటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, స్థూలకాయం వంటి ఇబ్బందులతో బాధపడేవారు ● కొన్ని ఇన్ఫెక్షన్లు **లక్షణాలు:** టెండినైటిస్‌కి గురైన ప్రదేశంలో నొప్పి, బిగువుగా ఉండటం, ఆ భాగాన్ని కదిలించినప్పుడు నొప్పి అధికమవ్వడం, వాపు, చేతితో తాకితే ఆ ప్రదేశం వేడిగా అనిపించడం, ఎర్రగా మారడం వంటి లక్షణాలు.

**జాగ్రత్తలు:** కంప్యూటర్లను, కీబోర్డులను, మౌస్‌లను సరైన పొజిషన్‌లో సర్దుబాటు చేసుకోవడం. ● పనిలో కొంత విశ్రాంతి తీసుకోవడం ● వ్యాయామాలు ఒకేసారి అధిక ఒత్తిడికి గురిచేసేలా కాకుండా నెమ్మదిగా ప్రారంభించడం ● క్రీడలలో కోచ్ సలహా మేరకు జాగ్రత్తలు పాటించడం.

**చికిత్స:** కాన్స్టిట్యూషనల్ విధానంలో చికిత్స అందించడం ద్వారా రోగ నిరోధకశక్తిని సరిచేసి టెండన్స్‌ను దృఢపరచి సమస్యను సమూలంగా నయం చేయవచ్చు.



డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

---

ఫ్యామిలీ డాక్టర్

# నడుమునొప్పి తగ్గుతుందా?



నా వయసు 42 ఏళ్లు. నాకు కొద్దికాలంగా తీవ్రంగా నడుము నొప్పి వస్తోంది. డాక్టర్‌ను సంప్రదిస్తే అది డిస్క్ సమస్య అని, ఆపరేషన్ అవసరమవుతుందన్నారు. హోమియో చికిత్స ద్వారా ఆపరేషన్ అవసరం లేకుండా నా సమస్య తగ్గుతుందా?

– ఎమ్. సుకన్య, సికింద్రాబాద్

నడుమునొప్పి తగ్గితే చాలని సర్జరీకి సిద్ధపడితే... ఒకవేళ ఆ ఆపరేషన్ విఫలమైతే కొత్త సమస్యలు మొదలవుతాయి. ఆ బాధలు చెప్పనలవి కాదు. చాలా మంది విషయంలో ఇదే జరుగుతుంది. డిస్క్‌లో సమస్య అని సర్జరీ చేస్తే అది కొత్త అనర్థాలకు కారణమవుతుంది. తప్పుడు భంగిమల్లో కూర్చుని, గంటల తరబడి అదేపనిగా సుదీర్ఘకాలం పాటు పనిచేసేవారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. నిజానికి డిస్క్, స్పాండిలోసిస్ వంటి సమస్యలను ఆపరేషన్ అవసరం లేకుండానే హోమియో మందులతోనే సమూలంగా తగ్గించే వీలుంది. నడుము భాగంలో విపరీతమైన నొప్పి వస్తున్నట్లయితే దాన్ని లంబార్ స్పాండిలోసిస్ అంటారు. నడుము నొప్పి కారణంగా ఏ పనీ చేసుకోలేకపోవడం వంటి అసహాయత ఏర్పడుతుంది. ఉదయం వేళల్లో నొప్పి ఎక్కువగా ఉంటుంది. ఆ నొప్పి క్రమంగా నడుము నుంచి కాళ్లలోకి పాకుతుంది. మహిళలకు మూత్రవిసర్జనపై నియంత్రణ కోల్పోవడం వంటి సమస్యలు సైతం వచ్చే అవకాశాలున్నాయి. లంబార్ స్పాండిలోసిస్‌తో దీర్ఘకాలం బాధపడే వారిలో శృంగార సమస్యలూ ఎదురయ్యే అవకాశాలు ఉంటాయి.

**వ్యాధి నిర్ధారణ:** ఎక్స్–రే, ఎమ్మారై స్కాన్ ద్వారా డిస్క్‌లలో తేడాను, నడుమునొప్పి గల కారణాలను గుర్తించవచ్చు.

**చికిత్స:** దీర్ఘకాలంగా వేధిస్తున్న నడుము నొప్పి సమస్యలకు హోమియో వైద్య విధానంలో చికిత్స అందుబాటులో ఉంది. ఇప్పుడు అందుబాటులో ఉన్న మందుల ద్వారా నడుమునొప్పిని పూర్తిగా దూరం చేయవచ్చు. వెన్నుపూసలో జరిగే మార్పులను నివారిస్తూ, కండరాలకు బలం చేకూర్చే విధంగా చికిత్స ఇవ్వడం వల్ల సత్ఫలితాలుంటాయి. అయితే పరిస్థితి పూర్తిగా విషమించకముందే డాక్టర్‌ను సంప్రదిస్తే ఫలితాలు చాలా మెరుగ్గా ఉంటాయి. అనుభవజ్ఞులైన హోమియో డాక్టర్‌ను సంప్రదించండి.



డా॥ కె. రవికిరణ్,
మాస్టర్స్ హోమియోపతి, హైదరాబాద్

---

పరిశోధన

# చనుబాలు ఇస్తున్నారా? గర్భసంచి క్యాన్సర్ రిస్క్ తగ్గుతుంది!



మీరు మీ బిడ్డలకు చనుబాలు ఇస్తున్నారా? అయితే మీరు గర్భసంచి, ఎండోమెట్రియల్ క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పు నుంచి చాలా దూరం జరుగుతున్నట్లేనని అంటున్నారు బ్రిస్బేన్ (ఆస్ట్రేలియా) లోని క్యూఐఎమ్ఆర్ బెర్ఘోఫర్ మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు. బాగా అభివృద్ధి చెందిన దేశాలని చెప్పుకునే యునైటెడ్ స్టేట్స్, కెనడా, ఆస్ట్రేలియా వంటి చోట్ల కూడా ఎండోమెట్రియల్ క్యాన్సర్ ముప్పు చాలా ఎక్కువ. చనుబాలు పట్టించడం అన్న ఒకే ఒక్క ఆరోగ్యకరమైన, స్వాభావికమైన అలవాటుతోనే ఈ క్యాన్సర్ వచ్చే ముప్పు 11 శాతం తగ్గుతుందని పరిశోధకులు చెబుతున్నారు. అంతే కాదు... ఈ అధ్యయనం మాత్రమే గాక... గతంలో నిర్వహించిన 17 పరిశోధనల్లోనూ ఇదే విషయం తెలిసిందనీ, అది మరోమారు కచ్చితంగా నిర్ధారణ అయ్యిందని ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న కీలక పరిశోధకురాలు సుసాన్ జోర్డాన్ వ్యాఖ్యానించారు. ఈ అధ్యయన ఫలితాలు ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
గురువారం 31-10-2019

## ఉద్యోగ సమాచారం

### యూపీఎస్సీ-సీడీఎస్ ఎగ్జామ్ (1)-2020

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)..కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్) (1)-2020 ప్రకటనను జారీ చేసింది.

- మొత్తం ఖాళీలు: 418
  - ఇండియన్ మిలిటరీ అకాడమీ- డెహ్రాడూన్: 100
  - ఇండియన్ నేవల్ అకాడమీ-ఎజిమళ: 45
  - ఎయిర్‌ఫోర్స్ అకాడమీ-హైదరాబాద్: 32
  - ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ-చెన్నై: 225
  - ఎస్ఎస్‌సీ ఉమెన్ (నాన్ టెక్నికల్): 16
- **అర్హత:** విభాగాన్ని బట్టి సాధారణ డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ, డీజీసీఏ జారీ చేసిన కమర్షియల్ పైలట్ లైసెన్స్‌తో పాటు నిర్దేశించిన శారీరక ప్రమాణాలుండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్షతేదీ:** ఫిబ్రవరి 2, 2020.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 19, 2019.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200 (మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ఉచితం).
- **దరఖాస్తులు ఉపసంహరణ:** నవంబర్ 26, 2019 నుంచి డిసెంబర్ 3, 2019 వరకు.
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..
- ఎస్సెస్సీ సీజీఎస్ స్టడీమెటీరియల్, ఆన్‌లైన్ టెస్టులు, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్
- ఇంటర్ స్టడీ మెటీరియల్, ప్రీవియస్ పేపర్స్, గైడెన్స్
- డైలీ, వీక్లీ, మంత్లీ కరెంట్ అఫైర్స్
- టీఎస్, ఏపీ టెట్ స్టడీ మెటీరియల్

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

# గేట్ 2020 — గేర్ మార్చండి




**ప్రతిష్టాత్మక పరీక్షల్లో ఒకటి.. గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్). దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీలు, నిట్‌ల్లో ఎంఈ/ఎంటెక్‌ల్లో చేరాలన్నా, పీహెచ్‌డీ చేయాలన్నా.. గేట్ రాయాల్సిందే! ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువు దక్కించుకోవాలన్నా... గేట్‌లో ప్రతిభ చూపాల్సిందే!! గేట్ 2020కు దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. ఫిబ్రవరి1వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గేట్‌కు ఏటేటా పోటీ పెరుగుతోంది. ఈ పరీక్షకు మూడు నెలల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో... గేట్‌లో విజయానికి ప్రిపరేషన్ పద్ధతులను తెలుసుకుందాం..**

- ముగిసిన గేట్ 2020 దరఖాస్తుల ప్రక్రియ
- ఫిబ్రవరి 1, 2, 8,9 తేదీల్లో గేట్ పరీక్షలు

గేట్ 2020ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), ఢిల్లీ నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా మొత్తం 25 సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ జరుగనుంది. గేట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఐఐటీలు, నిట్‌లు, ప్రముఖ యూనివర్సిటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ప్రముఖ ఇంజనీరింగ్, టెక్నాలజీ కాలేజీలు, ఆర్కిటెక్చర్, ఫార్మసీ విభాగాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. పరీక్షకు మూడు నెలలు మాత్రమే సమయం ఉంది. ఈ సమయంలో ఎలాంటి ప్రిపరేషన్ వ్యూహం అనుసరించాలో నిర్ణయించుకోవాలి. అలాగే సిలబస్ విశ్లేషణ, చదవాల్సిన పుస్తకాలు తదితర అంశాలపై సమగ్ర అవగాహనతో పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవడం చాలా అవసరం.

### ప్రయోజనాలు

- గేట్‌లో ఉత్తమ స్కోర్ సాధించిన అభ్యర్థులకు దేశంలోని ప్రతిష్టాత్మక ఉన్నత విద్యాసంస్థల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) కోర్సుల్లో చేరే అవకాశం లభిస్తుంది. గేట్ స్కోర్‌తో ఐఐటీలు, నిట్‌ల్లో ఎంటెక్‌లో ప్రవేశం పొందొచ్చు. అంతేకాకుండా సైన్స్ కోర్సులను అందించడంలో అంతర్జాతీయ గుర్తింపు ఉన్న బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)లోనూ అడ్మిషన్ దక్కించుకోవచ్చు.
- ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ ఆర్కిటెక్చర్ కోర్సుల్లో మాస్టర్స్, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌తోపాటు, సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశం పొంది.. ఫెలోషిప్/ఫైనాన్షియల్ అసిస్టెంట్‌షిప్ అందుకోవాలన్నా.. గేట్‌లో ప్రతిభ చూపాల్సిందే!
- గేట్‌తో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో(పీఎస్‌యూ) ఉద్యోగావకాశాలు సొంతం చేసుకోవచ్చు. డీఆర్‌డీఓ, ఇస్రో లాంటి సంస్థల్లో సైంటిస్టులుగా; బీహెచ్‌ఈఎల్, గెయిల్, హెచ్‌పీఎల్, ఐఓసీఎల్, ఎన్టీపీసీ, ఓఎన్‌జీసీ వంటి సంస్థల్లో ఆకర్షణీయ వేతనాలతో కొలువులు దక్కించుకునే వీలుంది.
- గేట్ స్కోర్‌కు మూడేళ్ల వ్యాలిడిటీ ఉంటుంది.

### పరీక్ష విధానం

గేట్ పరీక్ష... ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారితంగా జరుగుతుంది. పరీక్షలో మొత్తం 65 ప్రశ్నలకుగాను 100 మార్కులు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్నలు మల్టిపుల్ ఛాయిస్ క్వశ్చన్స్ (ఎంక్యూఎస్), న్యూమరికల్ ఆన్సర్ టైప్ క్వశ్చన్స్ (ఎన్ఏటీ) విధానంలో అడుగుతారు. జనరల్ ఆప్టిట్యూడ్ (జీఏ)కు 15మార్కులు; అలాగే ఇంజనీరింగ్ మ్యాథ్స్‌కు (కెమిస్ట్రీ నుంచి ఎక్స్ఎల్) 15 శాతం మార్కులు కేటాయించారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్టుల నుంచి 70శాతం మార్కులు ఉంటాయి.

### ప్రిపరేషన్

- ప్రతిష్టాత్మకమైన ఇంజనీరింగ్ పరీక్షల్లో గేట్ ఒకటి. ఈ పరీక్షల్లో అడిగే ప్రశ్నల సరళి చాలా కష్టంగా ఉంటుంది. అందుకే ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనా... విజయం సాధించే వారి సంఖ్య తక్కువగా ఉంటుంది.
- గేట్ పరీక్షల్లో రాణించేందుకు హార్డ్‌వర్క్‌తోపాటు స్మార్ట్ వర్క్ చాలా అవసరం. ఎంత బాగా కష్టపడితే విజయావకాశాలు అంత మెరుగ్గా ఉంటాయి. దీర్ఘకాలిక ప్రిపరేషన్ సాగించే వారికే గేట్‌లో గెలుపు అవకాశాలు ఎక్కువ.
- తొలుత పరీక్షకు సంబంధించి సిలబస్‌ను విశ్లేషించుకోవాలి. ఆ తర్వాత పటిష్ట ప్రణాళిక రూపొందించుకొని పూర్తి అంకితభావంతో ఏకాగ్రతతో ప్రిపేరవ్వాలి. నిద్రకు కూడా తగినంత సమయం కేటాయించడం ముఖ్యమని గుర్తించాలి.

గేట్‌కు ప్రిపరేషన్ ప్రారంభించే ముందు సిలబస్ గురించి సమగ్రంగా తెలుసుకోవాలి. అయా సబ్జెక్టుల్లో ఏ విభాగం నుంచి ఎన్ని ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో.. అంశాల వారిగా ఒక జాబితా సిద్ధం చేసుకోవాలి. అలాగే గత ప్రశ్న పత్రాలను అధ్యయనం చేయడం లాభిస్తుంది.

### వెయిటేజీ ఎంతంటే

గేట్‌కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు.. సిలబస్‌లోని టాపిక్స్ వారీగా వెయిటేజీ తెలుసుకోవాలి. పరీక్షలో జనరల్ ఆప్టిట్యూడ్ విభాగానికి 15 శాతం వెయిటేజీ ఉంటుంది. ఇందులో స్కోర్ చేయడం తేలిక. కాబట్టి ఎక్కువ మార్కులు సాధించడానికి ఈ విభాగం ఉపయోగపడుతుంది. జనరల్ ఆప్టిట్యూడ్‌లో రెండు విభాగాలు ఉంటాయి. ఒకటి వెర్బల్ ఎబిలిటీ, రెండోది, న్యూమరికల్ ఎబిలిటీ. న్యూమరికల్ ఎబిలిటీ ప్రశ్నలకు సంబంధించి షార్ట్‌కట్ మెథడ్స్ అనుసరించడం ద్వారా సులభంగా సమాధానాలు గుర్తించొచ్చు. అలాగే న్యూమరికల్ ఎబిలిటీ ప్రశ్నలకు సమయం ఎక్కువ పడుతుంది. కాబట్టి అందుకు తగ్గట్టు టైం మేనేజ్‌మెంట్‌ను పాటించాలి.

### ప్లానింగ్ ముఖ్యం

గేట్‌కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు సొంతంగా తనకు తాను ప్రణాళిక రూపొందించుకోవాలి. నెల, వారం, రోజుల వారీ లక్ష్యాలకు సంబంధించి.. ఎప్పుడు ఏ సబ్జెక్టు ఎంత వరకు చదవాలి అనే దానిపై స్పష్టత తెచ్చుకోవాలి. చదివిన టాపిక్స్‌లో ఆయా అంశాల వారీగా వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల ఆయా సబ్జెక్టుల్లో పట్టు సడలకుండా ఉంటుంది.

### ఇవి పాటించండి

- అభ్యర్థులు తమకు సులభమైనవి, కఠినమైనవిగా టాపిక్స్‌ను విభజించుకోవాలి.
- వెయిటేజ్ ఎక్కువగా ఉన్న అంశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.
- మాక్ టెస్టులు రాయడంతోపాటు, గత పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయాలి.
- ఒక టాపిక్ పూర్తి చేసిన తర్వాత రివిజన్ చేయడం తప్పనిసరి. లేకుంటే కొద్దిరోజుల తర్వాత ఆయా టాపిక్స్‌ను మళ్లీ మొదటి నుంచి చదవాల్సి వస్తుంది.
- చదివిన ప్రతి టాపిక్‌కు సంబంధించిన ముఖ్యాంశాలు చిన్న నోట్ బుక్‌లో షార్ట్‌కట్‌లో రాస్తుండాలి. దీనివల్ల వాటిని చూడగానే ప్రాక్టీస్ చేసిన అంశాలు గుర్తుకొస్తాయి.
- అభ్యర్థులు వ్యక్తిగతంగా రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలి. వేరే వాళ్ల ప్రణాళికలను అనుసరించడం వల్ల గందరగోళానికి గురవుతారు.
- మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ.. ప్రాక్టీస్ చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది.

### ప్రాక్టీస్, రివిజన్ ముఖ్యం

ప్రాక్టీస్, రివిజన్ లేకుండా ఎంత చదివినా ప్రయోజనం ఉండదు. వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. అలాగే చదివిన టాపిక్స్ మళ్లీ మళ్లీ చదువుతుండాలి. ఎంత ఎక్కువగా రివిజన్ చేస్తే అంత మంచిది. ప్రశ్నలు అడిగే తీరు ఏ విధంగా ఉన్నా.. సమాధానాలు రాబట్టేందుకు సిద్ధంగా ఉండాలి. అందుకు ప్రాక్టీస్ ఒక్కటే మార్గం. పాత పేపర్లతో పాటు క్వశ్చన్ బ్యాంకుల్లోని ప్రశ్నలపై దృష్టిపెట్టాలి. వీలైనన్నీ ప్రశ్నలు సాధించడం పరీక్షలో ఉపకరిస్తుంది. షార్ట్‌కట్ మెథడ్స్ అనుసరించడం వల్ల సమయం ఆదాచేసుకోవచ్చు.

### నెగిటివ్ మార్కులతో జాగ్రత్త

గేట్ పరీక్షలో జాగ్రత్తపడకుంటే.. వచ్చిన మార్కుల కంటే పోయే మార్కులు ఎక్కువగా ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి వచ్చిన ఒక మార్కు నుంచి 1/3 వంతు, రెండు మార్కుల ప్రశ్నలకు 2/3 వంతు మార్కుల్లో కోత విధిస్తారు. న్యూమరికల్ ప్రశ్నలకు నెగిటివ్ మార్కులు ఉండవు. కాబట్టి కచ్చితంగా సరైన సమాధానం అనిపించే.. వాటికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. వీటికోసం ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.

### కోచింగ్ అవసరమా

గేట్ పరీక్షకు కోచింగ్ తప్పనిసరి కాదు. ఎంతో మంది సొంతంగా చదివి కూడా ర్యాంకులు సాధించారు. పరీక్షకు సంబంధించి ఎలాంటి అవగాహన లేనప్పుడు మాత్రం కోచింగ్ ఉపయోగపడుతుంది. మాక్ టెస్టులకు హాజరవడం వల్ల పరీక్ష గురించి ఆందోళన తగ్గుతుంది. మాక్ టెస్టుల ద్వారా ఆత్మవిశ్వాసం పెరిగే అవకాశం ఉంది.

» వెబ్‌సైట్: http://gate.iitd.ac.in/brochure.php

# ప్రాంతీయ ప్రణాళికలు-ఆర్థికాభివృద్ధి

**కాంపిటేటివ్ గైడెన్స్**
**జనరల్ ఎస్సే**

**ప్రణాళికల ఆశయాలను 1.వ్యవసాయ, సంబంధిత అభివృద్ధి కార్యక్రమాలు, 2. సామాజిక సేవలైన విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక శ్రేయస్సు, 3. పట్టణాభివృద్ధి అనే మూడు కేటగిరీలుగా విభజించవచ్చు. 1951లో ఏప్రిల్1 నుంచి 2017 మార్చి 31 వరకు.. పన్నెండు పంచవర్ష ప్రణాళికలను రూపొందించి అమలు పరచినప్పటికీ.. గ్రామీణ పేదరికరం, నిరుద్యోగం, ప్రాంతీయ అసమానతల నివారణ సాధ్యం కాలేదు. నేటికీ దేశంలోని అనేక గ్రామాలు మౌలిక వసతుల కల్పనకు నోచుకోలేదు.**



బ్రిటిష్ పాలనలో దేశంలోని కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమైన అభివృద్ధి.. స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగింది. ప్రణాళికాభివృద్ధి మొదటి దశలో ప్రాదేశిక అంశం (Spatial Component) నిర్లక్ష్యానికి గురైనందువల్ల ప్రాంతాల మధ్య అభివృద్ధిలో వ్యత్యాసాలు పెరిగాయి. ఆర్థికాభివృద్ధికి తోడ్పడే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వెనుకబడిన ప్రాంతాల్లో ప్రోత్సహించడం స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థ ఉద్దేశమై ఉండాలి. 1990వ దశకంలో స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థగా రూపొందిన భారత్‌లో అవలంభించిన ప్రభుత్వ విధానాలు.. ప్రాంతీయ అసమానతల తగ్గుదలకు దోహదపడలేదు. ఈ నేపథ్యంలో ప్రాంతీయ సమతౌల్యాభివృద్ధి సాధనకు భవిష్యత్తు కార్యక్రమం, విధానాలతో పాటు పారిశ్రామికీకరణ, పట్టణీకరణకు సంబంధించి ప్రాదేశిక వ్యవస్థల పునర్వ్యవస్థీకరణ (Spatial Structures Reorganisation) అవసరం. సామాజిక, ఆర్థిక, భౌతిక అభివృద్ధిలో ప్రాదేశిక అసమానతలను తొలగించడానికి అనేక దేశాల్లోని ప్రభుత్వాలు ప్రయత్నించినప్పటికీ.. సంస్థాపరమైన లోపాల కారణంగా సాధ్యం కాలేదు. కొన్ని దేశాలు ప్రాంతీయ ప్రణాళికల అమలు ద్వారా ప్రాదేశిక అసమతౌల్యాన్ని తొలగించుకోగలిగాయి. భారత్‌లోనూ అభివృద్ధి కోసం అనేక ప్రాంతాలను గుర్తించి ప్రాంతీయ ప్రణాళికలను రూపొందించినప్పటికీ... అమల్లో సమర్థత లోపించడం, ప్రాచుర్యానికి నోచుకోకపోవడం వల్ల లక్ష్య సాధన సాధ్యం కాలేదు. ప్రజలు, రాజకీయవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ విభాగాల పరిపాలనా సిబ్బందిని విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేయడంతోపాటు ప్రభుత్వ విధానాలను వారు పూర్తిగా ఆమోదించినప్పుడు ప్రాంతీయ ప్రణాళికల లక్ష్యసాధన నెరవేరుతుంది. చిన్న పట్టణాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంత సంబంధాలను పటిష్టపరచడంలో దక్షిణాఫ్రికా కృషిని భారత్ అధ్యయనం చేయడం మేలు.

### వృద్ధి-ప్రాంతీయ అసమానతలు

ఆర్థిక సరళీకరణ, కఠిన బడ్జెట్ అవరోధాల కారణంగా రాష్ట్రాలకు వనరుల కేటాయింపులో కేంద్రం పాత్ర పరిమితమైంది. భూమిపై అధిక జనాభా ఒత్తిడి, వ్యవసాయ రంగంపై అధికంగా ఆధారపడటం, పెద్ద తరహా పట్టణీకరణ సాధ్యం కాకపోవడం, వ్యవసాయ, కుటీర పరిశ్రమల్లో అల్ప ఉత్పాదకత లాంటి లక్షణాలు ఒక ప్రాంత ఆర్థిక వెనుకబాటుతనాన్ని స్పష్టపరుస్తాయి. 1990-91 నుంచి 2004-05 మధ్య కాలంలో సగటు వార్షిక వృద్ధి రేటు కర్ణాటకలో అధికంగా నమోదైంది. తదుపరి స్థానాల్లో పశ్చిమ బెంగాల్, గుజరాత్, మహారాష్ట్రలు నిలిచాయి. ఒడిశా, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, హరియాణాల సగటు వార్షిక వృద్ధి ఇదే కాలంలో తటస్థంగా ఉంది. ఉత్తరప్రదేశ్, అసోం, మధ్యప్రదేశ్‌లో అల్పవృద్ధి నమోదైంది. బిహార్‌లో సగటు వార్షిక వృద్ధి రుణాత్మకంగా నమోదైంది.

### ప్రాంతీయ ప్రణాళిక

- ఒక భౌగోళిక సరిహద్దు ప్రాంత ఆర్థిక, సాంఘిక, భౌతిక వనరుల సమీకృత నిర్వహణను ప్రాంతీయ ప్రణాళికగా నిర్వచించవచ్చు. ఆధునిక యుగంలో ఉప ప్రాంతాలు, మెట్రోపాలిటన్ నగరాలకు సంబంధించి ప్రాంతీయ ప్రణాళికలు అమలయ్యాయి. పట్టణ ప్రాంతాలు, బహిర్గత ప్రాంతాలైన నదీ తీరాలకు సంబంధించి సమగ్ర ప్రాంతీయ ప్రణాళికలను రూపొందించడం జరిగింది. ఆయా ప్రాంతాల్లో వనరులను సద్వినియోగపరచుకోవడంలో ప్రభుత్వాల చిత్తశుద్ధి కొరవడినందువల్ల ప్రాంతీయ ప్రణాళికల లక్ష్యాలు, విధానాలు, ప్రాజెక్టుల సాధనలో అవరోధాలు ఎదురయ్యాయి. మరోవైపు ప్రాంతీయ ప్రణాళికల అమలు ద్వారా గ్రేటర్ లండన్, పారిస్, న్యూయార్క్, చికాగోలు గతంతో పోల్చినప్పుడు అభివృద్ధి సాధించాయి.
- లక్ష్యాలను రూపొందించుకోవడం, పరిశోధన, సర్వేలు, ప్రణాళికా రచన, ప్రణాళిక అనుమతి-అమలు, సమీక్ష అనేవి ప్రాంతీయ ప్రణాళికలో వివిధ దశలుగా పేర్కొనొచ్చు. స్థూల స్థాయిలో ప్రాంతీయ ప్రణాళికలు.. జాతీయ ప్రణాళికల లక్ష్యాలనే కలిగి ఉంటాయి. ప్రాంతీయ రంగాల ప్రణాళికకు అనుసంధానించిన స్థాయిలో ఈ ప్రణాళిక ఉంటుంది. జిల్లాల గ్రూపులు లేదా అభివృద్ధి బ్లాకుల ఆధారంగా రాష్ట్రంలోని ప్రాంతీయ ప్రణాళిక రచనను Mesoregionగా భావిస్తాం. గ్రామాల గ్రూపులు కలిగిన ఒక జిల్లా, ఒక మండలం, ఒక అభివృద్ధి బ్లాకును సూక్ష్మ-ప్రాంతంగా భావించి.. ప్రాంతీయ ప్రణాళికను రూపొందించొచ్చు. జాతీయ ప్రణాళికల్లో ప్రత్యేకీకరణకు సంబంధించి ప్రాంతీయ నియమావళికి అనుగుణంగా ప్రత్యేక ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలి.
- పట్టణాభివృద్ధిలో ఎదురవుతున్న సమస్యల కారణంగా.. భారత్‌లో ప్రాంతీయ ప్రణాళికా రచనకు ప్రాధాన్యం పెరిగింది. ఢిల్లీ సమస్యలను నివారించడానికి భారత ప్రభుత్వం 'టౌన్ ప్లానింగ్ ఆర్గనైజేషన్'ను 1995, నవంబర్ 1న ఏర్పాటు చేసింది. తద్వారా వృద్ధి, విస్తరణకు సంబంధించి మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరిగింది. ఈ మాస్టర్ ప్లాన్‌ను 'నగర-సంబంధిత ప్రాంతీయ ప్రణాళిక'గా భావించారు. 'ది కలకత్తా మెట్రో పాలిటన్ ప్లానింగ్ ఆర్గనైజేషన్'ను 1961లో ఏర్పాటు చేయగా.. 1966లో బేసిక్ డెవలప్‌మెంట్ ప్లాన్ రూపొందించారు.
- ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు సాంఘిక, ఆర్థిక, భౌతిక అభివృద్ధిలో ప్రాదేశిక అసమానతలను నివారించడానికి కృషి చేస్తున్నాయి. ఆయా దేశాల్లో ప్రాదేశిక అసమానతలు పెరగడానికి సంస్థాపరమైన లోపాలతోపాటు ప్రభుత్వ చర్యలు తదనుగుణంగా లేకపోవడం కారణమైంది. తద్వారా ఆయా దేశాల్లో వృద్ధికి సంబంధించి ప్రాంతాల మధ్య అసమానతలు పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో అడుగంటిన జీవన స్థితిగతులు, అధిక పేదరికం, సేవలు, అవస్థాపనా సౌకర్యాల కొరత లాంటి లక్షణాలు కన్పిస్తున్నాయి. కొన్ని దేశాలు 'ప్రాంతీయ ప్రణాళికా దృక్పథాన్ని' ఎంచుకోవడం ద్వారా ప్రాదేశిక అసమానతలను తగ్గించుకోగలిగాయి. తద్వారా ఆయా ప్రాంతాల్లో వనరుల అభిలషణీయ వినియోగం, మానవ కార్యకలాపాల వినియోగ ప్రక్రియలో మార్పులు సంభవించాయి. ఆస్ట్రేలియా, చైనా, జర్మనీ, ఇండియా, జపాన్, దక్షిణాఫ్రికా, బ్రిటన్‌లు ప్రాంతీయ ప్రణాళికా దృక్పథాన్ని అవలంబించి ప్రాదేశిక అసమానతలను తగ్గించుకోగలిగాయి. భారత్‌లో స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో ప్రాదేశిక అసమానతలు, సాంఘిక-ఆర్థిక అసమానతలు అధికంగా ఉన్నాయి. వీటిని నివారించడానికి ప్రభుత్వం 'ప్రాంతీయ ప్రణాళిక, అభివృద్ధి దృక్పథం'ను ఎంచుకుంది. అభివృద్ధి కోసం అనేక ప్రాంతాలను గుర్తించి ప్రాంతీయ ప్రణాళికలను రూపొందించింది. ప్రస్తుతం దేశంలో కొన్ని రాష్ట్రాలు ప్రాంతీయ లేదా జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాయి. కానీ ఆయా ప్రణాళికల అమలు, ప్రభావం చాలా తక్కువగా ఉండటాన్ని గమనించవచ్చు. ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికల్లో ఉన్న లోపాలను తొలగించడంపై దృష్టి సారించాలి.
- 1972లో ఈశాన్య రాష్ట్రాల కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినప్పటికీ.. తగిన విధంగా ప్రాంతీయ ప్రణాళికలు అమలు కాలేదు. ఆయా రాష్ట్రాల్లో చిన్న, మధ్య తరహా పట్టణాలు అధికంగా ఉన్నప్పటికీ.. వనరుల పంపిణీలో నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

### పరిమితులు-సక్రమ అమలుకు చర్యలు

- భారత్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంత లక్షణాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. సంబంధిత ప్రభుత్వ సంస్థలు ఆయా మార్పులను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలకు ఉపక్రమించాలి. ప్రపంచవ్యాప్తంగా ప్రాంతీయ ప్రణాళికలను అమలుపరిచిన అనేక ప్రభుత్వాలు.. సాంఘిక, ఆర్థిక, భౌతిక అభివృద్ధిలో ప్రాదేశిక అసమానతలను తగ్గించుకోగలిగాయి. భారత్‌లో ప్రాంతీయ ప్రణాళికల అమలు మొదటి దశలో ధనాత్మక ఫలితాలు కనిపించాయి. కానీ కాలానుగుణంగా ప్రాంతీయ ప్రణాళికలు ప్రాచుర్యాన్ని కోల్పోయాయి. రాష్ట్రస్థాయిలో ప్రణాళికల రూపకల్పనకు రాష్ట్రాల ప్రణాళికా మండళ్లలో నైపుణ్యత కొరవడింది. వివిధ శాఖల పరంగా రంగాల వారీ అవసరాల కోసం రాష్ట్ర ప్రణాళికా మండళ్ల పరిమితమయ్యాయి.
- పరిపాలనా అధికారులకు అధికారాలనివ్వడంతోపాటు రాజకీయ జోక్యాన్ని తగ్గిస్తూ నైపుణ్యత కలిగిన వ్యక్తులను ప్రణాళికా మండలిలో కలిగి ఉన్నప్పుడే... రాష్ట్రాల స్థాయిలో ప్రాంతీయ ప్రణాళికలు, లక్ష్యాల సాధనలో విజయవంతమవుతాయి. జిల్లా, బ్లాక్ స్థాయిలో స్థానిక చొరవ కొరవడుతున్నది. స్థానిక, వ్యక్తిగత ప్రయోజనాలు నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్‌లో నిమగ్నమైన అధికారులకు తగిన శిక్షణ అవసరం. ప్రాంతీయ వనరుల అభిలషణీయ అభివృద్ధి ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగవంతమయ్యే విధంగా ప్రాంతీయ ప్రణాళికల రూపకల్పన జరగాలి.
- అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో దీర్ఘకాల విధాన నిర్ణయాలతో పోల్చినప్పుడు స్వల్పకాల విధాన నిర్ణయాల అమలుకు ప్రాధాన్యత అధికంగా ఉండటం.. వివిధ వర్గాల ప్రజల మధ్య ఆదాయ అసమానతల పెరుగుదల.. లక్ష్యాల సాధన లేదా భవిష్యత్తు విజన్‌పై ప్రభుత్వాలు దృష్టి సారించకపోవడం లాంటి అంశాలు ప్రాంతీయ ప్రణాళికలు విజయవంతం కాకపోవడానికి కారణాలుగా నిలిచాయి. సమర్థవంతమైన ప్రాంతీయ ప్రణాళిక అమలుకు అవరోధాలను తొలగించడానికి 'గణాంకాల నిర్వహణ, పర్యవేక్షణ'కు సంబంధించి శక్తివంతమైన నూతన సాధనాలైన భౌగోళిక సమాచార వ్యవస్థలు, కంప్యూటర్ ఆధారిత Visioning Simulation ఉపకరిస్తుంది.
- ప్రాదేశిక నాణ్యత(జీవన నాణ్యత, ఆరోగ్యవంతమైన పర్యావరణం, పర్యావరణ నాణ్యత, వివిధ సేవలు, అవస్థాపనా సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం)కు సుస్థిరాభివృద్ధిని ప్రధాన కారకంగా భావించాలి. ఆధునిక ప్రణాళికను ఆధునిక గవర్నెన్స్ నుంచి వేరుగా భావించకూడదు. ప్రాదేశిక అభివృద్ధిపై ప్రణాళికా రచన పూర్తి ప్రభావం చూపించే విధంగా ఉండాలి. లక్ష్యాలు, ప్రాథమిక ఆలోచనలకు సంబంధించి ఏ విధమైన ఒప్పందం లేనిదే ప్రాదేశిక ప్రణాళికలను సమర్థవంతంగా అమలు పరచలేం. స్థానిక లేదా ప్రాంతీయ ప్రయోజనాన్ని దేశ సంబంధిత ప్రయోజనంలో భాగమైనందున ప్రతి సంబంధిత ప్రయోజనం పరిమాణం, వ్యాప్తిని గుర్తించాల్సి ఉంటుంది. విద్య పరమైన అంశాన్ని వివిధ స్థాయిల్లో పాఠశాల సౌకర్యాల నెట్‌వర్క్ పరిధిలోను, గృహ సమస్యలను ప్రాంతీయ హౌసింగ్ మార్కెట్‌లో భాగంగాను, ఉపాధిని శ్రమ శక్తి ప్రాంతీయ మార్కెట్ సంబంధిత అంశంగాను, ఆర్థిక కార్యకలాపాలను సంబంధిత క్లస్టర్ ఆర్థిక కార్యకలాపాల్లో భాగంగాను పరిగణించాలి.
- అవకాశాలకు అనుగుణంగా 'ప్రాదేశిక అభివృద్ధి విజన్'ను రూపొందించేటప్పుడు భవిష్యత్తు అభివృద్ధి, ఆర్థిక కార్యకలాపాలు, సహజ, సాంస్కృతిక విలువలను దృష్టిలో ఉంచుకొని ప్రాంత సరిహద్దును నిర్ణయించుకొని ప్రాంతీయ ప్రణాళికను అమలు పరచాలి. ఆయా ప్రాంతాల భవిష్యత్తు దృష్ట్యా ఉమ్మడి భావన కోసం ప్రయత్నిస్తున్నప్పుడు ఆధునిక గవర్నెన్స్‌ను పాటించాలి. రాష్ట్రస్థాయిలో ప్రస్తుతమున్న ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌ను విస్తరించాలి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి ప్రణాళిక మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలోని ఉప ప్రాంతాలకు సంబంధించి రాష్ట్ర భౌతిక అభివృద్ధి ప్రణాళికను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక శాఖ బ్లూప్రింట్ రూపొందించాలి.
- గ్రామీణ-పట్టణ ప్రాంత సంబంధాలను పటిష్టపరచడంలో.. చిన్న పట్టణాల పాత్ర విషయంలో దక్షిణాఫ్రికా విజయవంతం కావడాన్ని భారత్ గుర్తించాలి. దక్షిణాఫ్రికాలోని చిన్న పట్టణాలు వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు వస్తు సేవల పంపిణీకి కేంద్రాలు గాను, గ్రామీణ ప్రాంతం నుంచి వలస వచ్చిన వారికి తగిన మౌలిక సౌకర్యాలు కల్పించడంలో విజయవంతమయ్యాయి. రాజకీయ చిత్తశుద్ధి, ప్రణాళికను సమన్వయ పరచడానికి సంస్థాపరమైన ఏర్పాట్లు, క్లస్టర్ దృక్పథాన్ని అవలంభించడం ద్వారా ప్రాదేశిక ప్రణాళిక, భూమి వినియోగ నిర్వహణకు భారత్ ప్రాధాన్యమివ్వాలి!!



డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్, హైదరాబాద్

సాక్షి స్పోర్ట్స్
గురువారం
31-10-2019

## కోల్‌కతాను గెలిపించిన విలియమ్స్



ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ అట్లెటికో డి కోల్‌కతా జట్టు రెండో విజయం నమోదు చేసింది. చెన్నైయిన్ ఎఫ్‌సీతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 1–0 గోల్‌తో గెలిచింది. ఆట 48వ నిమిషంలో డేవిడ్ విలియమ్స్ గోల్ చేసి కోల్‌కతాను ఆధిక్యంలో నిలిపాడు. విలియమ్స్ చేసిన గోల్‌తో ఐఎస్‌ఎల్ టోర్నీ చరిత్రలో 1000 గోల్స్ పూర్తయ్యాయి. స్కోరును సమం చేసేందుకు చెన్నైయిన్ విఫల యత్నం చేసినా ఫలితం లేకపోయింది. నేడు జరిగే మ్యాచ్‌లో ముంబైతో ఒడిశా ఫుట్‌బాల్ క్లబ్ తలపడుతుంది.

## రవీందర్‌కు రజతం



**బుడాపెస్ట్ (హంగేరి):** ప్రపంచ అండర్–23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ రవీందర్ రజత పతకంతో సంతృప్తి పడ్డాడు. బుధవారం జరిగిన పురుషుల 61 కేజీల ఫ్రీస్టయిల్ ఫైనల్లో రవీందర్ 3–5 పాయింట్ల తేడాతో ఉలుక్‌బెక్ జోల్‌డోష్‌బెకోవ్ (కిర్గిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. మూడు నిమిషాల తొలి రౌండ్ ముగిశాక 1–0తో ఆధిక్యంలో నిలిచిన రవీందర్ మరో మూడు నిమిషాల నిడివిగల రెండో రౌండ్‌లో మాత్రం తడబడ్డాడు. బౌట్ ముగియడానికి రెండు నిమిషాల సమయం ఉండగా ఉలుక్‌బెక్ ఇంజ్యూరీ టైమ్ తీసుకున్నాడు. ఆ తర్వాత ఒక్కసారిగా ఉలుక్‌బెక్ రెండు మూమెంట్స్‌తో నాలుగు పాయింట్లు సంపాదించి 4–1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. చివరి సెకన్లలో రవీందర్ తేరుకున్నా అప్పటికే ఆలస్యమైపోయింది. ఇదే టోర్నీ మహిళల 50 కేజీల విభాగంలో భారత రెజ్లర్ జ్యోతి కాంస్య పతకం కోసం పోటీపడనుంది. సెమీఫైనల్లో జ్యోతి 4–15తో కికా కగాటా (జపాన్) చేతిలో ఓడిపోయింది.

**5**
ప్రపంచ అండర్–23 రెజ్లింగ్ టోర్నీలో భారత్‌కు ఓవరాల్‌గా లభించిన పతకాలు. ఈ ఐదూ రజతాలే కావడం గమనార్హం. గతంలో బజరంగ్, వినోద్ కుమార్, రీతూ ఫోగాట్ (2017లో), రవి దహియా (2018లో) రజత పతకాలు నెగ్గారు.

## ఇంగ్లండ్ మహిళల జట్టుకు తొలి మహిళా హెడ్ కోచ్

ఆసీస్ మాజీ ప్లేయర్
లీసా కెయిట్లీని నియమించిన ఈసీబీ



**లండన్:** ఇంగ్లండ్ మహిళల జట్టుకు తొలిసారి మహిళా క్రికెటర్‌నే హెడ్ కోచ్‌గా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నియమించింది. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ లీసా కెయిట్లీకి ఈ అవకాశం దక్కింది. 48 ఏళ్ల లీసా 9 టెస్టుల్లో, 48 వన్డేల్లో ఆసీస్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఇప్పటి వరకు మార్క్ రాబిన్సన్ ఇంగ్లండ్ మహిళల జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. అయితే యాషెస్ సిరీస్‌లో ఓటమి తర్వాత ఆయన తన పదవికి రాజీనామా చేశారు. వచ్చే జనవరిలో లీసా తన బాధ్యతలు స్వీకరిస్తుంది. ప్రస్తుతం ఇంగ్లండ్ మహిళల వన్డే జట్టు వరల్డ్ చాంపియన్‌గా ఉండగా... టి20 ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరింది. ప్రస్తుతం లీసా బిగ్ బాష్ టి20 లీగ్‌లో పెర్త్ స్కార్చర్స్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తోంది.

## పసిడికి పంచ్ దూరంలో...

- ఫైనల్లో శివ థాపా, ఆశిష్, పూజా రాణి
- సెమీస్‌లో ఓడి కాంస్యం నెగ్గిన నిఖత్ జరీన్


శివ థాపా

**న్యూఢిల్లీ:** టోక్యో ఒలింపిక్స్ టెస్ట్ ఈవెంట్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో రెండో రోజు భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. నిఖత్, సిమ్రన్‌జిత్, సుమీత్ సాంగ్వాన్, వహ్లీమ్‌పుయా సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలతో సరిపెట్టుకోగా... ముగ్గురు బాక్సర్లు శివ థాపా (63 కేజీలు), ఆశిష్ (69 కేజీలు), పూజా రాణి (75 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లి పసిడి పతకాలకు విజయం దూరంలో నిలిచారు. మహిళల 51 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ సెమీఫైనల్లో సనా కవానో (జపాన్) చేతిలో... 60 కేజీల విభాగంలో సిమ్రన్‌జిత్ కౌర్ కజకిస్తాన్ బాక్సర్ రిమ్మా వొలోసెంకో చేతిలో ఓడిపోయారు. పురుషుల విభాగం 91 కేజీల సెమీఫైనల్స్‌లో ఐబెక్ ఒరాల్‌బే (కజకిస్తాన్) చేతిలో సుమీత్ సాంగ్వాన్... 75 కేజీల విభాగంలో యుటో మోరివాకా (జపాన్) చేతిలో వహ్లీమ్‌పుయా ఓటమి చవిచూశారు. ఇతర సెమీఫైనల్స్‌లో దైసుకె నరిమత్సు (జపాన్)పై శివ థాపా; బీట్రిజ్ సోరెస్ (బ్రెజిల్)పై పూజా రాణి; హిరోయాకి కిన్‌జియో (జపాన్)పై ఆశిష్ గెలిచి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించారు.

# పింక్ పదనిసలు...

తొలి 'గులాబీ' టెస్టు మ్యాచ్‌కు రంగం సిద్ధం
నిర్వహణలో ఎదురు కానున్న కొత్త సవాళ్లు
పరిష్కరించే ప్రయత్నంలో బీసీసీఐ



**భారత క్రికెట్ జట్టులో కీలక సభ్యులకు ప్రాక్టీస్ లేదు... బంగ్లాదేశ్ ఇప్పటి వరకు ఒక్క టెస్టు కూడా ఆడలేదు... తొలి టెస్టు ముగిసిన తర్వాత రెండో టెస్టు కోసం సన్నద్ధమయ్యేందుకు ఉన్న సమయం కూడా చాలా తక్కువ. అయినా సరే మార్పు మంచిదే అంటూ తొలి డే అండ్ నైట్ టెస్టు మ్యాచ్ నిర్వహణకు బీసీసీఐ సిద్ధమైపోయింది. ఎలాగైనా తన హయాంలో ఈ పని పూర్తి చేయాలని భావించిన సౌరవ్ గంగూలీ తీసుకొన్న చొరవతో కోల్‌కతా టెస్టుకు గులాబీ హంగులు చేకూరబోతున్నాయి. అయితే రెగ్యులర్ డే టెస్టు మ్యాచ్‌కు భిన్నం కాబట్టి సహజంగానే నిర్వహణలో కొత్త సమస్యలు కూడా ఖాయం. బంతి మన్నిక మొదలు పిచ్, అవుట్ ఫీల్డ్, వాతావరణం, లైటింగ్... ఇలా అన్నీ మ్యాచ్‌పై ప్రభావం చూపిస్తాయి. టీమిండియా నవంబర్ 22 నుంచి తొలి డే అండ్ నైట్ మ్యాచ్ ఆడబోతున్న నేపథ్యంలో 'పింక్ టెస్టు'కు ఎదురు కాబోయే సవాళ్లపై ప్రత్యేక కథనం.**

### మంచు ప్రభావం



ఇప్పటి వరకు 11 డే అండ్ నైట్ టెస్టు మ్యాచ్‌లు నిర్వహించినా... అందులో ఒక్కటి కూడా శీతాకాలపు సీజన్‌లో జరగలేదు. 9 మ్యాచ్‌లు వేసవిలో జరగ్గా, మరో 2 మ్యాచ్‌లు అసలు శీతల వాతావరణమే ఉండని దుబాయ్‌లో నిర్వహించారు. భారత్‌లో ఇప్పటి వరకు జరిగిన 12 ఫస్ట్‌క్లాస్ డే అండ్ నైట్ మ్యాచ్‌లన్నీ పెద్దగా మంచు ప్రభావం కనిపించని ఆగస్టు, సెప్టెంబర్‌లలోనే నిర్వహించారు. నవంబర్ నెలలో భారత్‌లో మ్యాచ్‌లు అంటే రాత్రి పూట ఎప్పుడైనా మంచు ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. బంతిపై బౌలర్లకు పట్టు చిక్కకపోవడం, బ్యాట్స్‌మెన్ పని సులువు కావడం వన్డేల్లోనే తరచుగా కనిపించే దృశ్యం. ఎక్కువ ఓవర్లు వేయాల్సి వచ్చే టెస్టులో బౌలర్లు ఏం చేయగలరనేది పెద్ద సమస్య. అయితే దీనికి తమ వద్ద పరిష్కారం ఉందని గంగూలీ చెబుతున్నాడు. 'డ్యూ ట్రీట్‌మెంట్ స్ప్రే'ను వాడి మంచు ప్రభావం తగ్గిస్తామని, ఎలాంటి ఇబ్బందీ ఉండదని అతను అన్నాడు. సీనియర్ పిచ్ క్యురేటర్ దల్జీత్ సింగ్ మరో సూచన ఇచ్చాడు. 'పిచ్‌పై కాస్త ఎక్కువ పచ్చికను ఉంచితే బంతి ఎక్కువగా మన్నుతుంది. అవుట్‌ఫీల్డ్‌పై గడ్డిని తక్కువగా ఉంచితే మంచు ప్రభావం కూడా తగ్గుతుంది' అని ఆయన అన్నారు.

### మ్యాచ్ సమయం....



ప్రస్తుతానికి అధికారికంగా మ్యాచ్ నిర్వహణా సమయాన్ని బోర్డు ప్రకటించలేదు. అయితే మంచు ప్రభావాన్ని కూడా దృష్టిలో పెట్టుకుంటూ మధ్యాహ్నం 1.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కావచ్చని తెలుస్తోంది. అదే జరిగితే మ్యాచ్ రాత్రి 8.30 గంటల వరకు సాగుతుంది. అంటే దాదాపు రెండు సెషన్లు డే గానే సాగుతాయి. చివరి సెషన్ మాత్రమే పూర్తిగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతుంది. కానీ అలాంటప్పుడు డే అండ్ నైట్ టెస్టు ఉద్దేశం నెరవేరదు. ప్రేక్షకులకు డే అండ్ నైట్ టెస్టు అనుభూతి దక్కాలంటే ఐపీఎల్ మ్యాచ్ ముగిసే సమయానికే (దాదాపు రా.11 గంటలు) టెస్టు కూడా ముగిసే విధంగా సమయం నిర్ధారిస్తే బాగుంటుందనేది సూచన.

### పింక్ బంతుల నాణ్యత...

ఎస్‌జీ పింక్ బంతులతో జరగబోతున్న మొదటి టెస్టు మ్యాచ్ ఇది. గతంలో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌ల సమయంలో ఆటగాళ్లు బంతులపై కొంత అసంతృప్తిని ప్రదర్శించారు. అప్పుడు కూకాబుర్రా బంతులు వాడారు. మ్యాచ్ ప్రారంభమైనప్పుడు, ఫ్లడ్‌లైట్లు వేసినప్పుడు ఇబ్బంది లేకున్నా ఈ రెండింటి మధ్య (దాదాపు సూర్యాస్తమయం సమయంలో) బంతి సరిగా కనిపించడం లేదని, నారింజ రంగులో ఉంటోందని బ్యాట్స్‌మెన్ ఫిర్యాదు చేశారు. 10 ఓవర్లు దాటితే ఏమాత్రం ప్రభావం చూపడం లేదని పేసర్లు చెప్పగా, బంతి అసలు టర్న్ కావడం లేదని స్పిన్నర్లు మొరపెట్టుకున్నారు. రివర్స్ స్వింగ్ అయితే ఏమాత్రం పని చేయలేదు. ఇప్పుడు ఎస్‌జీ బంతులకు బోర్డు ఏమైనా ప్రత్యేక సూచనలు చేసి బంతులు తయారు చేయించిందా చూడాలి.



### ఆటగాళ్ల అనుభవం...



ప్రస్తుత భారత టెస్టు జట్టు సభ్యుల్లో పుజారా, మయాంక్, రిషభ్ పంత్, కుల్దీప్‌లకు దులీప్ ట్రోఫీలో గులాబీ బంతితో డే అండ్ నైట్ మ్యాచ్ ఆడిన అనుభవం ఉంది. 2016 ఫైనల్లో పుజారా డబుల్ సెంచరీ కూడా చేశాడు. షమీ, సాహా 'క్యాబ్' క్లబ్ మ్యాచ్‌లో ఈ బంతితో ఆడారు. మిగతా ఆటగాళ్లందరికీ పింక్ బాల్ పూర్తిగా కొత్త. బంగ్లాదేశ్‌లోనైతే ఒకే ఒక్క ఫస్ట్ క్లాస్ డే అండ్ నైట్ జరిగింది. అందులో ప్రధాన ఆటగాళ్లెవరూ లేరు. కాబట్టి అనుభవంపరంగా చూస్తే భారత్‌దే పైచేయిగా చెప్పవచ్చు.

### ప్రేక్షకుల ఆదరణ పెరుగుతుందా!

ఫ్లడ్‌లైట్లలో ఆడించగానే టెస్టులకు జనం పోటెత్తుతారా అనేది సందేహమే. దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ప్రేక్షకుల నుంచి పేలవ స్పందన లభించింది. దాంతో కోహ్లి కూడా కొంత అసహనానికి గురై చాలా ఏళ్లుగా టెస్టు క్రికెట్‌ను ఆదరిస్తున్న ఐదు ప్రధాన వేదికలకే మ్యాచ్‌లను పరిమితం చేయాలని సూచించాడు. స్టేడియాలు దూరంగా ఉండటం, సౌకర్యాలు లేకపోవడం కూడా దీనికి కారణం కాగా... గంగూలీ మాత్రం విభేదిస్తూ ఐపీఎల్ మ్యాచ్‌లకు రావడం లేదా అని ప్రశ్నించాడు. డే అండ్ నైట్ టెస్టులకు ఆకర్షణ ఉంటుందని మొదటి నుంచి చెబుతూ వచ్చిన అతను కోల్‌కతా పింక్ టెస్టు కోసం కోహ్లిని కూడా ఒప్పించాడు. అయితే ఈడెన్ గార్డెన్స్‌లో మొదటి నుంచి టెస్టులకు మంచి ఆదరణే దక్కుతోంది. ఇప్పుడు పింక్ టెస్టుకు ఇంకా పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు రావడంలో ఆశ్చర్యం లేదు. కాబట్టి దీనిని టెస్టుల మనుగడకు ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఏదైనా కారణం చేత అనుకున్న స్థాయిలో జనాలు రాలేదా అంటే ఇక మన దేశంలో టెస్టులకు రోజులు దగ్గర పడినట్లే అనుకోవాలి!

### 72 బంతులకు ఆర్డర్...

కోల్‌కతా టెస్టు కోసం బీసీసీఐ ఎస్‌జీ కంపెనీకి 72 గులాబీ బంతుల కోసం ఆర్డర్ ఇచ్చింది. కొన్నాళ్లుగా ఎస్‌జీ ఎరుపు బంతుల విషయంలోనే భారత క్రికెటర్లు అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో మరింత నాణ్యతతో పింక్ బంతులను తయారు చేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఎరుపు బంతితో పోలిస్తే గులాబీ బంతులకు తొందరగా దుమ్ము అంటుకుంటుంది. వేగంగా రంగు వెలిసిపోయి నల్లగా మారిపోతున్నాయనేది ప్రధాన ఫిర్యాదు. దీనిని సరిదిద్దుతూ మంచి బంతులు అందిస్తామని ఎస్‌జీ చెబుతోంది. మొత్తంగా ఎరుపు, పింక్ మధ్య పెద్దగా తేడా ఏమీ ఉండదు. ఎరుపు బంతిపై సీమ్ తెలుపు రంగులో ఉంటే పింక్ బాల్‌పై బాగా కనిపించేందుకు నలుపు సీమ్ వాడతారు. పింక్ బంతి కళ కోల్పోయే అవకాశం ఉంటుంది కాబట్టి దానిపై గ్రీజ్ కూడా పూయరు.

## టి20 ప్రపంచకప్‌కు స్కాట్లాండ్, ఒమన్ అర్హత



**దుబాయ్:** వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టి20 ప్రపంచ కప్‌కు స్కాట్లాండ్, ఒమన్ జట్లు అర్హత సాధించాయి. బుధవారం జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీ ప్లే ఆఫ్ మ్యాచ్‌ల్లో స్కాట్లాండ్ 90 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)పై... ఒమన్ 12 పరుగుల తేడాతో హాంకాంగ్‌పై గెలిచాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 198 పరుగులు చేసింది. మున్సే (43 బంతుల్లో 65; 2 ఫోర్లు, 5 సిక్సర్లు), బెరింగ్టన్ (18 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) చెలరేగారు. అనంతరం యూఏఈ 18.3 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. రమీజ్ షహజాద్ (28 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్సర్లు)దే అత్యధిక స్కోరు. వాట్, షరీఫ్ చెరో 3 వికెట్లు తీశారు. స్కాట్లాండ్ గతంలో 2007, 2009, 2016 టి20 ప్రపంచకప్‌లలో ఆడింది. హాంకాంగ్‌తో మ్యాచ్‌లో తొలుత ఒమన్ జట్టు 7 వికెట్లకు 134 పరుగులు చేసింది. అనంతరం హాంకాంగ్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 122 పరుగులు చేసి ఓడిపోయింది.

## సాయి ఉత్తేజిత, జయరామ్ ఓటమి

**న్యూఢిల్లీ:** మకావు ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులకు నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల సింగిల్స్ ఆంధ్రప్రదేశ్ అమ్మాయి చుక్కా సాయి ఉత్తేజిత రావు, పురుషుల సింగిల్స్‌లో అజయ్ జయరామ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మకావులో బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో సాయి ఉత్తేజిత 19–21, 12–21తో ఆరో సీడ్ కాయ్ యాన్ యాన్ (చైనా) చేతిలో... జయరామ్ 16–21, 16–21తో సన్ ఫె జియాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో జక్కంపూడి మేఘన–పూర్విషా రామ్ (భారత్) జోడీ 17–21, 19–21తో లిన్ ఫాంగ్ లింగ్–జిన్ రు జౌ (చైనా) జంట చేతిలో... పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో వసంత కుమార్ హనుమయ్య–ఆశిత్ సూర్య (భారత్) ద్వయం 14–21, 14–21తో లిన్ చియా యు–యాంగ్ మింగ్ త్సె (చైనీస్ తైపీ) జోడీ చేతిలో ఓడిపోయాయి.


ఉత్తేజిత

## 'మాకు ముందుగా ఏమీ తెలీదు'

### షకీబ్ ఘటనపై బంగ్లా బోర్డు వివరణ


నజ్ముల్ హసన్   షకీబ్

**ఢాకా:** షకీబ్ అల్ హసన్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) రెండేళ్ల నిషేధం విధించడం వెనక బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) కుట్ర ఉన్నదని విమర్శలు వచ్చిన నేపథ్యంలో బీసీబీ వివరణ ఇచ్చింది. గత వారం ఆటగాళ్ల కాంట్రాక్ట్‌లకు సంబంధించి షకీబ్ తిరుగుబాటు చేయగా, సమ్మె ముగిసిన తర్వాత కూడా ఆ విభేదాలు కొనసాగుతూ వచ్చాయి. దాంతో షకీబ్‌ను బోర్డు కావాలనే ఇరికించిందని పలువురు విమర్శలకు దిగారు. 'దీనిపై నేను స్పష్టత ఇవ్వదల్చుకున్నాను. ఫిక్సింగ్‌కు సంబంధించి జనవరి నుంచి సాగిన దర్యాప్తుతో నాకు గానీ మా బోర్డుకు కానీ ఎలాంటి సంబంధం లేదు. స్వతంత్ర సంస్థ అయిన అవినీతి నిరోధక విభాగం స్వయంగా షకీబ్‌తో మాట్లాడింది. ఆటగాళ్ల సమ్మెకు సంబంధించి చర్చలు ముగిసిన తర్వాత రెండు, మూడు రోజుల క్రితం మాత్రమే అతను నాకు ఈ విషయం తెలియజేశాడు. ముందుగా చెప్పలేదని కోపం నాకూ ఉంది. కానీ అతను ఐసీసీకి తగిన విధంగా సహకరించాడు. అలాంటి కీలక ఆటగాడి సేవలు కోల్పోవడం దురదృష్టకరం' అని బీసీబీ అధ్యక్షుడు నజ్ముల్ హసన్ వ్యాఖ్యానించారు. మరోవైపు షకీబ్ నిషేధంపై ఆగ్రహం చెందిన బంగ్లాదేశ్ అభిమానులు ఆ దేశంలో వేర్వేరు చోట్ల నిరసనలకు దిగారు.

**భారత్ చేరిన బంగ్లా జట్టు...** టి20 సిరీస్‌లో పాల్గొనే బంగ్లాదేశ్ జట్టు బుధవారం రాజధాని న్యూఢిల్లీకి చేరుకుంది. షకీబ్‌లాంటి ఆటగాడు లేని లోటు తీర్చలేనిదని, అయితే మరింత పట్టుదలగా ఆడి మెరుగైన ప్రదర్శన కనబర్చేందుకు ప్రయత్నిస్తామని జట్టు టి20 కెప్టెన్ మహ్ముదుల్లా అన్నాడు. ప్రస్తుతానికి ఒక ఆటగాడు గాయమై సిరీస్‌కు దూరమైతే ఎలా ఉంటుందో అదే తరహాలో షకీబ్ గురించి భావిస్తున్నట్లు అతను చెప్పాడు. భారత్‌పై తమ రికార్డు పేలవంగా ఉందని అంగీకరించిన మహ్ముదుల్లా... సంచలనం సృష్టించగల సత్తా బంగ్లా జట్టుకు ఉందని అభిప్రాయపడ్డాడు. నవంబర్ 3, 7, 10 తేదీల్లో భారత్, బంగ్లాదేశ్ మధ్య మూడు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి.



## ఆడుతూ... పాడుతూ...

- రెండో టి20లో శ్రీలంకపై 9 వికెట్లతో ఆస్ట్రేలియా ఘనవిజయం
- వార్నర్, స్మిత్ అజేయ అర్ధ సెంచరీలు



**బ్రిస్బేన్:** తొలి టి20 మ్యాచ్‌లో పరుగుల పరంగా తమ ఖాతాలో అతి పెద్ద విజయం నమోదు చేసుకున్న ఆస్ట్రేలియా... శ్రీలంకతో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. తొమ్మిది వికెట్లతో ఘన విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 19 ఓవర్లలో 117 పరుగులకే కుప్పకూలింది. కుశాల్ పెరీరా (19 బంతుల్లో 27; 2 ఫోర్లు, సిక్స్), గుణతిలక (22 బంతుల్లో 21; 2 ఫోర్లు, సిక్స్) కాస్త నయమనిపించారు. ఆసీస్ బౌలర్లలో స్టాన్‌లేక్ (2/23), కమిన్స్ (2/29), అగర్ (2/27), ఆడమ్ జంపా (2/20) రెండేసి వికెట్లు తీసి శ్రీలంక పతనాన్ని శాసించారు. 118 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 13 ఓవర్లలో వికెట్ నష్టపోయి అధిగమించింది. కెప్టెన్, ఓపెనర్ ఆరోన్ ఫించ్ (0) తాను ఎదుర్కొన్న తొలి బంతికే మలింగ బౌలింగ్‌లో డకౌట్‌గా వెనుదిరిగాడు. అయితే వార్నర్ (41 బంతుల్లో 60 నాటౌట్; 9 ఫోర్లు), స్మిత్ (36 బంతుల్లో 53 నాటౌట్; 6 ఫోర్లు) ఎక్కడా తగ్గకుండా దూకుడుగా ఆడారు. రెండో వికెట్‌కు అజేయంగా 117 పరుగులు జోడించారు. వానిందు హసరంగ వేసిన ఐదో ఓవర్లో వార్నర్ నాలుగు ఫోర్లు బాదాడు. వార్నర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మూడో టి20 మ్యాచ్ శుక్రవారం మెల్‌బోర్న్‌లో జరుగుతుంది.

epaper.sakshi.com

సాక్షి బిజినెస్
గురువారం
31-10-2019
WWW.SAKSHIBUSINESS.COM

**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 220 ▲ | 57 ▲ |
| 40,052 | 11,844 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (బుధ రెండు రాత్రి 11.30గం.లకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,265 | ▼ | 12 |
| డోజోన్స్ | 27,090 | ▲ | 19 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,330 | ▲ | 25 |
| డాక్స్ | 12,910 | ▼ | 29 |
| షాంఘై | 2,939 | ▼ | 15 |
| నికాయ్ | 22,843 | ▼ | 131 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.20 | 71.84 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 89.75 | 92.96 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.43 | 80.35 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 60.04 | 66.46 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.70 | 49.86 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.24 | 53.02 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.11 | 19.72 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.84 | 19.84 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.42 | 10.82 |

# బంగారం ఎక్కువైతే... ఇత్తడైపోద్ది!!



## లెక్క చూపని పసిడిపై కేంద్రం కన్ను!

- ప్రభుత్వం పరిశీలనలో 'క్షమాభిక్ష' పథకం...
- 'పెద్ద నోట్ల' మాదిరిగానే వెలికితీసే యోచన
- స్వచ్ఛందంగా వెల్లడించి పన్ను చెల్లించే అవకాశం

**న్యూఢిల్లీ:** 'భాయియో.. ఔర్ బెహనో!!' అంటూ ప్రధాని ఒక్క రాత్రిలో పెద్ద నోట్లన్నీ రద్దు చేసేయటం ఎవరూ మరిచిపోలేరేమో!!. ఇదిగో ఇపుడు అలాంటి ప్రమాదమే మన ఇళ్లలో ఉన్న బంగారానికి కూడా వచ్చేటట్టు కనిపిస్తోంది. ఎందుకంటే లెక్కలు లేకుండా పరిమితికి మించి ఉన్న బంగారాన్ని వెలికితీయాలని కేంద్రం ఆలోచిస్తోంది. నిజానికి పెద్ద నోట్లను రద్దు చేసినపుడు బయటపడ్డ నల్లధనం రూ.11,000 కోట్లను మించలేదు. నోట్లు కాకుండా బంగారం, భూముల రూపంలోనే ఎక్కువ నల్లధనం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దాంతో మోదీ సర్కారు తదుపరి చర్య భూముల రిజిస్ట్రేషన్, బంగారం కొనుగోళ్లపైనే ఉంటుందని వార్తలూ వచ్చాయి. ఇపుడు ఆ దిశగా ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. పన్ను చెల్లించని ఆదాయంతో పోగేసుకున్న బంగారాన్ని స్వచ్ఛందంగా ప్రకటించి, దానిపై పన్ను చెల్లించేలా ఓ క్షమాభిక్ష పథకాన్ని కేంద్రం తీసుకురానుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. పన్ను చెల్లించని ఆదాయంతో కొనుగోలు చేసిన బంగారాన్ని ఈ పథకం కింద ప్రకటించి, నిర్దేశిత పన్ను చెల్లించడం ద్వారా దాన్ని చట్టబద్ధం చేసుకునే అవకాశం ఉంటుంది. పన్ను ఎంతన్నది ఇంకా ప్రభుత్వం నిర్ణయించలేదు. బంగారం విలువపై 30 శాతం పన్ను, విద్యా సెస్సుతో కలిపి 33 శాతం వరకు ఉండవచ్చనేది విశ్వసనీయ సమాచారం. ఈ పథకానికి కేంద్ర ఆర్థిక శాఖ తుది మెరుగులు దిద్దుతున్నట్టు తెలిసింది. ఒక వ్యక్తికి ఎంత బంగారం ఉండొచ్చనేది కూడా ఈ పథకంలో ఉంటుంది. వివాహిత మహిళలకు పరిమితిని కాస్త పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**అంత తేలికేమీ కాదు!!**

2016 నవంబర్లో డీమోనిటైజేషన్ (రూ.500, రూ.1,000 నోట్ల రద్దు) తరువాత నల్లధనాన్ని వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో కేంద్రం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (ఐడీఎస్-2) పథకాన్ని 2017లో తెచ్చింది. కానీ ఇదేమంత విజయం సాధించలేదు. అందుకే బంగారం రూపంలో వ్యవస్థలో పోగుపడిన నల్లధనాన్ని వెలికితీయాలన్న ఈ పథకాన్ని కేంద్రం తెస్తున్నట్లు సమాచారం. ''పథకం ఆలోచన మంచిదే. కానీ సమర్థంగా అమలు చేయటం కష్టం. ప్రజలు ఎంతో కాలంగా బంగారాన్ని సమకూర్చుకుంటుంటారు. వారసత్వంగా వచ్చే బంగారానికి ఎలాంటి లావాదేవీ వివరాలూ ఉండవు. తమ దగ్గరున్న బంగారం విలువలో మూడోవంతు కోల్పోయేందుకు జనం ఇష్టపడరు'' అని ఓ విశ్లేషకుడు పేర్కొన్నారు. ఇక స్వచ్ఛందంగా ప్రకటించాక పన్ను అధికారుల వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయం కూడా వారిలో ఉంటుందన్నారు.

## త్వరలో గోల్డ్ బోర్డు



గోల్డ్ బోర్డును కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ ప్రతిపాదనను ఆర్థిక వ్యవహారాలు, రెవెన్యూ విభాగం కలిసి సిద్ధం చేసినట్టు తెలియవచ్చింది. ప్రభుత్వ ప్రతినిధులతోపాటు ప్రైవేటు రంగ ప్రతినిధులకూ ఈ బోర్డులో చోటు కల్పిస్తారు. బంగారం కొనే వారిని ఆకర్షించేలా పెట్టుబడి పథకాల రూపకల్పన, బంగారం నిల్వలను ఆర్థిక ఆస్తిగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలను బంగారం బోర్డు చూడనుందని సమాచారం. ప్రస్తుతం అమల్లో ఉన్న సార్వభౌమ బంగారం బాండ్ల పథకాన్ని మరింత ఆకర్షణీయంగానూ మార్చే చర్యలను బోర్డు చేపడుతుంది. మన దేశం ఏటా 900 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది. దేశ సంస్కృతిలో బంగారం భాగం కావడంతో, భారతీయుల గోల్డ్ దిగుమతులు ఏటా పెరిగిపోతున్నాయి. కరెంటు ఖాతా లోటూ పెరుగుతోంది. దీన్ని నిరుత్సాహపరిచేందుకు ప్రభుత్వం దిగుమతులపై సుంకాలను విధించినా పెద్దగా ఫలితం రాలేదు. దేశ ప్రజల వద్ద సుమారు 20,000 టన్నుల బంగారం ఉంటుందని అంచనా. లెక్కల్లో చూపనిది, వారసత్వంగా వచ్చినది కూడా కలుపుకుంటే ఇది 25,000-30,000 టన్నుల వరకు ఉండొచ్చు.

## ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు ఐఏటీఏలో సభ్యత్వం

**న్యూఢిల్లీ:** చౌక చార్జీల విమానయాన సంస్థ ఇండిగో.. అంతర్జాతీయ విమానయాన సంఘం (ఐఏటీఏ)లో సభ్యత్వం పొందినట్లు బుధవారం ప్రకటించింది. ఇటీవలి కాలంలోనే సంస్థ సేవలు టర్కీ, వియత్నాం, మయన్మార్, చైనా వంటి దేశాలకు విస్తరించిన విషయం తెలిసిందే కాగా, సరిగ్గా ఇటువంటి సమయంలో సభ్యత్వం పొందడం వల్ల ప్రపంచంలో అత్యుత్తమ వాయు రవాణా వ్యవస్థగా ఇండిగోను తీర్చిదిద్దాలనే లక్ష్యానికి సహకారం లభించిందని సంస్థ సీఈఓ రోనోజోయ్ దత్తా అన్నారు. ఇండిగో ప్రస్తుతం రోజుకు 1,500 విమాన సర్వీసులను నిర్వహిస్తుండగా.. వీటిలో 60 దేశీయ, 23 అంతర్జాతీయ గమ్యస్థానాలు ఉన్నాయి. మొత్తం 247 ఎయిర్‌క్రాఫ్ట్‌లను సంస్థ కలిగిఉంది. ఇక ఐఏటీఏ 290 ఎయిర్‌లైన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తోంది. మరోవైపు ఈ ఏడాది మార్చిలోనే స్పైస్‌జెట్ ఈ సంఘంలో సభ్యత్వం పొందిన తొలి భారత చౌక చార్జీల విమానయాన సంస్థగా నమోదైంది.



## వ్యక్తిగత ఆదాయపు పన్ను భారం తగ్గకపోవచ్చు!

**న్యూఢిల్లీ:** వ్యక్తిగత ఆదాయపు పన్ను(ఐటీ) తగ్గింపు నిర్ణయం కేంద్రం తీసుకునే అవకాశం లేదని ఉన్నత స్థాయి వర్గాల నుంచి సమాచారం అందుతోంది. కార్పొరేట్ రంగానికి ఊతం ఇవ్వడానికి ఆర్థికశాఖ ఇటీవలే కార్పొరేట్ పన్నును ఏకంగా 10 శాతం తగ్గించింది. పెట్టుబడుల పెరుగుదల, ఉపాధి కల్పన, ఉత్పత్తి ధర తగ్గడం తద్వారా వ్యవస్థలో డిమాండ్, వినియోగం పెరగడం దీని లక్ష్యం. వినియోగదారు కొనుగోలు సామర్థ్యం, డిమాండ్ పెరగడానికి వ్యక్తిగత ఆదాయపు పన్ను కూడా తగ్గించాలని ఇటీవల కొన్ని వర్గాల నుంచి డిమాండ్ వస్తోంది.




### బోర్డ్ మీటింగ్స్

ఐఓసీ, సిండికేట్ బ్యాంక్, ధనలక్ష్మీ బ్యాంక్, బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్, లారస్ ల్యాబ్స్, రామ్‌కో

### కార్పొబ్రీఫ్స్...

**హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్:** ఈ కంపెనీలో 4.95 శాతం వాటా(10 కోట్ల షేర్ల)ను స్టాండర్డ్ లైఫ్(మారిషస్ హోల్డింగ్స్) రూ.5,750 కోట్లకు ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా విక్రయించింది. ఒక్కో షేర్ సగటు విక్రయ ధర రూ.575.15 గా ఉంది.

**కెనరా బ్యాంక్:** ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన 27.6 కోట్ల ఈక్విటీ షేర్లను ఒక్కో షేర్‌ను రూ.237.23 ధరకు ప్రభుత్వానికి కేటాయించి రూ.6,571 కోట్లు సమీకరించనున్నది.

### బులియన్ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **ముంబై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,690 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,800 | | 0 |
| వెండి (కిలో) | 49,900 | ▲ | 200 |
| **చెన్నై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,500 | ▲ | 30 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,670 | ▲ | 30 |
| వెండి (కిలో) | 49,900 | ▲ | 200 |
| **హైదరాబాద్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,500 | ▲ | 30 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,670 | ▲ | 30 |
| వెండి (కిలో) | 49,900 | ▲ | 200 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,380 | ▲ | 110 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,630 | ▲ | 100 |
| వెండి (కిలో) | 48,000 | | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,650 | ▲ | 30 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,670 | ▲ | 30 |
| వెండి (కిలో) | 49,900 | ▲ | 300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 31-10-2019

| | |
|---|---|
| విశాఖ | 400-00 |
| చిత్తూరు | 423-00 |
| వరంగల్ | 396-00 |
| చెన్నై | 430-00 |
| ముంబై | 448-00 |
| **30-10-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 393-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.50 |
| విజయవాడ | 400-00 |
| నమక్కల్ | 415-00 |
| గోదావరి | 400-00 |
| బెంగళూరు | 418-00 |
| కోల్‌కతా | 433-00 |
| ఢిల్లీ | 414-00 |

## జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో తగ్గనున్న టాటా వాటా

- 19.7 నుంచి 14.7 శాతానికి చేరిక
- నియంత్రణల నేపథ్యంలో తాజా నిర్ణయం
- నిర్వహణ జీఎంఆర్ చేతిలోనే




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో టాటా గ్రూప్ ప్రతిపాదిత వాటా కొనుగోలు డీల్‌ను పునర్వ్యవస్థీకరించినట్టు సమాచారం. నియంత్రణ పరమైన అంశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చిలో టాటా గ్రూప్ నేతృత్వంలోని మూడు సంస్థలు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో 44.4 శాతం వాటాను రూ.8,500 కోట్లకు కొనుగోలు చేసేందుకు జీఎంఆర్‌తో డీల్ కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. వాస్తవ ప్రణాళిక ప్రకారం జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో టాటా గ్రూప్ 19.7%, సింగపూర్ సావరిన్ వెల్త్ ఫండ్ జీఐసీ ప్రైవేట్ లిమిటెడ్ 14.8%, హాంకాంగ్‌కు చెందిన ఎస్ఎస్‌జీ క్యాపిటల్ 9.9% వాటాను దక్కించుకోవాలి. నూతన ప్రణాళిక ప్రకారం టాటాల వాటా 14.7%కి పరిమితం కానుంది. జీఐసీ వాటా 5 శాతం పెరిగి 19.8%కి చేరనుంది. ఎస్ఎస్‌జీ వాటాలో ఎటువంటి మార్పు లేకుండా 9.9% ఉండనుంది. ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అనుబంధ కంపెనీ అయిన ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌లో టాటా గ్రూప్ వాటా డీల్ పునర్వ్యవస్థీకరణ తర్వాత నికరంగా 10 శాతానికి చేరుతుంది.

**ఇదీ నేపథ్యం..:** జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో టాటా గ్రూప్ వాటా కొనుగోలు విషయమై న్యాయపర అంశాలపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కొద్ది రోజుల క్రితం సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా అభిప్రాయాన్ని కోరింది. ఎయిర్‌పోర్ట్ ఆపరేటింగ్ కంపెనీల్లో దేశీయ ఎయిర్‌లైన్ సంస్థల వాటా 10 శాతంలోపే ఉండాలన్న పరిమితి ఉంది. టాటా గ్రూప్.. సింగపూర్ ఎయిర్‌లైన్స్ భాగస్వామ్యంతో పూర్తిస్థాయి సర్వీస్ క్యారియర్ 'విస్తారా ఎయిర్‌లైన్స్', మలేషియాకు చెందిన ఎయిర్ ఆసియా బెర్హాడ్‌తో కలిసి బడ్జెట్ ఎయిర్‌లైన్ 'ఎయిర్‌ఆసియా ఇండియా'ను నిర్వహిస్తోంది. ఈ రెండు సంస్థల్లోనూ టాటా గ్రూప్‌నకు 51 శాతం వాటా ఉంది. కాగా, డీల్ తదనంతరం జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దాని అనుబంధ సంస్థల వాటా 53.5 శాతంగా ఉంటుంది. కంపెనీ ఎంప్లాయీ వెల్ఫేర్ ట్రస్ట్‌కు 2.1 శాతం వాటా ఉంది. ఎయిర్‌పోర్టుల నిర్వహణ బాధ్యత జీఎంఆర్ చేతిలోనే ఉండనుంది. డీల్‌తో జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రుణం రూ.12,000 కోట్లకు వచ్చి చేరుతుంది.

## మరో పావు శాతం తగ్గిన ఫెడ్ రేటు

- 2% నుంచి 1.75%కి కోత!
- ఈ ఏడాది ఇది మూడో తగ్గింపు

**వాషింగ్టన్:** అందరి అంచనాలకు అనుగుణంగానే అమెరికా ఫెడరల్ రిజర్వ్ పావు శాతం మేర వడ్డీ రేట్లను తగ్గించింది. రెండు రోజుల పాటు జరిగి బుధవారం ముగిసిన సమావేశంలో ఫెడ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ, ప్రస్తుతం 1.75 శాతం నుంచి 2 శాతం రేంజ్‌లో ఉన్న 'ఫెడ్ ఫండ్స్ రేటు'ను 1.5 శాతం నుంచి 1.75 శాతానికి తగ్గించింది. ఈ ఏడాది రేట్లను తగ్గించడం ఫెడరల్ రిజర్వ్‌కు ఇది మూడో సారి. ఈ ఏడాది జూలై, సెప్టెంబర్‌ల్లో పావు శాతం మేర రేట్లను ఫెడ్ తగ్గించింది. అంతర్జాతీయంగా మందగమనం నెలకొనడంతో రేట్లను ఫెడ్ తగ్గిస్తూ వస్తోంది.




**ఫెడరల్ ఫండ్స్ రేట్ అంటే...**

బ్యాంక్‌లు పరస్పరం ఇచ్చుకునే ఓవర్‌నైట్ రుణాలపై ఫెడరల్ రిజర్వ్ నిర్ణయించే రేటునే ఫెడరల్ ఫండ్స్ రేట్‌గా వ్యవహరిస్తారు. ఈ రేట్‌పై ఆధారపడే బ్యాంక్‌లు వినియోగదారులకు ఇచ్చే తాకట్టు, క్రెడిట్, వ్యాపార ఇలా వివిధ రుణాలపై వడ్డీరేట్లను నిర్ణయిస్తాయి.

## రిలయన్స్ బీమా ఐపీఓ మళ్లీ వెనక్కి




**న్యూఢిల్లీ:** అనిల్ ధీరూబాయ్ అంబానీ గ్రూప్‌నకు చెందిన రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ప్రణాళికను అటకెక్కించింది. సెబీకి సమర్పించిన ఐపీఓ ముసాయిదా పత్రాలను వెనక్కి తీసుకుంది. ఐపీఓను ఎందుకు ఉపసంహరించుకుందో వివరాలను కంపెనీ గానీ, ఈ ఐపీఓకు లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ గానీ వెల్లడించలేదు. షెడ్యూల్ ప్రకారమైతే, ఈ ఐపీఓలో భాగంగా రూ.200 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ జారీ చేయనున్నది. వీటితో పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద రిలయన్స్ క్యాపిటల్ 7.9 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నది.

**2017లో కూడా అంతే..!**

రిలయన్స్ బీమా ఐపీఓ డాక్యుమెంట్లను ఈ ఏడాది ఫిబ్రవరి 8నే మోతీలాల్ ఓస్వాల్ సంస్థ మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీకి సమర్పించింది. ఈ డాక్యుమెంట్లను ఉపసంహరించుకుంటున్నామని ఈ నెల 24న సెబీకి ఒక మెయిల్ పంపించింది. రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఐపీఓ ప్లాన్‌ను ఉపసంహరించుకోవడం ఇది రెండోసారి. 2017, అక్టోబర్‌లో ఐపీఓ పత్రాలను సమర్పించి ఆ మరుసటి నెలలో సెబీ నుంచి ఆమోదం పొందింది. అయితే అప్పుడు స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులమయంగా సాగడం, ఐపీఓల పట్ల ఇన్వెస్టర్లకు పెద్దగా ఆసక్తి లేకపోవడంతో ఐపీఓ ప్లాన్‌ను అటకెక్కించింది.

## వచ్చే ఏడాది పాలసీల వెల్లువ



రుషభ్ గాంధీ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** బీమా కంపెనీల నుంచి వచ్చే ఏడాది పాలసీలు వెల్లువలా వచ్చిపడతాయని ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏ) చొరవతో వినూత్న పాలసీలు రానున్నాయని ఇండియాఫస్ట్ డిప్యూటీ సీఈవో రుషభ్ గాంధీ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. పాలసీదారులకు అనుకూలంగా ఉండేలా కంపెనీలు వీటిని రూపొందిస్తున్నాయని చెప్పారు. మూడు పాలసీలకు తాము దరఖాస్తు చేశామన్నారు. గత ఆర్థిక సంవత్సరం మాదిరిగా 2019-20లో కంపెనీ సుమారు రూ.3,200 కోట్ల వ్యాపారం అంచనా వేస్తోందని తెలిపారు. ఇందులో నూతన వ్యాపారం రూ.1,000 కోట్లు ఆశిస్తున్నట్టు వెల్లడించారు. కాగా, సాండ్ బాక్స్ పేరుతో ఐఆర్‌డీఏ ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న పాలసీలకు భిన్నంగా.. కస్టమర్లకు అనుకూలంగా ఉండే పాలసీలను రూపొందించేలా బీమా కంపెనీలను ప్రోత్సహిస్తోంది. సాండ్‌బాక్స్ కింద అనుమతి పొందిన బీమా ప్లాన్‌కు తొలుత నియంత్రణ పరంగా కొంత వెసులుబాటు ఉంటుంది. పరిమిత కాలానికి, పరిమిత సంఖ్యలో పాలసీలను కంపెనీలు విక్రయించాల్సి ఉంటుంది. ఫలితాలనుబట్టి అట్టి ప్లాన్‌ను కొనసాగించాలా లేదా అన్నది ఐఆర్‌డీఏ నిర్ణయిస్తుంది.

## పొదుపు పట్ల మహిళల్లో అప్రమత్తత

- ఎఫ్‌డీలు, పీపీఎఫ్‌లకే మెజారిటీ ప్రాధాన్యం
- లేదంటే బ్యాంకు ఖాతాల్లోనే..




**న్యూఢిల్లీ:** పొదుపు విషయమై మహిళల్లో అధిక అప్రమత్తత ఉంటున్నట్టు ఓ సర్వే ఫలితాల ఆధారంగా తెలుస్తోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) లేదా పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేయడానికే 58 శాతం మంది మహిళలు ప్రాధాన్యం ఇస్తున్నారు. లేదంటే బ్యాంకు సేవింగ్స్ ఖాతాల్లో ఉంచేస్తున్నారు. ఆన్‌లైన్ వేదికగా ఆర్థిక సేవలు అందించే స్క్రిప్‌బాక్స్ అక్టోబర్ నెల మొదటి రెండు వారాల్లో నిర్వహించిన సర్వే ద్వారా ఈ వివరాలు తెలిశాయి. ఇక మరో 6 శాతం మంది మహిళలు బంగారం కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పడం గమనార్హం. అదనపు ఆదాయాన్ని మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా పెడతామని 15 శాతం మగువలు చెప్పారు. ప్రముఖ ఫేస్‌బుక్ కమ్యూనిటీల ఆధారంగా 400 మంది మహిళల నుంచి అభిప్రాయాలు సేకరించి స్క్రిప్‌బాక్స్ ఈ వివరాలు వెల్లడించింది. వీరిలో 54 శాతం మంది మిలీనియల్స్ (1980-2000 మధ్య జన్మించిన వారు) ఉన్నారు.

- సర్వేలో పాలు పంచుకున్న మిలీనియల్స్‌లో మూడొంతులు మంది పొదుపు పట్ల ఎంతో సానుకూలంగా ఉన్నట్టు సర్వే తెలిపింది.
- ప్రతీ ఆరుగురు మిలీనియల్స్‌లో ఒకరు విహార యాత్రల కోసం డబ్బును పక్కన పెట్టడానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.
- నాన్ మిలీనియల్స్ మహిళల్లో సగం మంది రిటైర్మెంట్ నిధి, పిల్లల విద్య కోసం కొంత మేర పక్కన పెడతామని వెల్లడించారు.
- ఈ వయసు గ్రూపులోని వారికి పన్ను ఆదా చేసే పీపీఎఫ్, ఎల్ఐసీ పథకాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ప్రాముఖ్యంగా ఉన్నాయి. నాన్ మిలీనియల్స్‌లో 33% మంది వీటికే ఓటేశారు. 26% మంది మాత్రం దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకు మ్యూచువల్ ఫండ్స్ సాయపడతాయని చెప్పారు.
- అవసరమైన సందర్భాల్లో తమ కష్టార్జితాన్ని సులభంగా, వెంటనే పొందే వెసులుబాటు ఉండాలని సర్వేలో పాల్గొన్న మహిళల్లో 44 శాతం మంది పేర్కొన్నారు.
- అత్యవసర నిధికి ఎక్కువ మంది మొగ్గు చూపించారు. 36 శాతం మంది అజెండాలో దీనికే అగ్ర ప్రాధాన్యం ఉంది. తర్వాత పిల్లల విద్య కోసం 28 శాతం మంది, రిటైర్మెంట్ కోసం నిధి ఏర్పాటుకు 26 శాతం మంది మొగ్గు చూపించారు.
- తమకు ఎటువంటి ఆర్థిక లక్ష్యం లేదని 25 శాతం మంది చెప్పడం గమనార్హం. ఆర్థిక ప్రణాళిక ఏర్పాటు, ఆర్థిక లక్ష్యాల సాధన విషయంలో 28 శాతం మంది నమ్మకంగా ఉన్నారు.

### పొదుపు, మదుపు వేర్వేరు..

పొదుపు చేయడం, పెట్టుబడి(మదుపు) పెట్టడం అనేవి నాణేనికి రెండు ముఖాలు. కానీ వీటి మధ్య చాలా పెద్ద వ్యత్యాసమే ఉంది. అత్యవసరాల కోసం డబ్బులను పక్కన పెట్టుకోవడం పొదుపు అవుతుంది. దీనిపై రాబడులు నామమాత్రంగాను లేదా అసలు లేకపోవచ్చు. కానీ పెట్టుబడులు అనేవి సంపదను సృష్టించుకునేందుకు క్రమబద్ధమైన విధానం. ద్రవ్యోల్బణాన్ని మించి నికర విలువ వృద్ధి చెందేందుకు, పిల్లల విద్య, రిటైర్మెంట్ అవరాల కోసం నిధిని సమకూర్చుకునేందుకు మార్కెట్ ఆధారిత (ఈక్విటీ) ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలు తోడ్పడతాయి''అని స్క్రిప్‌బాక్స్ సీఈవో ఆశిష్ కుమార్ తెలిపారు.

## 40,000 దాటిన సెన్సెక్స్

- 220 పాయింట్ల లాభం
- 57 పాయింట్లు పెరిగి 11,844కు నిఫ్టీ



ఆదాయపు పన్ను విషయంలో, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించిన పన్ను అంశాల్లో కూడా ఊరటనిచ్చే నిర్ణయాలను కేంద్రం తీసుకోనున్నదన్న వార్తల కారణంగా బుధవారం స్టాక్ మార్కెట్ లాభపడింది. కంపెనీల సానుకూల క్యూ2 ఫలితాలు, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు కలసివచ్చాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 40,000 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 11,800 పాయింట్ల ఎగువకు ఎగబాకాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల నిర్ణయం నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లలో అప్రమత్తత నెలకొన్నా, మన మార్కెట్ మాత్రం ముందుకే దూసుకుపోయింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 6 పైసలు పతనమై 70.91కు చేరినా, ఆ ప్రభావం కనిపించలేదు. బీఎస్ఈ సెన్సెక్స్ 220 పాయింట్ల లాభంతో 40,052 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 57 పాయింట్లు పెరిగి 11,844 పాయింట్ల వద్ద ముగిశాయి. ప్రభుత్వ రంగ కంపెనీలు, ఐటీ, ఆయిల్, గ్యాస్ షేర్లు పెరిగాయి. సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా నాలుగో రోజూ లాభపడ్డాయి. ఆల్‌టైమ్ హై స్థాయిలకు ఈ రెండు సూచీలు చెరో 250 పాయింట్ల దూరంలోనే ఉన్నాయి.

**ఈక్విటీ పన్ను సంస్కరణలు..**

డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ)ను రద్దు చేయనున్నారని, దీర్ఘకాల మూలధన లాభాల పన్ను(ఎల్‌టీసీజీ), సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్(ఎస్‌టీటీ)ల్లో కూడా మార్పులు, చేర్పులు చేయనున్నారన్న వార్తలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు కారణంగా కంపెనీల క్యూ2 ఫలితాలు అంచనాలను మించుతుండటం, ప్రభుత్వ కంపెనీల్లో వాటా విక్రయం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల తగ్గింపు అంచనాలు.. ఇవన్నీ సానుకూల ప్రభావం చూపించాయి.

- భారీ రుణభారంతో ఇప్పటికే కుదేలైన టెలికం కంపెనీలకు తాజాగా ఏజీఆర్ విషయమై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో కష్టాలు మరింతగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ రంగానికి బెయిలవుట్ ప్యాకేజీ నిమిత్తం కార్యదర్శుల సంఘాన్ని కేంద్రం నియమించింది. ఈ నేపథ్యంలో టెలికం షేర్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. ఆరంభంలో 8.5% ఎగసిన వొడాఫోన్ ఐడియా షేర్ చివరకు 1% నష్టంతో రూ.3.81 వద్ద ముగిసింది. ఎయిర్‌టెల్ షేర్ 2.3% లాభంతో రూ.368 వద్ద ముగిసింది.


జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నందగిరిలో పంటలను ముంచెత్తిన వరద నీరు


కామారెడ్డి మార్కెట్ యార్డులో తడిసిన మక్కలను ఎత్తుతున్న మహిళ


వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులో తడిసిన పత్తి


ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నల్లవెల్లిలో కల్లంలో తడిసిన వరి ధాన్యం


నాగిరెడ్డిపేట మండలం పల్లెబోగతండాలో విద్యార్థులను వాగు దాటిస్తున్న తండావాసులు

# తడిసిన ఆశలు!

**పరకాల/కామారెడ్డి/నిజామాబాద్:** ఐతే అతివృష్టి.. లేదంటే అనావృష్టి అన్నట్లుంది అన్నదాతల పరిస్థితి. గత ఏడాది అత్యల్ప వర్షాలతో దిగుబడి లేక తల్లడిల్లిన రైతన్నలు.. ఈసారి అదును దాటాక కురుస్తున్న వర్షాలు కన్నీరు తెప్పిస్తున్నాయి. చేతికొచ్చిన పంటలు నీటిపాలు కావడంతో అన్నదాతల గుండెలు చెరువయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో పంటలన్నీ దెబ్బతిన్నాయి. నిజామాబాద్ మార్కెట్ యార్డులో వరిధాన్యం తడిసి ముద్దకాగా, కామారెడ్డిలో సుమారు వెయ్యి క్వింటాళ్లకు పైగా మొక్కజొన్న ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకోగా 300 క్వింటాళ్ల మక్కలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. వరి పైర్లు పూర్తి స్థాయిలో నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న పంటలు తడిసి ముద్దయ్యాయి.

# ఐటీడీఏ ముట్టడికి యత్నం

**ఆదివాసీల ఆందోళన.. ఉద్రిక్తత**
- కార్యాలయంలో చొచ్చుకువెళ్లేందుకు యత్నం.. తోపులాట
- లోపల పాలకవర్గ సమావేశం.. వెలుపల నినాదాలు
- లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్

**సాక్షి, ఆదిలాబాద్:** ఆదివాసీలు మళ్లీ పోరుబాట పట్టారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని కోరుతూ బుధవారం ఐటీడీఏ కార్యాలయ ముట్టడికి యత్నించారు. భారీగా తరలివచ్చిన ఆదివాసీలను పోలీసులు కట్టడి చేసే క్ర మంలో తోపులాట, వాగ్వాదం జరిగింది. ఒక దశ లో కార్యాలయంలోకి చొచ్చుకువెళ్లేందుకు యత్నించగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాలు.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కుమురంభీం కాంప్లెక్స్‌లో బుధ వారం ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఐటీడీఏ చైర్మన్, ఆదిలాబాద్ కలెక్టర్ దివ్యదేవరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుండగా, ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ నినాదాలు చేశారు. లోపల సమావేశం జరుగుతుండగా.. వెలుపల ఆదివాసీల నినాదాలతో హోరెత్తించారు. ఓ దశలో లోపలికి దూసుకెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులకు, ఆదివాసీలకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి అదుపు తప్పే అవకాశాలు కనిపించడంతో కలెక్టర్ దివ్యదేవరాజన్, ఐటీడీఏ పీఓ కృష్ణ ఆదిత్యలు బయటకు వచ్చి ఆదివాసీలను శాంతింపజేసేందుకు యత్నించారు. మీ ప్రధాన డిమాండ్ విషయమై సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన దృష్ట్యా తీర్పు వచ్చే వరకు ఆగాలన్నారు. ఈ విషయంలో ఎవరు ఎలాంటి హామీ ఇచ్చినా తాత్కాలిక ఉపశమనమే కానీ పరిష్కారం కాదన్నారు. జీఓ 24 తీసుకొచ్చి ఏజెన్సీలో నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట వేశామని కలెక్టర్ ఈ సంద ర్భంగా గుర్తు చేశారు. ఆదివాసీ విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో ఎస్జీటీ మినహా మిగతా ఉపాధ్యాయ పోస్టుల్లో ఆదివాసీ టీచర్లను నియమించినట్లు వివరించారు. ఏజెన్సీలో డీఎస్సీ నిర్వహిం చేందుకు ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో తీర్మా నం చేసి ప్రభుత్వానికి పంపిస్తామని హామీ ఇచ్చా రు. దీంతో ఆందోళకారులు శాంతించారు.


బుధవారం ఐటీడీఏ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

**సోయం, జోగురామన్న సంవాదం**

కాగా, సమావేశంలో ఎమ్మెల్యే జోగు రామన్న, ఎంపీ సోయం బాపురావుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాను పిలుపునిస్తే కలెక్టర్, ఎస్పీ ఆఫీసులుండవని సోయం చేసిన వ్యాఖ్యలను జోగు రామన్న ప్రస్తావించారు. రాజ్యాంగ బద్ధంగా పదవుల్లో ఉన్నవారు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యేకు ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కూడా మద్దతు పలికారు. అయితే ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకునేది లేదని ఎంపీ సోయం కరాఖండిగా చెప్పారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది.

## క్లుప్తంగా...

### కీర్తికి పాలమూరులో అబార్షన్?

**మహబూబ్‌నగర్ క్రైం:** హైదరాబాద్‌కు చెందిన కీర్తి.. తన ప్రియుడు శశికుమార్‌తో కలసి తల్లి రజితను హత్య చేసిన ఘటనలో కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించి కొన్ని మూలాలు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్నట్టు తెలుస్తోంది. నిందితుడి తండ్రి ఒకప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యుత్ శాఖలో ఏఈగా పని చేసేవారు. ఆ సమయంలో నిందితుడు శశికుమార్‌కు మహబూబ్‌నగర్‌లో కొన్ని పరిచయాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కీర్తి గర్భవతి అయిన సమయంలో జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో అబార్షన్ చేయించినట్లు సమాచారం. అలాగే ఆమనగల్లులో గదిని అద్దెకు తీసుకొని అక్కడ కూడా కీర్తికి కొన్ని రోజులు వైద్యం చేయించినట్లు తెలుస్తోంది.

### మర్లపాడులో బయటపడ్డ పాత నోట్ల కట్టలు

**వేంసూరు:** ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో ఓ ఇంట్లో భారీ స్థాయిలో నిల్వ ఉంచిన పాత (చలామణిలో లేని) నోట్ల కట్టలు బుధవారం బయటపడ్డాయి. నడిపల్లి దామోదర్ ఇంటిని.. సత్తుపల్లిలో ఇటీవల గుర్తించిన దొంగనోట్ల ముఠాలోని ఓ వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. సుమారు రూ.12 లక్షల పాత కరెన్సీని సినిమాలో మాదిరిగా పైన రూ.500, రూ.1,000 నోట్లు పెట్టి.. మధ్యలో తెల్ల కాగితాలు పెట్టి భారీగా నిల్వ చేశాడు. వీటిని కంటెయినర్‌లో అమర్చే విధంగా పెద్ద బాక్స్ మాదిరిగా పేర్చాడు. అయితే పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం సోదాలు నిర్వహించగా, పాత కరెన్సీ నోట్ల కట్టలు బయటపడ్డాయి. సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.100కోట్ల మేర ఇలాంటి కరెన్సీ ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# గర్భందాల్చిన 'కస్తూర్బా' విద్యార్థిని..!

- డీఈవో, ఎంఈవో విచారణ
- ప్రిన్సిపాల్, ఏఎన్‌ఎంలపై వేటు
- పాఠశాల ఉద్యోగిని భర్తపై కేసు నమోదు

**గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు శివారు బ్రాహ్మణపల్లిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని గర్భం దాల్చిన సంఘటన బుధవారం కలకలం రేపింది. పదో తరగతి చదువుతున్న ఓ బాలిక దసరా సెలవులు ముగిశాక ఇటీవల పాఠశాలకు వచ్చింది. అప్పటి నుంచి తరచూ అస్వస్థతకు గురవడంతో టీచర్లకు చెప్పకుండా స్కూల్ ఏఎన్‌ఎం ద్వారా మందులు వాడుతోంది. మంగళవారం బాలిక శరీరంలో మార్పులను గుర్తించిన ఓ టీచర్.. ప్రిన్సిపాల్‌కు తెలపడంతో గదిలోకి పిలిచి అడగ్గా తన బావతో పరిచయమున్నట్లు తెలిపింది. వారు వెంటనే బాలిక తల్లిదండ్రులకు సమాచారమిచ్చి ఇంటికి పంపించారు. తర్వాత తల్లిదండ్రులు బాలికకు ఓ ఆస్పత్రిలో పరీక్ష చేయించగా గర్భం దాల్చినట్లు తేలింది. విషయం తెలుసుకున్న డీఈఓ వి.వి.శర్మ బుధవారం ఉదయం ఎంఈఓ కాంతారావుతో కలసి విచారించారు. కాగా, బాలిక గర్భం దాల్చడానికి పాఠశాల ఉద్యోగి భర్తే కారణమని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, ఎంఈఓతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

**నా భర్తపై అకారణంగా నిందలు**

తన భర్తపై అకారణంగా నింద వేసి పట్టుకొచ్చారని సదరు ఉద్యోగిని విలేకరులతో వాపోయింది. బాలిక ఫిర్యాదు మేరకు పాఠశాల ఉద్యోగి భర్తపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ బాలాజీ, ఎస్సై యాసిన్ తెలిపారు. ఇదిలా ఉండగా డీఈఓ ఆదేశాల మేరకు కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకన్య, ఏఎన్‌ఎం రాధను సస్పెండ్ చేస్తున్నట్లు ఎంఈఓ కాంతారావు తెలిపారు.

# మంచానికి కట్టేసి.. నిప్పంటించి..


భూక్యా దస్రు


బాజీ

**వృద్ధ దంపతుల సజీవదహనం**
భూమి కోసం కొడుకు, మనవడు ఘాతుకం ● వరంగల్ జిల్లాలో దారుణం

**నెక్కొండ:** భూ వివాదం ఓ వృద్ధ దంపతుల పాలిట శాపంగా మారింది. చనిపోయాక చితికి నిప్పంటించాల్సిన కొడుకు బతికుండగానే కాల్చి చంపాడు. తల్లిదండ్రులను మంచానికి కట్టేసి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. కన్నవారు అని కూడా కనికరించని ఆ కిరాతకుడు తన కొడుకుతో కలసి ఈ దారుణానికి ఒడిగట్టాడు. హృదయ విదారకమైన ఈ సంఘటన వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం మడిపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భూక్యా దస్రు (68)కు 10 ఎకరాల భూమి ఉండగా.. కుమారులు కేతూరాంకు 3.30 ఎకరాలు, వీరన్నకు నాలుగెకరాలు పంచి ఇచ్చాడు. తన వద్ద రెండున్నర ఎకరాల భూమి ఉంచుకున్నాడు. అయితే వీరన్న కొంతకాలం క్రితం మరణించగా దస్రు తన వద్ద ఉన్న భూమిని వీరన్న భార్య పేరిట పట్టా చేసేందుకు పూనుకున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రుల పట్ల కక్ష పెంచుకున్న కేతూరాం, అతడి కుమారుడు వెంకన్న.. బుధవారం వృద్ధ దంపతులను మంచానికి కట్టేసి వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను వారిపై పోసి నిప్పంటించారు. ఇంట్లో నుంచి పొగలు, మంటలు రావడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామస్తులతో కలసి పోలీసులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంచం మీద ఉన్న వృద్ధ దంపతుల మృతదేహాలు అస్థిపంజరాలుగా మారగా.. కేతూరాం, వెంకన్నకు సైతం గాయాలయ్యాయి. వారు నెక్కొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### సీఎం సార్! మా ఊరికి బస్సు రావడం లేదు

లేఖ రాసిన ఇద్దరు చిన్నారులు



**నారాయణపేట రూరల్:** ''సీఎం చంద్రశేఖర్‌రావు సార్‌కు నమస్కారములు.. మా ఊరికి ఆర్టీసీ బస్సు రావడం లేదు. దీంతో అమ్మమ్మ ఊరిలో ఉండి స్కూల్‌కు వెళుతున్నాను..'''వారం రోజులుగా పాఠశాలకు డుమ్మా కొట్టాల్సి వచ్చింది''అని నారాయణపేట జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు ముఖ్యమంత్రికి లేఖలు రాసి పోస్ట్ చేశారు. ఊట్కూర్ మండలం బిజ్వార్‌కి చెందిన కలన్, కేతన్ అనే చిన్నారులు పట్టణంలోని శ్రీసాయి స్కూల్‌లో 2, 1వ తరగతి చదువుతున్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో వారి రూట్‌లో బస్సు నడవడం లేదు. దీంతో కలన్ తమ అమ్మమ్మ ఊరు ధన్వాడలో ఉండి పాఠశాలకు వస్తుండగా, కేతన్ మాత్రం బస్సు లేక పాఠశాలకు వెళ్లడంలేదు. ఈ నేపథ్యంలో వారు తమ పెద్దవారి సాయంతో, బస్సు నడపా లంటూ లేఖ రాసి..'కె.చంద్రశేఖర్‌రావు, తెలంగాణ ముఖ్యమంత్రి, హైదరాబాద్' అనే చిరునామాకు.. పోస్టాఫీస్‌కు వెళ్లి పోస్టు చేశారు.

### కరపత్రాలపై విచారణ జరపండి

కమిషనర్‌కు లేఖ రాసిన వీసీ

**తెలంగాణ యూనివర్సిటీ:** కొంత కాలంగా తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకులను, మహిళా అధ్యాపకులను, రీసెర్చ్ స్కాలర్లను అసభ్య పదజాలంతో అవమానపరుస్తూ వెలువడుతోన్న కరపత్రాలు, బుక్‌లెట్లపై సమగ్ర విచారణ జరపాలని ఇన్‌చార్జి వీసీ, సీనియర్ ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్ బుధవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. కరపత్రాలు, బుక్‌లెట్లపై సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వీసీ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# గాంధీ పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

**బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శ**

**యాదగిరిగుట్ట:** గాంధీజీ పేరు చెప్పుకొని కాంగ్రెస్ నాయకులు గత 60 ఏళ్లుగా ఓట్లు దండుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన సంకల్ప యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లక్ష్మణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలకులు గాంధీజీ ఆశయాలను సాధించకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. చెట్టుపేరు చెప్పుకొని కాయలు అమ్ముకున్నట్లు గాంధీజీ పేరు చెప్పుకొని ఆ పార్టీ నాయకులు ఓట్లు సంపాదించారని ధ్వజమెత్తారు. ఆర్టీసీ కార్మికులపై సీఎం కేసీఆర్ మొండి వైఖరి తగదన్నారు. కార్మికులతో చర్చలు జరపాలని హైకోర్టు సూచించినప్పటికీ ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్చలు జరపలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ వెంటనే ఆర్టీసీ కార్మిక సంఘాలతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు బండ్రు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


బుధవారం సంకల్పయాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు తదితరులు



## ఎస్సారెస్పీలోకి మళ్లీ వరద

**శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మళ్లీ వరద ఉధృతి పెరిగింది. దీంతో 16 గేట్లను ఎత్తి 50 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 (90 టీఎంసీలు) అడుగుల నీటి మట్టంతో నిండుకుండలా ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కాగా, జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్ల ద్వారా 37.1 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు.**

బాల్కొండ

## ఉపాధ్యాయుడిపై నిర్భయ కేసు

**రామాయంపేట(మెదక్):** విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై బుధవారం రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో పోక్సో, ఎస్సీ, ఎస్టీ యాక్టు, నిర్భయచట్టాల కింద కేసు నమోదైంది. స్థానిక ఎస్ఐ మహేందర్ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వెంకటస్వామి అనే ఉపాధ్యాయుడు కొంతకాలంగా నాలుగోతరగతి చదువుతున్న విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయమై ఎక్కడైనా చెబితే మీ తల్లిదండ్రులను, నిన్ను చంపుతానని ఆ ఉపాధ్యాయుడు బాలికను పలుమార్లు బెదిరించాడు. రోజురోజుకూ అతని చేష్టలు మితిమీరడంతో బాలిక ఈ విషయాన్ని తన తల్లితో చెప్పింది. దీనితో బుధవారం కుటుంబ సభ్యులు, కాలనీవాసులు స్కూలుకు వెళ్లగా, ఆ ఉపాధ్యాయుడు విషయాన్ని ముందే పసిగట్టి పారిపోయాడు. దీంతో వారు స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బాలిక తల్లి ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కారులో చెలరేగిన మంటలు

**ఐదుగురికి తప్పిన ప్రమాదం**

**మూసాపేట:** జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి దగ్ధమైంది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని జాతీయ రహదారి 44పై బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ కథనం.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మహబూబ్‌నగర్‌కు పని నిమిత్తం కారులో బయలు దేరారు. కారు మూసాపేట శివారులోకి వచ్చే సరికి బానెట్ నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చాయి. ఆ వెంటనే మంటలు చెలరేగడంతో కారులో ఉన్న వారు అప్రమత్తమై వెంటనే కిందికి దిగారు. ఈ ఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు దర్యాప్తులో ఉంది.


మూసాపేట వద్ద జాతీయ రహదారిపై మంటల్లో దగ్ధమవుతున్న కారు

### 13 నుంచి స్వేరో ఒలింపిక్స్

**పటాన్‌చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్ గురుకుల పాఠశాలలో వచ్చే నెల 13 నుంచి 15 వరకు తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ పాఠశాలల విద్యార్థుల ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ సెక్రెటరీ వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె చిట్కుల్‌లోని గ్రౌండ్‌ను పరిశీలించారు. ఆటల పోటీల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించేందుకు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆటల పోటీల నిర్వహణపై పలు సూచనలు చేశారు. స్వేరో ఒలింపిక్స్ పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు.



# గుండె జబ్బు ముప్పు ముందే తెలిసిపోతుంది!

గుండె జబ్బులను ముందుగా గుర్తించేందుకు ఓ కొత్త మార్గాన్ని కనుక్కున్నారు అమెరికాలోని విస్కాన్సిన్ మెడికల్ కాలేజీ శాస్త్రవేత్తలు. ఇప్పటివరకూ గుండె జబ్బులను ముందుగా గుర్తించేందుకు ఫార్మింగ్‌హ్యామ్ రిస్క్ స్కోర్ పరీక్ష మాత్రమే ఉంది. వయసు, రక్తపోటు, కొలెస్ట్రాల్ మోతాదు వంటి అంశాల ఆధారంగా గుండె జబ్బులు వచ్చే అవకాశాలను అంచనా వేయడాన్ని ఫార్మింగ్‌హ్యామ్ రిస్క్ స్కోర్ పరీక్ష అంటారు. తాజాగా కంప్యూటర్ ఎయిడెడ్ టొమోగ్రఫీ (సీటీ) స్కాన్ల ద్వారా గుండె జబ్బుల బారిన పడే ప్రమాదాన్ని ముందుగానే కనుగొనవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గుండె జబ్బు లక్షణాలు లేని సుమారు 829 మందికి 2004–05 మధ్యకాలంలో సీటీ స్కాన్లు తీయగా.. 2011 వచ్చేసరికి సుమారు 156 మంది గుండె జబ్బు లేదా స్ట్రోక్ బారిన పడ్డారన్నారు. శరీరంలోని బృహద్ధమని గోడలపై కాల్షియం మోతాదులకూ.. గుండె జబ్బులకు మధ్య సంబంధం ఉన్నట్లు తమ పరిశోధనల్లో వెల్లడైందని స్టేసీ డి.ఓ కానర్ పేర్కొన్నారు. పరిశోధనలో పాల్గొన్న అందరీ బృహద్ధమనిలో కాల్షియం మోతాదులు సాధారణం కంటే ఐదు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమైందని వివరించారు. ఇది భవిష్యత్తులో హార్ట్ ఎటాక్, స్ట్రోక్ వంటి జబ్బులకు ముందస్తు సూచికగా పరిగణించవచ్చని అంటున్నారు. సీటీ స్కాన్ల ద్వారా గుండె జబ్బుల బారిన పడే ప్రమాదాన్ని ముందుగానే పసిగడితే నివారణ చర్యలు తీసుకునేందుకు అవకాశాలు ఉంటాయని స్టేసీ వివరించారు.

## గవర్నర్‌ను కలిసిన ఓయూ జేఏసీ నేతలు

### ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయాలని వినతి

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 3 లక్షలకు పైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఓయూ జేఏసీ డిమాండ్ చేసింది. టీఎస్‌పీఎస్సీ ద్వారా ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలని కోరింది. నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓయూ జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, అధ్యక్షుడు ఎల్చల దత్తాత్రేయ ఆధ్వర్యంలోని బృందం బుధవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి వినతిపత్రం అందించింది. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేటు విశ్వవిద్యాలయాల జీవో నంబర్ 17ను తక్షణమే రద్దుచేసి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. 1998 నుంచి భర్తీ కాని బీఎడ్ డైట్ కళాశాలల అధ్యాపకుల పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలిపారు. తమ సమస్యలను పరిశీలిస్తామని గవర్నర్ చెప్పినట్లు వారు పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో పీయూ జేఏసీ చైర్మన్ గొడుగు ప్రకాష్, హెచ్‌సీయూ అధ్యక్షుడు వెంకటేష్ చౌహాన్, కేయూ నాయకులు తిరుమలేష్ తదితరులు ఉన్నారు.



# అటు ఉక్కునగరం.. ఇటు భాగ్యనగరం!

- నివాసం, వ్యాపారానికి హైదరాబాద్, విశాఖ బెస్ట్
- కాలుష్యం, నేరాలు, అద్దెల దరువుతో ద్వితీయశ్రేణి నగరాల వైపు మొగ్గు
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తల చూపంతా వీటి వైపేనని ఓ సర్వేలో వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** వాతావరణం, భిన్న సంస్కృతులు, భాషలు, తక్కువ క్రైం రేట్, క్రమంగా ఊపందుకుంటున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హైదరాబాద్, విశాఖపట్నం వైపు చూసేలా చేస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు నివాస యోగ్యమైన నగరంగా గుర్తింపు పొందిన భాగ్యనగరంతో పాటు విశాఖపట్నం జాబితాలో చోటు దక్కించుకుంది. తాజాగా ఓ ఆర్థిక సంస్థ నిర్వహించిన సర్వేలో నివాసానికి, వ్యాపారానికి అనువైన నగరాల్లో ఈ రెండూ ఉన్నాయని తెల్చింది.

### ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల వైపు చూపు..

మహానగరాల్లో నివసించడం అంటే ఒకప్పుడు అందరికీ క్రేజ్. అదే ఇప్పుడు ఆ నగరాల నుంచి ఎప్పుడు బయటపడుదామనే చూపులు. దీనికి ప్రధాన కారణం మెట్రో నగరాల్లో పెరిగిన జీవన వ్యయం, కాలుష్యం, ఆరోగ్య సమస్యలే. దీంతో ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, పుణేల నుంచి ఇప్పుడిప్పుడే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలైన ఇండోర్, కొచ్చి, సూరత్, భువనేశ్వర్, నాసిక్, విశాఖపట్నం వంటి నగరాల వైపు మొగ్గు చూపుతున్నారు. నివాసానికేగాకుండా.. అంకుర పరిశ్రమలు, ఇతరత్రా వ్యాపారాలకు ఈ నగరాలు కూడా అనువైనవిగా భావిస్తుండటమే దీనికి కారణం. మరీ ముఖ్యంగా జీవనవ్యయం కూడా చాలా తక్కువగా ఉండటంతో మధ్యతరగతి ప్రజలు ఇక్కడికి రెక్కలు కట్టుకుని వాలేందుకు రెడీ అవుతున్నట్లు సర్వేలో తేలింది. ఈ నగరాలను ఎంచుకోవడం వల్ల సంపాదించిన దాంట్లో కాస్తో కూస్తో వెనకేసుకోవచ్చనే ఆలోచన కూడా వలసల తాకిడి పెరిగేందుకు కారణమవుతోంది. మరో ముఖ్యమైన విషయమేమంటే.. బడా నగరాల్లో సొంతింటి కలను నెరవేర్చుకోవడం కష్టంగా మారిన క్రమంలో రెండో కేటగిరీ నగరాలకు మళ్లేందుకు దారితీస్తోంది. కేవలం సొంతిల్లే కాదు.. అత్యంత అందుబాటులో అద్దె ఇళ్ల ధరలు ఉండటం కూడా ఈ పట్టణాలవైపు చూసేలా చేస్తోంది.

**వేయి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆయా నగరాల్లో ఇంటి ధరలు, అద్దెల వివరాలు (రూ.లలో)**

| నగరం | ఇంటి ధర | నెల అద్దె |
|---|---|---|
| ఇండోర్ | 31.4 లక్షలు | 10,661 |
| జైపూర్ | 45.5 లక్షలు | 12,857 |
| అహ్మదాబాద్ | 48 లక్షలు | 13,772 |
| లక్నో | 50 లక్షలు | 14,005 |
| కొచ్చి | 52 లక్షలు | 14,447 |
| హైదరాబాద్ | 53.1 లక్షలు | 15,795 |
| పుణె | 60 లక్షలు | 18,571 |
| బెంగళూరు | 81.8 లక్షలు | 20,425 |
| కోల్‌కతా | 83 లక్షలు | 20,116 |
| చెన్నై | 86 లక్షలు | 20,019 |
| ఢిల్లీ | 94.4 లక్షలు | 22,265 |
| ముంబై | 2.3 కోట్లు | 43,042 |

### హైదరాబాదే ఎందుకంటే..!

హైదరాబాద్‌కు వలసల తాకిడి పెరిగేందుకు భిన్నసంస్కృతుల మేళవింపే ప్రధాన కారణం. దక్కన్ పీఠభూమి కావడంతో చల్లని వాతావరణం, ప్రకృతి విపత్తుల తాకిడి చాలా తక్కువ. నేరాలు రేటు అంతంతే. ఆధునిక జీవన శైలి.. ఐటీ హబ్, బహుళ జాతి సంస్థలకు చిరునామాతో భాగ్యనగరం ఇతర ప్రాంతాలప్రజలను ఇట్టే ఆకట్టుకుంటోంది. తక్కువ ధరకు సాఫ్ట్‌వేర్ నిపుణులు, మానవవనరులు పుష్కలంగా అందుబాటులో ఉండటంతో అంకుర పరిశ్రమల రాకకు దోహదపడుతున్నాయి. ఇవేగాకుండా లైఫ్‌స్టైల్ తగ్గట్టుగా వినోద, రవాణా సౌకర్యాలు కలిగిఉండటం కూడా హైదరాబాద్‌కు ప్లస్‌పాయింట్‌గా మారింది.

### విశాఖకు కూడా..

మహానగరాలతో విశాఖపట్నం కూడా పోటీ పడుతోంది. సుదూర సముద్రతీరం.. నౌక వాణిజ్యం, పర్యాటక రంగానికి వైజాగ్ కేంద్ర బిందువుగా మారుతోంది. ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న రియల్‌రంగం.. సినీ స్టూడియోల నిర్మాణంతో నగరం బ్రాండ్ విలువ క్రమంగా పెరిగేందుకు కారణమవుతుంది. అరకు వ్యాలీ, సింహాచలం, రుషికొండ, రామకృష్ణ, భీమిలీ బీచ్‌లతో విశాఖ అందాలు, పర్యాటక, హోటల్ రంగాల్లో కొత్త కొలువులను సృష్టిస్తున్నాయి. హైదరాబాద్ తర్వాత ఐటీ రంగానికి అనువైన ప్రాంతంగా సాఫ్ట్‌వేర్ దిగ్గజ కంపెనీలు భావిస్తుండటం కూడా స్టార్టప్ కంపెనీల రాకకు ఊతమిస్తున్నాయి.

| జీవన వ్యయం | హైదరాబాద్ | విశాఖ | ముంబై | ఢిల్లీ |
|---|---|---|---|---|
| పెట్రోల్: | రూ.77.54 | రూ.76.25 | రూ.78.54 | రూ.72.92 |
| ఆహారం: | పాలు లీ.రూ.44, బ్రెడ్ రూ.22 | పాలు లీ. రూ.45, బ్రెడ్ రూ.40 | పాలు లీ.రూ.54, బ్రెడ్ రూ.32 | పాలు లీ.రూ.50, బ్రెడ్ రూ.30 |
| కనీస అవసరాలు: | రూ.1,500-2,500 | రూ.1,800-2,000 | రూ.6,000-7,000 | రూ.4,500-5,000 |
| వినోదం: | రూ.1,500 | రూ.1,400 | రూ.2,100 | రూ.1,800 |
| ఇంటి అద్దె: | రూ.15,795 | రూ.11,000 | రూ.43,042 | రూ.22,265 |
| సొంతిల్లు ధర: | రూ.53 లక్షలు | రూ.40.00 లక్షలు | రూ.2.3 కోట్లు | రూ.94.4 లక్షలు |
| మౌలికవసతులు: | 432 ఆసుపత్రులు, 487 కాలేజీలు | 28 ఆసుపత్రులు, 46కాలేజీలు | 679 ఆసుపత్రులు, 307 కాలేజీలు | 443 ఆసుపత్రులు, 176 కాలేజీలు |
| రవాణా సదుపాయాలు: | దేశీయ అంతర్జాతీయ విమానాశ్రయాలు మెట్రో, రోడ్డు, రైల్వే | దేశీయ విమాన, నౌకాశ్రయం రోడ్డు, రైల్వే | దేశీయ,అంతర్జాతీయ విమానాశ్రయాలు, పోర్టు, మెట్రో, రోడ్డు, రైల్వే | దేశీయ అంతర్జాతీయ విమానాశ్రయాలు మెట్రో, రోడ్డు, రైల్వే |
| కాలుష్య స్థాయి: | 59-114 (గాలినాణ్యతా సూచి) | 30 (గాలినాణ్యతా సూచి) | 33-107 (గాలినాణ్యతా సూచి) | 142-308 (గాలినాణ్యతా సూచి) |
| వార్షిక వేతనం: | రూ.4 లక్షలు | రూ.3.35 లక్షలు | రూ.5.49 లక్షలు | రూ.4.78 లక్షలు |



# కేన్సర్ కణితుల గుర్తింపునకు కొత్త పద్ధతి

శరీరంలోని కేన్సర్ కణితులను గుర్తించేందుకు అమెరికాలోని మిషిగన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఓ కొత్త పద్ధతిని ఆవిష్కరించారు. చర్మం లోపల ఓ చిన్న పరికరాన్ని ఏర్పాటు చేయడం ద్వారా శరీరంలో అటు ఇటు కదులుతూ ఉండే కేన్సర్ కణాలను ఇది ఆకర్షిస్తుంది. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో ఈ పరికరాన్ని తాము ఇప్పటికే విజయవంతంగా పరీక్షించామని లోనీ షియా అనే శాస్త్రవేత్త తెలిపారు. ప్రస్తుతం కేన్సర్ గుర్తింపునకు బయాప్సీ (కణజాలాన్ని కత్తిరించి పరీక్షించడం) ఒక్కటే మార్గం కాగా దీని వల్ల అనేక దుష్పరిణామాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ కొత్త పద్ధతికి ప్రాధాన్యం ఏర్పడింది. చర్మం కిందనే ఈ పరికరం ఉండటం వల్ల కేన్సర్ చికిత్స కోసం ఇచ్చే మందులు సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా? అన్నది కూడా ఎప్పటికప్పుడు గమనించవచ్చని షియా తెలిపారు. ఎలుకలపై జరిపిన ప్రయోగాల ద్వారా ఈ పరికరం వేర్వేరు కేన్సర్లను గుర్తించగలదని ఇప్పటికే రుజువైందన్నారు. ఇతర అవయవాలకు కేన్సర్ విస్తరించడాన్ని కూడా ముందుగా దీని ద్వారా గుర్తించవచ్చని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త జాక్వలీన్ జెర్రస్ తెలిపారు.

## నగలు తాకట్టు పెట్టి..

### ‘30 రోజుల ప్రణాళిక’ అప్పు తీర్చిన సర్పంచ్

**మహేశ్వరం:** 30 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా చేసిన పనులకు సంబంధించి సర్కారు నిధులను మంజూరు చేయకపోవడంతో ఓ సర్పంచ్ తప్పని పరిస్థితుల్లో తన భార్యకు చెందిన 12 తులాల నగలు తనఖా పెట్టి డబ్బులు చెల్లించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామంలో 30 రోజుల ప్రణాళికలో భాగంగా చేసిన అభివృద్ధి పనులకు సర్పంచ్ సురేశ్, ఉపసర్పంచ్ కలిసి దాదాపు రూ.3.5 లక్షలు ఖర్చు చేశారు. ట్రీగార్డులతో పాటు పనుల కోసం వినియోగించిన ట్రాక్టర్లు, జేసీబీల కిరాయిల కోసం వాహనాల యజమానుల నుంచి ఇటీవల తీవ్ర ఒత్తిడి వస్తోంది. ప్రత్యేక ప్రణాళికకు సంబంధించిన డబ్బులను సర్కారు మంజూరు చేయకపోవడంతో మరోమార్గం లేక తన భార్యకు చెందిన 12 తులాల నగలను సురేశ్ బుధవారం మహేశ్వరంలోని ఓ మార్వాడి దుకాణంలో తాకట్టు పెట్టి రూ.1.5 లక్షలు తీసుకున్నారు. ట్రాక్టర్లు, జేసీబీ యజమానులు తదితరాలకు సంబంధించి కొంతమేర డబ్బులు చెల్లించినట్లు ఆయన తెలిపారు.

# విత్తనరంగంపై దృష్టి సారించాం

### జర్మనీ పర్యటనలో వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం విత్తన రంగంపై దృష్టి సారించి నేడు దేశంలో ఇతర రాష్ట్రాలకు అవసరమైన 60% విత్తనాలను అందజేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. జర్మనీలోని బెర్లిన్‌లో ఆ దేశ వ్యవసాయశాఖ ప్రతినిధి బృందంతో నిరంజన్‌రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విత్తనరంగ అభివృద్ధిపై ఇండో–జర్మన్ ద్వైపాక్షిక సహకార ప్రాజెక్టును మూడో విడతకు పొడిగించినందుకు జర్మనీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను సీడ్ బౌల్‌గా మార్చేందుకు గత రెండేళ్ల నుంచి విత్తన ధ్రువీకరణ, నాణ్యమైన విత్తనోత్పత్తి పద్ధతులపై విత్తన రైతులకు, విత్తన ధ్రువీకరణ అధికారులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి వారిలో నైపుణ్యతను మెరుగుపరిచామన్నారు. అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ ద్వారా విత్తన ఎగుమతులను ప్రోత్సహించి, విత్తన వాణిజ్యాన్ని పెంపొందించామన్నారు. కొత్త విత్తన పాలసీ, విత్తన మండలి, అంతర్జాతీయ విత్తన సలహామండలి, అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ అంశాల్లో రాష్ట్రానికి సహకరించాలని జర్మనీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతోపాటుగా ఆహార శుద్ధి రంగంలో జర్మనీ అవలంబిస్తోన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల విషయంలో తెలంగాణకు సహకారం అందించాలని మంత్రి కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన జర్మనీ వ్యవసాయ శాఖ అధికారులు.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విత్తనరంగ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. జర్మనీ పర్యటనకు వచ్చిన రాష్ట్ర బృందానికి జర్మనీ వ్యవసాయ శాఖ కృతజ్ఞతలు తెలిపింది. తెలంగాణ విత్తనరంగంపై అధ్యయనం చేసిన జర్మన్ పార్లమెంటరీ స్టేట్ సెక్రెటరీ మైకేల్ స్టూబ్ గన్‌కు మంత్రి నిరంజన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.




## అభివృద్ధిలో పరస్పర సహకారం

### ఐఎస్‌బీ–భారతీయ రైల్వే మధ్య కుదిరిన ఒప్పందం

**హైదరాబాద్:** దేశాభివృద్ధి ప్రక్రియలో భాగంగా పరస్పరం సహకారం అందించుకునేలా భారతీయ రైల్వే, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. న్యూఢిల్లీలోని రైల్వే బోర్డు కార్యాలయంలో ఆ బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్‌తో ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర శ్రీవాత్సవ బుధవారం సమావేశమై ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈమేరకు గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా డీన్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. భారతీయ రైల్వేను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన పరిశోధన కార్యక్రమాలను ప్రారంభిస్తామని, ఇందుకోసం పూర్తిగా సహకరిస్తామని వెల్లడించారు. ఐఎస్‌బీతో కలసి పనిచేసేందుకు అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని, రైల్వేలకు ప్రాముఖ్యత ఉన్న రంగాల్లో పరిశోధనలను సులభతరం చేసేందుకు ఈ ఒప్పందం తోడ్పడుతుందని రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడంపై దృష్టి సారిస్తామన్నారు. రైల్వేబోర్డులోని సెంటర్ ఫర్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ద్వారా ఐఎస్‌బీ భారతీయ రైల్వే అధికారులకు శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇన్ రెసిడెన్స్ కార్యక్రమాన్ని ఐఎస్‌బీ ప్రారంభిస్తుందని వెల్లడించారు.

## పద్మశాలీ సంఘం అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యవర్గం, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశం బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర మల్లేశం, బోగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ అంశాలను చర్చించారు. పాత కార్యవర్గాన్ని రద్దు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో సమావేశానికి హాజరైన వారు మద్దతు తెలిపారు. అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా బూర మల్లేశం, కో–కన్వీనర్‌గా బోగ వెంకటేశ్వర్లు, బొల్లం హనుమంతులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలోనే కోకాపేటలో ప్రభుత్వం ఇచ్చిన రెండున్నర ఎకరాల స్థలంలో ప్రభుత్వం కేటాయించిన రూ.5 కోట్ల నిధులతో పనులకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కస్తూరి సతీష్, దిడ్డి ప్రవీణ్ కుమార్, బొమ్మ రాజేశ్వర్‌రావు, ఎమ్.ధర్మారావు, ఆశమ్మ, వెంకటేశ్, భద్రయ్య, బైరి శ్రీనివాస్, ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.